
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు

25-4-'51

విషయానుక్రమణిక

25 ఏప్రిల్ 1951

"రాజూ - పేదా"

మరొక మార్క్-ట్వేన్ సీరియల్

పైవారం (2-5-1951) నుండి ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికలో మరొక మార్క్-ట్వేన్ రచన "రాజూ-పేదా" ప్రారంభమవుతున్నది. "టామ్‌సాయర్" సీరియల్‌ను ఆదరించినట్లే మా పాఠకులు దీనిని కూడా ఆదరిస్తారనీ, చదివి ఆనందిస్తారనీ ఆశిస్తున్నాం. ఆశాభంగం కలగకుండా ముందుగానే మీ కాపీ జాగ్రత్త చేసుకోండి.

—సంపాదకుడు.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును

Founder: K. NAGESWARA RAO

సంపుటము **43**
సంచిక **32**

ఖర సంవత్సర చైత్ర బహుళ చవితి బుధవారము

జనరల్ మెకార్థర్ బర్తరఫ్ కావడంతో చీనా కొరియాల విషయమై ట్రూమన్ ప్రభుత్వం వ్యవహార విధానాన్ని గురించి అమెరికాలో దేశవ్యాప్తంగా చర్చ బయలుదేరింది. మెకార్థర్ తన అభిప్రాయాల్ని గురించి అమెరికన్ కాంగ్రెస్లో ఉపన్యసించాడు. అమెరికన్ ప్రజకి తమ విధానాన్ని స్పష్టపరచాలనే ఉద్దేశంతో ప్రెసిడెంట్ ట్రూమన్, విదేశాంగ మంత్రి ఎచిసన్, సైనిక వైమానిక నౌకా దళాధిపతుల సంఘానికి చైర్మన్ అయిన జనరల్ ఒమార్ బ్రాడ్లీ ఉపన్యాసాలిచ్చారు. కొరియాలో యుద్ధస్థితిని గురించి మెకార్థర్ బర్తరఫ్ కాకముందు జనరల్ రిడ్జ్‌వే (ఇప్పుడు మెకార్థర్ స్థానే నియమితుడైన సమితిసేనల అధిపతి) ఇద్దరు కాంగ్రెస్ సభ్యులకు తెలిపిన అభిప్రాయాలు బహిరంగపరచబడినాయి. ఈ ఉపన్యాసాల్ని బట్టి, ఐక్యరాజ్యసమితి సమిష్టిచర్యల నిర్ణయసంఘంలో అమెరికన్ ప్రతినిధి వాదాన్ని బట్టి, అమెరికన్ ప్రభుత్వవిధానం ఇదివరకుకంటె స్పష్టపడింది.

జనరల్ మెకార్థర్ ఉపన్యాసాంశాల్ని గమనించి ఐక్యరాజ్యసమితిలో వివిధదేశాల ప్రతినిధులు సమితి ఆశయాలకీ, మెకార్థర్ ఆశయాలకీ చాలా వ్యత్యాసం ఉంటున్నారు.

జనరల్ మెకార్థర్ కమ్యూనిస్టు దేశాలపైన యుద్ధం జరిగేపక్షంలో వ్యూహం ఏ రీతిగా ఉండాలో, దాన్నిబట్టే ప్రధానంగా కొరియాసమస్యని పరిష్కరించాలంటాడు. అమెరికన్ ప్రభుత్వం లక్ష్యం కూడా ఇందుకు అనుగుణంగానే ఉంది కాని, ఈ వ్యూహాన్ని ఎప్పుడు ఏవిధంగా నిర్వహించాలి అనే విషయంలోమాత్రం మెకార్థర్‌తో అంగీకారం కుదరలేదు. తేడా ఇంతే. అయితే ఐక్యరాజ్యసమితిలో పశ్చిమయూరప్, ఆసియా ప్రతినిధుల అభిమతానికి అనుగుణంగా వ్యవహరిస్తున్నట్లు నటిస్తూ, తమ వ్యూహంలోకి ఆ దేశాల్ని లాగడానికి అమెరికన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మిగతా సమితి దేశాలు కూడివచ్చినా రాకపోయినా, ఇంక ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఈ వ్యూహాన్ని అమలు జరపాలని మెకార్థర్ యత్నం. జాప్యమైనాసరే సమితిదేశాల్ని కూడగట్టుకోవాలని అమెరికన్ ప్రభుత్వ ప్రయత్నం. అంటే మెకార్థర్ వ్యూహం, అమెరికన్ ప్రభుత్వవ్యూహం ఒక్కటే గాని, ఎప్పుడు, ఎలాగ అమలుజరపాలనే విషయంలోమాత్రమే భేద ముందన్నమాట. ఈ వ్యూహానికి బ్రిటన్ మొదలైన పశ్చిమయూరప్‌దేశాలు కాని ఆసియాదేశాలు కాని సుముఖంగా లేవు. యుద్ధం విస్తరించడానికి బాధ్యత తమపైన వేసుకోకుండా కమ్యూనిస్టుదేశాలపైనే పడేసి వ్యూహం నిర్వహించుకువచ్చినట్లయితే మిగతా సమితి దేశాలకు తలొగ్గక మార్గాంతరం ఉండదని అమెరికన్ ప్రభుత్వం అభిప్రాయం. కాని నిందను కమ్యూనిస్టుదేశాలపై పడేవరకూ జాప్యంచెయ్యడం మెకార్థర్‌కి ఇష్టంలేదు. సైనిక బలాబలాల దృష్ట్యా మెకార్థర్ సక్రమమని పరిస్థితుల్నిబట్టి స్పష్టపడుతూనే ఉంది.

ఈ భేదాలవల్ల ఫలితం ఏమిటంటే మెకార్థర్ ఈ యుద్ధవ్యూహాన్ని అమలులో పెట్టడానికి తొందరపడుతున్నాడనీ, మెకార్థర్ ఒక్కడే ఆసియాలో యుద్ధాన్ని విస్తరింప చెయ్యడానికి కుతూహలంగా ఉన్నాడనీ, మెకార్థర్ యుద్ధోన్మాది అనీ పశ్చిమయూరప్‌లోనూ ఆసియాలోనూ విపరీతంగా ప్రచారం జరిగింది. ఈ వ్యూహాన్ని గుంభనగా, పైకి తెలియనివ్వకుండా, ఇతరులపై నింద మోపి నిర్వహించుకుంటూపోతూ, ఇతర దేశాల్ని కూడా ఈ సుడిగుండంలోకి లాగాలని ప్రయత్నిస్తున్నందువల్ల అమెరికన్ ప్రభుత్వ విదేశాంగ వ్యవహారవిధానం అస్పష్టంగా, అసందర్భంగా ఉందనే అభిప్రాయం ఏర్పడింది. ఇందువల్ల అమెరికన్ ప్రభుత్వానికి కూడా ఆపాదించబడినంత అపఖ్యాతి మెకార్థర్‌కి వచ్చింది. కొరియాలో గ్రామాలకి గ్రామాలు, పట్టణాలకి పట్టణాలు అమెరికన్ బాంబులికి ఆహుతైపోయి, ఇదివరలో ఏ యుద్ధంలోనూ ఏ దేశానికీ సంభవించని ఘోరధ్వంసకాండకి కొరియాదేశం గురి

కావడంతో మెకార్థర్ యుద్ధనీతిపై ప్రపంచానికి రోత కలిగింది. మెకార్థర్‌వల్లనే అమెరికాకు ఇతర ఆంగ్లో-అమెరికన్ వర్గ దేశాల సహకారం సన్నగిల్ల నారంభించింది. పశ్చిమయూరప్‌లో 'మెకార్థరిజమ్' పట్ల వైరభావం వ్యాపించింది. మెకార్థర్‌ని ట్రూమన్ బర్తరఫ్ చెయ్యడానికిదే ముఖ్యకారణం.

కొరియా చీనాలపట్ల అమెరికావిధానాన్నీ లక్ష్యాన్నీ గమనించినట్లయితే, మెకార్థర్ వ్యూహానికీ, అమెరికన్ ప్రభుత్వ వ్యూహానికీ తరుణం మినహా. అన్యత్రా వ్యత్యాసం లేదని బోధపడుతుంది. అంతే కాదు. అమెరికా, ఇతరసమితి దేశాల సహకారంతో ఇప్పు డేం చెయ్యడానికి ప్రయత్నిస్తోందో బోధపడుతుంది.

ట్రూమన్ అట్లీలు కలిసి చేసిన ప్రకటనలోని ముఖ్యాంశాన్ని ట్రూమన్, ఎచిసన్ మొదలైనవారు ఇప్పుడు పదేపదే చెప్పుకు వస్తున్నారు. ఈ ప్రకటనల్లోని సారాంశం ఏమిటంటే 1. కొరియాయుద్ధాన్ని ప్రపంచ యుద్ధంగా విస్తరించనివ్వకూడదు. 2. అయితే దురాక్రమణని క్షమించరు. 3. ఏది చేసినా ఐక్యరాజ్యసమితి సహకారంతోనే చెయ్యాలి. 4. కొరియాయుద్ధం ఇతర ప్రాంతాలకు విస్తరించినట్లయితే, అది కమ్యూనిస్టుల ప్రేరేపణవల్లనే జరగాలి.

ఈ అంశాలతోపాటు మెకార్థర్‌కి ట్రూమన్ ఇచ్చిన అనుమతినీ, జనరల్ రిడ్జ్‌వే తెలిపిన అభిప్రాయాల్నీ చేర్చి చూసినట్లయితే అమెరికన్ ప్రభుత్వం వ్యవహార విధానం, లక్ష్యం బోధపడతాయి. కమ్యూనిస్టు విమాన బలాలవల్ల సమితి రక్షణశ్రేణికిగాని సమితివిమానబలాలకిగాని, సమితిసేనల రవానా సదుపాయాలకిగాని ముప్పువచ్చే పక్షంలో మంచూరియాలోని కమ్యూనిస్టు విమాన స్థావరాలపైన సమితి విమానాలు దాడిచేసి బాంబులు వెయ్యవచ్చునని ట్రూమన్ ఇదివరకే మెకార్థర్‌కి అనుమతినిచ్చాడు. రిడ్జ్‌వే తెలిపిన అభిప్రాయాలేమిటంటే; ఇప్పుడు యుద్ధం జరుగుతున్న పద్ధతిని, అంటే అదనపు సైన్యాల సహాయం లేకుండా, మంచూరియాపై బాంబులు వెయ్యకుండా జరుగుతున్న పద్ధతిని, ఇక ముందుకూడా జరగాలంటే, 1. కొరియాలో శత్రువుల్ని పూర్తిగా జయించడం అసంభవం. (మెకార్థర్ చెప్పిందీ ఇదే.) 2. ఉన్నచోటే నిలదొక్కుకుని, మీదికి వచ్చే కమ్యూనిస్టుల్ని చంపుతూ ఉండడానికి వీలుంటుంది (ఈ పద్ధతి మెకార్థర్‌కి సమ్మతం కాలేదు.)

క్రియకి అమెరికన్ ప్రభుత్వలక్ష్యం ఈ కిందివిధంగా స్పష్టపడుతోంది. కమ్యూనిస్టు విమానబలం రానంతవరకూ ఈ నెల్లాళ్ళుగా జరుగుతున్న పద్ధతినే యుద్ధం సాగుతూ ఉంటుంది. అడుగడుగూ జాగ్రత్తగా చూసుకుంటూ సమితిసేనలు ఉత్తరానికి ముందడుగు వేస్తూనే ఉంటాయి. ఉత్తర కొరియాలో కమ్యూనిస్టుల విమానాశ్రయాల్నీ, రవాణామార్గాల్నీ, సైనిక కేంద్రాల్నీ, అనుమానంకల గ్రామాలు పట్టణాల్నీ విమానదాడులవల్ల ధ్వంసం చేస్తూనే ఉంటారు. కమ్యూనిస్టు విమానబలాలు మంచూరియానించి వచ్చి ముప్పు కలిగించినట్లయితే, మంచూరియా మీద కూడా బాంబులు వెయ్యడం ప్రారంభిస్తారు. (ఇదివరలో కమ్యూనిస్టు విమానాలు రాకుండానే, ఈసాకు తీసుకుని మెకార్థర్ విమానాల్ని యాలూనది కుత్తరంగా పంపించాడు.) చీనాపై దురాక్రమణనేరం మోపుతూ సమితి చేత తీర్మానం చేయించి, చీనాతో రాజీ సమాలోచనలు జరిగే వీలులేకుండా అమెరికా ముందే జాగ్రత్తపడింది. కాబట్టి కొరియా సమస్య పరిష్కారాన్ని గురించి చీనా ప్రభుత్వానికి సమితి రాజ్యాలతో ప్రమేయం ఉండదు. చీనాసేనలు కేవలం ఉత్తరకొరియా ప్రభుత్వంతోనే ప్రమేయం కలిగి ఉంటాయి. ఇంక రాయబారాలవల్ల కొరియాసమస్య పరిష్కారం కావాలంటే ఉత్తరకొరియాతోనే అమెరికా మొదలైన రాజ్యాలు రాయబారాలు నడపాలి. ఇది సాధ్యపడనిపక్షంలో ఈ యుద్ధం ఇలా సాగిపోవలసిందే.

అమెరికన్ సేనల దౌష్ట్యాలను గురించి ఉత్తరకొరియాప్రభుత్వం సమితికి విజ్ఞాపన పంపింది. బెర్లిన్ శాంతి సంఘ తీర్మానం ప్రకారం కొరియా సమస్యను పరిష్కరించవలసిందని సమితిని కోరింది. (ఈ తీర్మానం వివరాల్ని మనకి ఏ వార్తాసంస్థా తెలియపరచ లేదు) కొరియా దేశంనించి సమితిసేనల్ని ఉ సంహరింప చెయ్యాలనీ, దౌష్ట్యాలకు కారకులైనవారిని యుద్ధనేరస్థులుగా పరిగణించి శిక్షించాలనీ ఈ తీర్మానంలో కోరబడినట్లు తెలుస్తోంది. దీనికి అమెరికాయే కాదు, ఇతర సమితిదేశాలు కూడా సమ్మతించడం అసంభవం. ఇటువంటి చెల్లని కోరికల్ని మినహాయించి చూస్తే, ఉత్తర కొరియా ప్రభుత్వం కొరియాలో యుద్ధం సమాప్తం కావాలని కోరుతున్నట్లు స్పష్టపడుతోందని బ్రిటిష్‌ప్రభుత్వం భావిస్తోందట.

అయితే చీనాసేన తిరిగి పెద్దపెట్టున యుద్ధంచెయ్యడానికి సన్నాహాలు చేస్తోందని సమితిసేనా కార్యాలయం తెలుపుతోంది. ఈమారు కమ్యూనిస్టు విమానబలాలుకూడా వారిసేనల దండయాత్రకు తోడ్పడగలవని వారంటున్నారు. ఇదే సంభవించినట్లయితే, సమితిసేనలీ ధాటికి తట్టుకోలేక పోయినట్లయితే, యుద్ధం చీనాదేశానికి వ్యాపింపచెయ్యడానికి అమెరికా వెనుకాడదు.

ఇటువంటి పరిస్థితి ఏర్పడినప్పుడు ఏం చెయ్యాలోకూడా అమెరికా ముందే వ్యూహం తయారుచేసిందని ట్రూమన్ ఎచిసన్‌ల ప్రకటనలు స్పష్టపరుస్తున్నాయి. బ్రిటన్ మొదలైన దేశాలకు రుచించేవిధంగా ఈ వ్యూహాన్ని అమెరికన్ ప్రభుత్వం ఏ పేరుతో పిలుస్తోందో తెలియదుగాని, అమెరికాలో తదితరులు మాత్రం 'చీనాతో పరిమితయుద్ధం' అని పిలుస్తున్నారు.

(48-వ పేజీ చూడండి)

సమస్యలు

[శ్రీ శ్రీకి క్షమాపణలతో]

క్రెమ్లిన్‌లో మార్షల్ స్టాలిన్,
వాల్ స్ట్రీట్‌లో హారీట్రూమన్!
ఎటు వేపుకు మొగ్గడమో
సమస్యమైందొక దేశానికి.
అటు చూస్తే సంస్కృతి సభలూ,
ఇటు చూస్తే శాంతి మహాసభ!
ఎట కేగుటో సమస్య తగిలిం
దొక తటస్థ వాదికి.
అటు చూస్తే రమణమహర్షి,
ఇటు చూస్తే కారల్ మార్క్స్!
ఎంచుకొనే సమస్య కలిగిం
దొక క్షామేడుకు.
అటు చూస్తే రంగాపార్టీ,
ఇటు చూస్తే 'ఎమ్ ఎల్ ఏ' సీట్!
రాజీనామా నివ్వడమో,
రాజీ బేరా లాడడమో,
సమస్యగా ఘనీభవించిం
దొక ఖద్దరుధారికి.

—సవ్యసాచి—

డైరీ

సోమవారం, ఏప్రిల్ 16 :

—బెర్లిన్ శాంతి సంఘ సమావేశ తీర్మానంలో నిర్దేశించబడిన ప్రకారం కొరియాలో యుద్ధాన్ని ముగింపచేసి, కొరియన్ ప్రజానీకాన్ని నాశనం చెయ్య సంకల్పించి ఘాతుకాలు జరుపుతున్న అమెరికన్ యుద్ధనేరస్థులను శిక్షించాలని ఉత్తరకొరియన్ ప్రభుత్వం ఐక్యరాజ్య సమితికి విజ్ఞప్తి చేసింది.

—యుద్ధాన్ని కొరియాకే పరిమితంచేసి మంచూరియాపైన బాంబులు వెయ్యడానికి అనుమతి నివ్వకపోతే యుద్ధాన్ని గెలవడం అసాధ్యమనీ, కాకపోతే వీలైనంతమంది చీనా కమ్యూనిస్టుల్ని చంపడానికి మాత్రం వీలుపడుతుందనీ మెకార్థర్ స్థానే నియమించబడిన రిడ్జివే ఇద్దరు అమెరికన్ కాంగ్రెస్ సభ్యులతో చెప్పినట్లు ప్రకటించబడింది.

— నేపాల్ సర్వసైన్యాధిపత్యం ప్రధాని మోహన్ షంషేర్ జంగ్ చేతుల నుంచి మహారాజాధిరాజు త్రిభువన వీర విక్రంషా తీసుకున్నారు.

—అస్సాం-తూర్పు బెంగాల్ సరిహద్దుల్లో అయిదుమైళ్లమేర ఎవరూ నివసించరాదని నిషేధించి తూర్పుబెంగాల్ ప్రభుత్వం గారో కొండల ప్రాంతాల కొండజాతులవారిని వెళ్లగొడుతున్నారని న్యూఢిల్లీకి వార్తలు చేరాయి.

—ఆంధ్రపితామహ శ్రీ మాడపాటి హనుమంతరావుగారు హైదరాబాద్ కార్పొరేషన్‌కు మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఈ నగరానికి కార్పొరేషన్ ఈ రోజునే స్థాపించబడింది.

—ఆంధ్రరాష్ట్ర చేనేత కాంగ్రెస్ ఆధ్వర్యం కింద చెన్నపట్నంలో చేనేత పనివారి సత్యాగ్రహం ప్రారంభమయింది.


—దక్కన్ ఎయిర్వేస్ కంపెనీ యాజమాన్యాన్ని భారతప్రభుత్వం తీసుకుని తపాలా రవానా చెయ్యడానికీ స్వయంగా ప్రయాణీకుల రవానా సర్వీస్ నడపడానికీ నిర్ణయించినట్లు, విమానయానాన్ని మొత్తంగా ప్రభుత్వం నిర్వహించదలుచుకోనట్లు మంత్రి కిద్వాయ్ పార్లమెంట్‌లో ప్రకటించారు.

—చెన్నరాష్ట్రంలో ప్లానింగ్ కమిటీలు పునర్నిర్మించబడినాయి.

—అఖిలభారత పత్రికా రచయితల సంఘ నియమావళి బొంబాయి ప్రత్యేక సమావేశంలో ఆమోదించబడింది.

—జైపూర్ మహారాజా, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ప్రో-ఛాన్సలర్ శ్రీ విక్రమదేవవర్మగారు శనివారంనాడు మృతిచెందినట్లు తెలిసింది.

—కర్నూలు - కడప కాలువను పొడిగించడానికి ప్రభుత్వం తలపెట్టలేదని మంత్రి భక్తవత్సలంగారు లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో చెప్పారు.



హైదరాబాద్ కార్పొరేషన్ మేయర్

శ్రీ మాడపాటి

హనుమంతరావుగారు

మంగళవారం, ఏప్రిల్ 17 :

—కొలంబో ప్రణాళిక నిమిత్తం ఇవ్వజూపిన ధనసహాయంలో కొంత భాగానికి బదులు గోధుమ తీసుకోవాలని కెనడా చేసిన సూచనను భారతప్రభుత్వం అంగీకరించింది.

—భారతదేశంలో కరువు నివారణ నిమిత్తం చందాలు పోగుచేసి గోధుమకొని పంపడానికిగాను ఐక్యరాజ్యసమితి ఉద్యోగులు ఒక సంఘాన్ని స్థాపించారు.

—సోవియట్‌రష్యాలో పారిశ్రామిక వ్యావసాయికోత్పత్తి వృద్ధినిమిత్తం అమలు జరపబడిన పంచవర్ష ప్రణాళిక నాలుగేళ్ల మూడుమాసాల్లోనే ఫలించిందనీ, అనుకున్నదాని కంటె 17% అధికంగానే ఉత్పత్తి పెరిగిందనీ ప్రకటించబడింది.



జైపూర్ మహారాజా

శ్రీ విక్రమదేవవర్మగారు

—పశ్చిమజర్మనీ నౌకాదళాన్ని అమెరికన్ ప్రభుత్వం నిర్మిస్తున్నట్లు బ్రెమెర్‌హావెన్‌లో ప్రకటించబడింది.

—ఎన్నికల్ని నవంబర్ డిసెంబర్ మాసాలలో కాకుండా ఫిబ్రవరిలో జరపాలని సూచిస్తూ మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్లో ప్రతికూల పక్షనాయకుడు ప్రతిపాదించిన తీర్మానం ఆమోదించబడింది. ఈ తీర్మానాన్ని ప్రభుత్వపక్షం కూడా బలపరిచింది.

—పారిశ్రామిక వ్యావసాయిక కార్మికుల కనీస వేతనాలను నిర్ణయించే గడువును 1953 మార్చి 31 వరకూ ఇస్తూ పార్లమెంట్‌లో శాసనసవరణ ఆమోదించబడింది.

—నూతన రాజ్యాంగ నియమవిధి ప్రకారం, పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమాలు మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ ఆమోదం పొందాయి.

—ఢిల్లీలో రిక్షాలు నిషేధించబడినాయి.

బుధవారం, ఏప్రిల్ 18 :

—జపాన్‌తో శాంతి సంధి అమలు జరపడం తోపాటు, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ రాజ్యాలతో అమెరికా పరస్పర రక్షణ సహాయపు టొడంబడిక చేసుకుంటుందని ప్రెసిడెంట్ ట్రూమన్ ప్రకటించారు.

—కొరియాలో అమెరికా వ్యవహార విధానాన్ని విదేశాంగ మంత్రి డీన్ ఎచిసన్ వివరించారు.

—విద్యాసంస్థలలో ప్రవేశానికీ, ప్రభుత్వోద్యోగుల నియామకానికీ కుల నిష్పత్తి ఉత్తరువు అమలు జరపరాదని సుప్రీం కోర్టు నిర్ణయించడంవల్ల, ఈ ఉత్తరువు ఆశయాన్ని సాధించడానికి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తూ మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్లో ప్రవేశపెట్టబడిన అనధికార తీర్మానం ఆమోదించబడింది. ప్రభుత్వ పక్షం తీర్మానాన్ని బలపరిచింది.

గురువారం ఏప్రిల్ 19 :

—జనరల్ మెకార్థర్ కమ్యూనిస్టుల్ని అణచడానికి అవలంబించవలసిన విధానాన్ని గురించి అమెరికన్ కాంగ్రెస్‌లో ఉపన్యసించాడు.

—రూర్ పరిశ్రమలపైన మిత్రరాజ్యాల ఆధ్వర్యాన్ని తొలగించడానికి ఫ్రాన్స్ సమ్మతించినందుకు బ్రిటిష్ ప్రభుత్వం తన అసమ్మతిని తెలియపరిచింది.

—కేంద్రప్రభుత్వ పాలిత ప్రాంతాల నుంచి పార్లమెంట్‌లో షెడ్యూల్డ్ తరగతులకు ఆదిమనివాసులకు ప్రత్యేక స్థానాలను రిజర్వ్ చేసే శాసనం పార్లమెంట్ చేత ఆమోదించబడింది.

శుక్రవారం, ఏప్రిల్ 20 :

—ఉత్తరకొరియాలో కమ్యూనిస్టు సైన్యాలు రక్షణ శ్రేణిని విడిచివెళ్లిపోయినాయనీ, సమితిసేనలు యుద్ధం చెయ్యకుండానే పురోగమిస్తున్నాయనీ టోకియో వార్తలు తెలుపుతున్నాయి.

—ఫార్మోజాలో చియాంగ్ సహాయార్థం అమెరికన్ ప్రభుత్వం సైనిక సహాయక వర్గాన్ని పంపించడానికి నిశ్చయించింది.

—చీనాప్రభుత్వం ఇవ్వచూపిన పది లక్షల టన్నుల బియ్యాన్ని గురించీ సమాలోచనలు జరపడానికి భారతప్రభుత్వం ఒక రాయబారవర్గాన్ని పెకింగ్ నగరానికి పంపింది.

—దక్షిణాఫ్రికాలో జాతివివక్షతపట్ల నిరసన సూచకంగా గాంధీమహాత్ముని కుమారుడు శ్రీ మణిలాల్ గాంధీ ప్రారంభించిన 14 రోజుల నిరాహారదీక్ష నేటితో ముగిసింది.

—ఆంధ్ర కాంగ్రెస్ వ్యవహారాలను గురించి సంజీవరెడ్డిగారు బెంగుళూరులో కాంగ్రెస్ అధ్యక్షులు టండన్ గారితో సంప్రదించారు.

—హైదరాబాద్ రాజ్య ఆర్థికాభివృద్ధికి తలపెట్టబడిన రు 40 కోట్ల ప్రణాళిక నిమిత్తం రు 10 కోట్లు కేంద్రప్రభుత్వం ఇవ్వడానికి నిర్ణయించింది.

శనివారం, ఏప్రిల్ 21 :

—అమెరికన్ మాజీసెనేటర్ ఫ్రాంక్ గ్రహామ్‌ను కాశ్మీర్‌లో మధ్యవర్తిగా నియమించడానికి భద్రతామండలి నిర్ణయించినట్లు ఢిల్లీ వార్త తెలుపుతోంది.

—అమెరికాలో యథార్థవార్తల్ని కప్పిపుచ్చడానికి అమెరికన్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అమెరికన్ పత్రికా సంపాదకుల సంఘం ఆరోపించింద.

—జలియన్ వాలా బాగ్ స్మృతి చిహ్నం ఒకటి నెలకొల్పడానికి ప్రవేశపెట్టబడిన శాసనం పార్లమెంట్ చేత ఆమోదించబడింది.

—కిరసనాయిలుపైన సర్ చార్జి, బీడీ, ముక్కుపొడి వగైరాల నిమిత్తం తయారు చెయ్యబడిన పొగాకు సరుకుపైన పన్ను వ్యక్తిగత ఆదాయాలపైన సూపటాక్స్ తొలగించడానికి ఫైనాన్స్ బిల్‌లో సెలక్టు కమిటీ సవరణలు చేసింది.

—పశ్చిమబెంగాల్ కమ్యూనిస్టుపార్టీ సాహసకృత్యాలను త్యజించి పార్లమెంటరీ ఎన్నికల్లో పాల్గొని అధికారం చేపట్టడానికి కృషిచెయ్యాలని నిర్ణయించింది.



ఎనైరిన్ బెవాన్

ఆదివారం ఏప్రిల్, 22 :

—బ్రిటిష్ ప్రభుత్వ కార్మిక శాఖా మంత్రి ఎనైరిన్ బెవాన్ రాజీనామా నిచ్చారు.

—ఫార్మోజాద్వీపాన్ని విరోధుల చేతుల్లో పడకుండా కాపాడ్డం అమెరికన్ ప్రభుత్వం ఉద్దేశమని అమెరికన్ ఎటార్నీ జనరల్ ప్రకటించారు.

—జపాన్‌తో సంధిచేసుకునే విషయంలో అమెరికా పూర్వపు టొడంబడికల్ని అతిక్రమిస్తున్నదని పెకింగ్ రేడియో ఆరోపించింది.

—బ్రిటిష్ ప్రతిపాదనలకు సమాధానంగా బ్రిటిష్ సైన్యాలను తొలగించి తీరాలని ఈజిప్ట్ ప్రభుత్వం తెలియపరిచింది.

—కొలంబో ప్రణాళిక ననుసరించి భారతవిద్యార్థులకు టెక్నికల్ ట్రెయినింగ్ ఇవ్వడానికిగాను కెనడాప్రభుత్వం ఇవ్వచూపిన సౌకర్యాలకు భారతప్రభుత్వం సమ్మతించింది.

—కోర్టుల తీర్పుల్ని తప్పించుకుని వ్యవహరించడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న పద్ధతుల్ని నిరసిస్తూ బొంబాయి లాయర్ల సమావేశం తీర్మానం చేసింది.

★

సీరియల్ నవల:

కౌంట్ ఆఫ్ మాంటిక్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

27

"ఈ కథంతా ఏకరువు పెట్టేముందు ముఖ్యంగా మిమ్మల్ని ప్రార్థించవలసింది ఒకటుంది." అన్నాడు కాడరూస్. "నేనెవర్నిగురించి ఇప్పుడు చెప్పబోతున్నానో వారిప్పుడు ధనాఢ్యులు, అధికారసంపన్నులు. తల్చుకుంటే నన్ను చిటికలో నాశనం చెయ్యగలరు. అందువల్ల నేనిప్పుడు చెప్పే సంగతుల్ని ఎక్కడైనా ఎప్పుడైనా మీరు ఉపయోగించవలసివచ్చినట్లయితే, వీటిని నేను తెలియపరిచినట్లు బయటపెట్టకూడదు. అలాగని మీరు వాగ్దానమివ్వండి."

"ఆ విషయమై మీరు భయపడనవసరంలేదు" అన్నాడు ఫాదరీ. "నేను మతబోధకుణ్ణి. నావద్ద ఎవరు ఏరహస్యాల్ని చెప్పుకున్నా భద్రంగా దాచగలను. మీరు నిస్సంకోచంగా సర్వం నావద్ద చెప్పవచ్చును. కోపద్వేషాలు మరిచి నిష్పక్షపాతబుద్ధితో అన్నీ చెప్పండి. సత్యమే చెప్పండి. అసత్యం వద్దు. నేను భగవత్సేవాతత్పరుణ్ని. మనుష్యుల రాగద్వేషాలతో నాకు నిమిత్తం లేదు. ఈ కర్తవ్యం నెరవేరగానే నేను నా మతప్రచారకసంస్థకి తిరిగి వెళ్ళిపోతాను. మరణోన్ముఖుడైన ఒక వ్యక్తి అంతిమప్రార్థన పాలించడానికి నా చోటు విడిచివచ్చాను. అంతే."

ఈ మాటలతో కాడరూస్ స్థిమితపడ్డాడు. "సరే అయితే. సర్వం నిస్సంకోచంగా చెప్పేస్తాను. డాంటే నమ్మిన ఈ స్నేహితుల వాస్తవగుణగణాల్ని తెలిపి, జరిగిన మోసాన్ని మీకు తెలియపరచాలి."

"ముందుగా అతని తండ్రిని గురించి మొదలుపెట్టండి. -యన్ని గురించి ఎడ్మండ్ నాతో ఎప్పుడూ చెప్తూఉండేవాడు. అతనికి తండ్రిపట్ల అపారమైన ప్రేమ."

"అది తల్చుకుంటే చాలు దుఃఖం వస్తుందండి" అన్నాడు కాడరూస్. "మొదట ఏం జరిగిందో మీకు తెలిసే ఉంటుంది."

"అవును. అతను అరెస్టయేవరకూ ఏం జరిగిందో ఎడ్మండ్ చెప్పాడు."

"అరెస్టయినది రిజర్వ్ హోటల్లో. ఇప్పుడది తల్చుకుంటే అంతా మళ్లీ నాకళ్ల ఎదుట జరుగుతున్నట్లుంటుంది. పాపం అప్పుడక్కడ అతని పెళ్లి ప్రధానపు విందు జరుగుతోంది. ఎంత ఆనందంతో ప్రారంభమయిందో ఆ విందు అంత దారుణంగా ముగిసింది. ఒక పోలీసుఅధికారి, నలుగురు సిపాయిలు వచ్చి డాంటేని అరెస్టుచేశారు."

"నాకు సరిగ్గా అంతవరకే తెలుసును."

"డాంటే అరెస్టుకాగానే మారెల్ సమాచారం తెలుసుకోడానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చెప్పిన సమాచారం విని అందరూ విచారపడ్డారు. అతని తండ్రి ఒక్కడూ ఇంటికి తిరిగి వెళ్లాడు, పెళ్లికిధరించిన సిల్కుదుస్తులు తీసేశాడు. ఆ రోజూ ఆరాత్రీ ఏడుస్తూనే ఉన్నాడు. పక్కనే నేనుండే వాడిని. నిద్రపోకుండా పచారుచేస్తున్న అతని అడుగుల చప్పుళ్ళు రాత్రంతా వినపడుతూనే ఉన్నాయి. మరునాడు ప్రొద్దున్న మర్సిడా విల్ఫర్ట్ దగ్గరకెళ్లి డాంటేని రక్షించాలని ప్రాధేయపడింది. కాని ఉపయోగం లేకపోయింది. తరవాత వృద్ధుడిదగ్గర కెళ్లి తన ఇంటికిరమ్మని బతిమాలుకుంది. అతని దుఃఖానికి మితిలేదు. అతన్ని ఎవరికీ పట్టతరం కాలేదు. రానని చెప్పాడు. 'నేను రాను. ఈ యిల్లు విడిచిపెట్టి రాను' అన్నాడు. 'డాంటేకి నాపైన ఉన్నంత ఆపేక్ష మరెవరిపైనా లేదు. ఖైదునించి విడుదలైవస్తే, తప్పకుండా నాకోసం పరుగెత్తుకుంటూ వస్తాడు. నేనిక్కడ అదనుకి లేకపోతే ఏమనుకుంటాడు?' నాకతని మాటలు వినపడుతూనే ఉన్నాయి. ఎలాగైనా అతన్ని మర్సిడా ఇంటికి పంపాలని అనుకున్నాను. రాత్రివేళ నిద్రలేక తిరుగుతున్న అతని అడుగుల చప్పుడు వల్ల నాకు ఒక్క క్షణం విశ్రాంతి లభించలేదు."

"మీ అంతట మీరు వెళ్లి ఆయన్ని సముదాయించడానికి ప్రయత్నించలేదా?"

"సముదాయించడానికి వీలెక్కడ? వినేవారైతే ఏదైనా చెప్పవచ్చును. వినకూడదనుకున్న వారికేం చెప్పగలం? ఏం చెప్పినా అతను వినదల్చుకోలేదు. అదీకాక, అతనికి నేనంటే అంత ఇష్టం లేదనుకుంటాను. ఎందుకో తెలియదు. అయినా సరే ఒకరోజు రాత్రి అతని ఏడుపువిని ఇంక ఊరుకోలేకపోయాను. పైకివెళ్లి తలుపుదగ్గర నిలబడ్డాను. వెంటనే అతను ఏడ్పు మానేసి భగవంతుణ్ని ప్రార్థించడం మొదలుపెట్టాడు. అతని మొరవిని నాకు గుండె బద్దలయింది. నేనూ ఒక తండ్రిని కానందుకు ఆ క్షణంలో దేవుడికి నమస్కారం చేశాను. నేనే తండ్రినై, అటువంటి కష్టం వచ్చినట్లయితే, భరించలేక సముద్రంలోపడి ప్రాణాలు తీసుకునే వాడినే."

"అయ్యో పాపం." అన్నాడు ఫాదరీ, అస్పష్టంగా.

"రోజులు గడిచినకొద్దీ అతను ఎవరితోనూ మాట్లాడేవాడు కాడు. మారెల్, మర్సిడామాత్రం అతన్ని చూడ్డానికి తరుచు వచ్చేవారు. నిత్యం గదితలుపులు మూసుకునే వాడు. వాళ్లు పిలిస్తే లోపలఉండికూడా పలికేవాడు కాదు. ఒకనాడు మాత్రం మర్సిడా పిలవగానే పలికి లోపలికి తీసుకెళ్లాడు. పాపం ఆమెకి దుఃఖం ముంచుకువస్తున్నా, అణుచుకుని, వృద్ధుని సముదాయించడానికి ప్రయత్నించింది. వృద్ధుడు ఆమెతో ఇలా అన్నాడు: 'అమ్మాయ్! నామాట నమ్ము. వాడింక బతికిలేడు. చచ్చిపోయాడు. వాడికోసం మనం కనిపెట్టుకుని కూచోకూడ

అనువాదం: సీతారామ్

దింక. మనకోసమే వాడు చూస్తున్నాడు. నాకు వయస్సు మీరిపోయింది. ఫరవాలేదు. ఆట్టే రోజులుపట్టదు. అందరికంటె ముందుగా నేనే వాడిదగ్గర కెడతాను.' అన్నాడు.

"నిత్యం దుఃఖిస్తూ ఇతరుల్ని దుఃఖపెట్టేవారిని క్రమేణా అందరూ విడిచిపెట్టేస్తారు. చివరికి లూయీ డాంటేనికూడా అందరూ అలాగే ఒంటరిగా విడిచిపెట్టేశారు. తరవాత మేడమీదికి వెళ్లేవాళ్లే కనపడలేదు నాకు. ఎప్పుడైనా అరుదుగా కొత్త ముఖాలు కనపడేవి. వాళ్లు దిగి వెళ్లిపోయేటప్పుడు ఏవో పొట్లాలు దాచుకొని తీసుకువెళ్లేవాళ్లు. అవేమిటో నాకు కొన్నాళ్లతరవాతగాని తెలియలేదు. రోజు గడవనంగువల్ల రోజురోజూ ఇంట్లో సామాన్లు అమ్మేవాడు. అవ్వే ఆ మూటలు. చిట్టచివరికి పాపం తన దుస్తుల్ని కూడా అమ్ముకోవలసివచ్చింది. గదికి మూడుమాసాల అద్దె బాకీపడ్డాడు. తీర్చకపోతే ఇంటిలోనించి నెట్టివేస్తానని యజమాని బెదిరించాడు. వారం రోజులు గడువివ్వవలసిందని అతని కాళ్లు పట్టుకున్నాడు. యజమాని ఒప్పుకున్నాడు. ఇదంతా నాకు ఎల్లా తెలిసిందంటె, యజమాని అతనివద్దనించి తిన్నగా నాదగ్గరకే వచ్చి చెప్పాడు. మూడురోజులూ రాత్రీ పగలు వృద్ధుడు గదిలో పచార్లు చేస్తూనే ఉన్నాడు. నాలుగో రోజుని నిశ్శబ్దమైపోయింది. ధైర్యంచేసి అతని గదికి వెళ్లాను. తలుపు వేసిఉంది. తాళపుకన్నం లోనించి తొంగిచూశాను. అతను తెల్లగా పాలిపోయి ఉన్నాడు. బొత్తిగా సత్తువలేనట్టుగా ఉన్నట్లు కనిపించాడు. జబ్బుగా ఉన్నాడని భయపడి, ఈ సంగతి మొరెల్‌కీ, మర్సిడాకీ తెలియపరిచాను. ఇద్దరూ కంగారుగా వచ్చారు. మొరెల్ వైద్యుని కూడా తీసుకొచ్చాడు. వైద్యుడు జ్వరమని తేల్చాడు. ఆహారం ఆట్టే ఇవ్వకూడదన్నాడు. నేనక్కడే ఉన్నాను. ఈ మాట విని అతను నవ్విన చిరునవ్వు నేనెన్నడూ మరిచిపోలేను. ఆపైన ద్వారం తెరిచే ఉంచేవాడు. ఆహారం తీసుకోకుండా మానడానికి మంచి సాకు దొరికిందిప్పుడతనికి"

ఫాదరీ గాఢనిశ్వాసం విడిచాడు. అది అణుచుకున్న మూలుగులాగుంది.

"తరవాత మర్సిడా వచ్చింది. అతని స్థితి బొత్తిగా మారిపోయినట్లు కనిపెట్టింది. వెంటనే తన ఇంటికి తీసుకుపోతానని చెప్పింది. మొరెల్ కూడా అదే మంచిదన్నాడు. బలవంతానైనా సరే తీసుకుపోవాలని ఇద్దరూ ప్రయత్నించారు. కాని ఒప్పుకోక అతను పెట్టిన కేకలూ పెడబొబ్బలూ విని భయపడి ఊరుకున్నారు. మర్సిడా అతనివద్దనే ఉండిపోయింది. మొరెల్ కిటికీవంకకను సంజ్ఞచేసి వెళ్లిపోయాడు. కిటికీలో అతను ఒక పర్సులో ధనం ఉంచివెళ్ళాడు. కాని వృద్ధుడు ఆహారం తీసుకోడానికి నిరాకరించాడు. తొమ్మిది రోజులు ఆహారం నీళ్లు ముట్టకుండా గడిపాడు. తనకీ దుర్దశ తెచ్చిపెట్టినవాళ్లని నిందిస్తూ, చివరికి ప్రాణాలు విడిచాడు. ఆఖరిమాటగా మర్సిడాతో 'అమ్మాయీ, నువ్వు కాని ఎడ్మండ్‌ని చూడ్డం సంభవించినట్లయితే, అతన్ని ఆశీర్వదిస్తూ నేను మరణించానని చెప్పు' అన్నాడు."

ఫాదరీ లేచి సావడిలో రెండుసార్లు అటూ ఇటూ పచారు చేశాడు. వొణుకుతున్న చేతులతో ఎండిపోయిన పెదవులు తడువుకున్నాడు. "మీ ఉద్దేశంలో, ఆయన చనిపోవడం కేవలం..."

"ఆకలివల్ల నేనండి. ఆకలివల్ల నే" అన్నాడు కాడరూస్. "నేను క్రైస్తవుణ్ని. క్రీస్తుదేవుడిమీద ప్రమాణంచేసి చెప్తున్నాను."

ఫాదరీ గ్లాసు అందుకుని ఒక్క గుక్కలో అంతా తాగేశాడు. "ఘోరం!" అన్నాడు.

"ఇంతా అంతా ఘోరంకాదండి. అది కేవలం అతని కత్నం అనుకోడానికి కూడా వీల్లేదు. ఈ ఘోరానికి కారకులు మనుష్యులే."

"సరే చెప్పండి, ఆ మనుష్యుల్ని గురించి" అన్నాడు ఫాదరీ. "కాని ఇది మరిచిపోవద్దు మీరు ఒక్కటీ దాచకుండా సర్వం చెప్తానని మాటిచ్చారు. నిర్బంధంలోకొడుకునూ, ఆకలితో తండ్రి చచ్చిపోడానికి కారకులైన ఈ మనుష్యు లెవరు?"

"అతనిపట్ల అసూయవహించినవాళ్ళిద్దరు దీనికంతకీ కారకులు. ఒకరికి ప్రేమ వ్యవహారంలో, మరొకరికి ఉద్యోగవిషయంలో అసూయ కలిగింది. వాళ్లు ఫెర్నాండో, డాంగ్లర్."

"ఈ అసూయ నెలా కక్కారు వాళ్లు?"

"ఎడ్మండ్ బోనపార్టిస్టు ఏజంటని పోలీసులికి తెలియపరిచారు."

. "తెలియపరిచింది ఇద్దరిలోనూ ఎవరు? దోషి ఎవరు?"

"ఇద్దరూ దోషులే. పెళ్లి జరగవలసింది రేపనగా, సాయంకాలం రిజర్వ్ హోటల్లో కూర్చుని ఆ ఉత్తరాన్ని డాంగ్లర్ ఎడమచేత్తో వ్రాశాడు. ఫెర్నాండో దానిని అధికారులికి పంపాడు."

"కాని అప్పుడు మీరుకూడా అక్కడే ఉన్నారు కదా?" అన్నాడు ఫాదరీ కొంచెం విసుగుదలతో. సంగతులన్నీ మీకు వివరంగా తెలిసేఉండాలి కదా!"

కాడరూస్ గతుక్కుమన్నాడు. "నిజమేనండి. నేనక్కడే ఉన్నాను."

"అయితే ఈ పాపకార్యాన్ని మీరు అడ్డుకోలేకపోయారా? అంటే, వాళ్లకుట్రలో మీరుకూడా చేరి ఉన్నారన్నమాట?"

"అయ్యో! నన్ను ఆపూట చెడతాగబెట్టేశారు. నాకు సగం చైతన్యం ఉడిగిపోయింది. అంతా చూస్తూనే ఉన్నాను. కాని ఏదో తెరలోనించి చూస్తున్నట్లుగా ఉందప్పుడు. ఆస్థితిలో ఎంత వీలుంటుందో అంతా వాళ్ళకి చెప్పిచూశాను. కాని అదంతా ఊరికే వేళాకోళానికే నన్నారు వాళ్లు."

"కాని మర్నాడు వాళ్లు నిజంగానే తంత్రంపన్ని నెరవేర్చారని మీకు తెలిసిపోయుండాలి. అయినా సరే అతను అరెస్టయినప్పుడు అక్కడే ఉండికూడా మీ రేమీ చెప్పనేలేదు."

"అదీ నిజమేనండి. నాకు అంతా చెప్పెయ్యాలనే ఉం ". కాని డాంగ్లర్ అడ్డుకున్నాడు. 'అతనే దోషి అయినట్లయి , ఎల్బాద్వీపంనించి అతను ఆ ఉత్తరాన్నే తీసుకువచ్చినట్లయితే, అది పోలీసులికి దొరుకుతుంది. దొరికినప్పుడు అతనిపక్షాన మాట్లాడిన వాళ్లకికూడా శిక్ష పడుతుందియ్యే, అని నన్ను భయపెట్టాడు. అప్పుడు రాజకీయాల పేరుచెప్తే చాలు భయంతో వొణికిపోయేవాడిని. అందుచేత నోరుమూసుకుని ఊరుకున్నాను. అది ఒట్టి పిరికితనమేనని ఒప్పుకుంటాను. కాని నేను ఏ పాపం చెయ్యలేదు."

"సరే అర్థమయింది. అదంతా జరుగుతోంటే మీరు చూస్తూ ఊరుకున్నారు! అంతే!"

"అవునండి. దానివల్ల, ఆ తరవాత నేను పశ్చాత్తాపంతో దుఃఖించని రోజు లేదు. నేను చేసిన ఈ ఒక్క చిన్న పాపానికీ నన్ను క్షమించి కాపాడవలసిందని భగవంతుని ప్రార్థిస్తూనే ఉన్నాను. నేను ఇప్పుడనుభవిస్తున్న కష్టాలన్నిటికీ అదే కారణమనికూడా అనుకుంటూ ఉంటాను. ఆ ఒక్క క్షణం స్వార్థంతో చేసిన ఆ పాపానికి ఇప్పుడనుభవిస్తున్నాను. అందుకే నా భార్యతో, ఎప్పుడూ ఇదంతా భగవన్నిర్ణయం అంటూఉంటాను."

"మీరు దాచకుండా అంతా చెప్పారు. అల్లా చేసినదోషం

తెలుసుకుని పశ్చాత్తాపపడుతున్నారంటే మీరు క్షమార్హులన్న మాట."

"నా దురదృష్టవశంవల్ల ఎడ్మండ్ మాత్రం నన్ను క్షమించకుండానే చచ్చిపోయాడు."

"కాని ఇదంతా అతనికి తెలియదులెండి..."

"అప్పుడు తెలియకపోతేనేం? ఇప్పుడు తెలుసును. చచ్చిపోయిన వాళ్ల ఆత్మలకు అంతా తెలుస్తుందంటారుగా."

ఫాదరీ కొంతసేపు గదిలో పచారుచేసివచ్చి మళ్లీ కుర్చీలో కూర్చున్నాడు.

"మీ రిప్పటికి రెండు మూడుసార్లు మారెల్ అంటూ చెప్పారు. ఆయ నెవరు?"

"ఆయన ఫరావోనాక యజమాని. ఆయన ఓడలోనే డాంటీ కెప్టెన్ పనిచేశాడు.

"ఆయన ఈవిషయంలో ఏం చేశాడు?"

"నిజాయితీఅయినవాడు, భీతిలేనివాడు, జాలికలవాడు, ఏం చెయ్యగలడో అదే చేశాడు. అనేకసార్లు డాంటెని విడుదలచేయించడానికి ప్రయత్నించాడు. చక్రవర్తి తిరిగి సింహాసన మెక్కినప్పుడు అర్జీలు పెట్టాడు. ప్రార్థించాడు. ఉద్యోగుల్ని బెదిరించాడు. దీనికి ఫలితం ఏమిటంటే, నెపోలియన్ మళ్ళీ సింహాసనభ్రష్టుడు కాగానే న్ని నానాతిప్పలూ పెట్టారు. డాంటీ తండ్రిని చూడ్డానికి పదిపన్నెండుసార్లు వచ్చిఉంటాడు. తన వెంట తీసుకువెడతానన్నాడు. అతని ఋణాలు తీర్చడానికీ, అంత్యక్రియలు జరపడానికీ ధనం అతనే ఇచ్చాడు. వృద్ధుడు చనిపోయేసరికి ఎవ్వరికీ ఒక్క రాగిడబ్బు బాకీలేడు. అంతా తీరిపోయింది. మారెల్ వృద్ధుని కిచ్చిన పర్సు ఇంకా నా దగ్గిరుంది. ఎర్రని ఊలుతో అల్లింది ఆపర్సు."

"మారెల్ ఇంకా జీవించి ఉన్నారా? నిజంగా ఆయన ఉత్తముడై ఉంటాడు. ఆయనకిధనం, ఐశ్వర్యం ఉన్నాయా?"

కాడెరూస్ విరసంగా నవ్వాడు: "ఆ. నా కెంత ఐశ్వర్యం ఉందో ఇప్పుడతనికీ అంతే ఉంది. బొత్తిగా పేదవాడై పోయినాడు. అంతేకాదు. ఇప్పుడు పరాభవం జరగడానిక్కూడా సిద్ధంగా ఉంది. పాతికేళ్లు కష్టపడి మార్సేల్స్ నగరంలో పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న మారెల్ సర్వనాశన మైనాడు. రెండేళ్ల అయిదు ఓడలు పోయినాయి. మూడుసార్లు దివాలా తీశాడు. ఇప్పుడింక ఆయనకి మిగిలింది డాంటీ పనిచేసిన ఈ ఫరావో నాక ఒక్కటే. దీనిమీదే ఆశలన్నీ పెట్టుకుని బతుకుతున్నాడు. అదిప్పుడు భారతదేశంనుంచి నీలిమందు తీసుకుని రావలసిఉంది. మిగతావాటికిమల్లేనే ఈ ఓడ కూడా పోయిందంటే అతనిపని ఆఖరన్న మాటే."

"పాపం" అన్నాడు ఫాదరీ. "ఆయనకి భార్య, పిల్లలు ఉన్నారా?"

"ఉన్నారు. ఆయన భార్య ఉత్తమఇల్లాలు. కష్టాలన్నిటినీ ఓరిమితో సహించింది. కూతురొకామె ఉంది. ఆమె పెళ్లాడబోతున్న యువకుడితో, అతని మిత్రులు మారెల్ స్థితి చూసి, ఈ పెళ్లి వద్దంటున్నారు. కొడుకొకడున్నాడు. అతను సైన్యంలో లెఫ్టినెంట్. పాపం ఆ ముసలివాని కష్టాలు రోజురోజుకీ ఎక్కువౌతున్నాయి. తనపైన ఆధారపడేవాళ్లే లేకపోతే, అతనెప్పుడో చేతులారా ప్రాణాలు తీసేసుకు నేవాడే."

"పాపం! ఎంత దుస్థితి!" అన్నాడు ఫాదరీ.

"మంచితనానికి భగవంతుడిచ్చే ప్రతిఫలం ఇదేనండి. నామాటే చూడండి. నేను మీ దగ్గిరొప్పుకున్న ఈ ఒక్కటితప్ప, ఈ జన్మలో, ఇంతవరకూ ఏపాపం మూసి ఎరగనండి. అయినా దుర్భరదారిద్ర్యం అనుభవిస్తున్నాను. నాభార్య అల్లాగే జ్వరంతో తీసుకుని తీసుకుని రేపోమాపో చచ్చిపోతుంది. నేనామె కేమీ చెయ్యలేకపోయినానుకదా! డాంటీ తండ్రి మాదిరిగానే నేనూ ఆకలితో మాడి చచ్చిపోవలసినవాడినే. ఫెర్నాండో, డాంగ్లర్ సుఖైశ్వర్యాలలో మునిగి తేలుతున్నారు."

"నిజంగా?"

"నిజంగానే. వాళ్లపనే బాగుంది. నీతైనవాళ్లపనే ఎప్పుడూ పాడుగా ఉంది."

"అందరిలోకీ దుర్మార్గుడు డాంగ్లర్. ఏం చేస్తున్నాడిప్పుడు?"

"అతను అప్పుడే మార్సేల్స్ నగరం విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. అతను చేసిన దుర్మార్గం తెలియక మారెల్ అతనికి సిఫార్సు చెయ్యగా, ఒక స్పానిష్ బాంకర్ వద్ద గుమాస్తా ఉద్యోగం దొరికింది. యుద్ధకాలంలో ఫ్రెంచి సైన్యపు సామగ్రి సరఫరా శాఖలో ఉద్యోగం సంపాదించి అపారంగా ధనం ఆర్జించాడు. తరవాత వ్యాపారంలో జూదమాడి సంపాదించినదాన్ని మూడింతలు చేసుకున్నాడు. స్పానిష్ బాంకర్ కూతుర్ని పెళ్లిచేసుకున్నాడు. ఆమె చనిపోయిన తరవాత రాజోద్యోగి కూతురొకామెను పెళ్లిచేసుకున్నాడు. ఆమె వితంతువు. రెండో మామగారు అధికారి. పరపతి కలవాడు. తరవాత లక్షలుగడించి బారన్ అయినాడు (బారన్ అంటే, ఇంగ్లండ్‌లో లార్డ్స్ మాదిరిగానే సామంతప్రభువుల ప్రతిపత్తి కలవారు.) ఇప్పుడు బారన్ డాంగ్లర్ మాంట్‌బ్లాంక్ వీధిలో ఒక పెద్ద భవనంలో నివసిస్తున్నాడు. ఆయన కిప్పుడు, పది గుర్రాలున్నాయి. నౌకర్లు చాకర్లు ఉన్నాడు. అనుభవిస్తున్నాడు. ఇప్పుడాయన కెన్ని లక్షలున్నాయో తెలియదు."

"ఓహో!" అన్నాడు ఫాదరీ, అదొక వింతస్వరంతో. "అయితే ఆయన చక్కగా ఆనందిస్తున్నాడన్నమాట!"

"ఆనందించడమా? అదేమో నాకు తెలియదు. ఎవరు చెప్పగలరు? సుఖంకాని కష్టంకాని నాలుగు గోడలమధ్యనూ దాగే రహస్యాలు. గోడలకివినడానికి చెవులుంటాయికాని, చెప్పడానికి నాలుకలుండవు. అపారధనమే సౌఖ్యం తెచ్చిపెట్టగలిగితే, తప్పకుండా సుఖపడుతున్నాడనే చెప్పాలి.

"ఫెర్నాండో?"

"ఫెర్నాండో కూడా బాగుపడ్డాడు. చక్రవర్తి రెండోసారి రాగానే అతన్ని నిర్బంధంగా సైన్యంలోకి పిలిచాడు. లినీ యుద్ధంలో అతనున్నాడు. యుద్ధం జరిగినరాత్రి అతను సైన్యాధిపతి శిబిరంవద్ద పహరాకి నియోగించబడ్డాడు. శిబిరంలో అప్పుడు శత్రుపక్షంతో రాయబారాలు జరుగుతున్నాయి. ఆ రాత్రే ఆ సైన్యాధిపతి తిరగబడి, ఇంగ్లీషువారితో చేరడానికి ఏర్పాటు జరిగింది. అతను ఫెర్నాండోని తన కూడా రమ్మన్నాడు. ఫెర్నాండో తన పహరాని విడిచిపెట్టేసి సైన్యాధిపతితో చేరి శత్రువులతో కలిసిపోయాడు. నెపోలియన్ ఓడిపోకుండా ఉన్నట్లయితే, అటువంటి పని చేసినందుకు ఫెర్నాండోకి ఉరిశిక్షపడవలసింది. కాని నెపోలియన్ ఓడిపోయాడు కాబట్టి తరవాత ప్రభుత్వంలో అతనికి స్తోమతు చిక్కింది. సబ్ లెఫ్టినెంట్ హోదాలో ఫ్రాన్సుకి తిరిగి వచ్చాడు. సైన్యాధిపతి ప్రాపకంవల్ల స్పానిష్ యుద్ధకాలంలో 1823 లో కెప్టెన్ అయినాడు. అప్పటికి డాంగ్లర్ వ్యాపారజూదంలో ఉన్నాడు. ఫెర్నాండో స్పానిష్ దేశస్థుడు. అందువల్ల

మాడ్రిడ్‌లో పరిస్థితు లెలా ఉన్నాయో కనిపెట్టడానికి అతను పంపబడ్డాడు. అక్కడ అతను డాంగ్లర్‌ని కలుసుకుని మాట్లాడాడు. ఆ దేశంలో రాజరికపక్షువాదులు తోడ్పడతా రని తన సైన్యాధిపతికి తెలియపరిచాడు. తరవాత యుద్ధాన్ని తనే నిర్వహించాడు. కొన్ని వర్గాల సహాయంతో, తనకు తెలిసిన ఆ దేశంలో సులువుగా విజయాలు సాధించాడు. అతన్ని కల్నల్ చేసి, లీజన్ ఆఫ్ ఆనర్ పతకమిచ్చి, కౌంట్ హోదా నిచ్చి సన్మానించింది ఫ్రెంచిప్రభుత్వం."

"ఆహా! విధివైపరీత్యం" అన్నాడు ఫాదరీ.

"అవునండి. వినండి చెప్తాను. ఇంకా ఉంది. స్పెయిన్‌తో యుద్ధం ఆగిపోగానే, ఇంక యూరప్‌లో శాంతి ఏర్పడే సూచనలు కనిపించాయి. ఫెర్నాండోకి ఇంక చెయ్యడానికేమీ కనపడలేదు. ఒక్క చోటమాత్రం ఇంకా శాంతి ఏర్పడలేదు. గ్రీస్ దేశం, టర్కీ చక్రవర్తిపైన తిరగబడింది. స్వాతంత్ర్యంకోసం అప్పుడే యుద్ధం ప్రారంభించింది. గ్రీస్‌తరఫున యుద్ధంచెయ్యడానికి అనుమతి పొంది ఫెర్నాండో వెళ్ళాడు. అప్పు డతనిపేరు కౌంట్ ఆఫ్ మార్సెర్ఫ్. అలీపాషా సైన్యంలో లెఫ్టినెంట్ జనరల్ హోదాతో చేరాడు. అలీపాషా చచ్చిపోయాడు. చచ్చిపోతూ ఫెర్నాండోకి అపారమైన ధన మిచ్చాడు. ఆ ధనంతో ఫెర్నాండో ఫ్రాన్స్‌కి తిరిగి వచ్చాడు. ఇక్కడ అతనికి లెఫ్టినెంట్ జనరల్ సైనికపదవి ఖాయమయింది."

"అంటే ఇప్పు డతను..."

"అంటే ఇప్పు డతను హెల్డర్‌వీధిలో ఒక పెద్ద భవనంలో నివసిస్తున్న భాగ్యశాలి."

ఫాదరీ ఏదో చెప్పబోయి ఆగాడు. తరవాత కొంత ప్రయత్నంమీద ఇలా అన్నాడు: "మర్సిదా మాటేమిటి? ఆమె కూడా ఐశ్వర్యం సంపాదించిందా?"

కాడరూస్ చెప్పాడు: "ఈనాడు పారిస్‌లో మర్సిదా వంటి అద్భుతమైన స్త్రీ మరొకామె లేదు. ఎడ్మండ్ వెళ్ళిపోయినప్పుడు మొదట ఆమె మతిపోయినట్లుండేది. విల్‌ఫర్ట్‌ని ఆమె ప్రార్థించడం సంగతి ఇదివరకే చెప్పాను. డాంటీ తండ్రిపట్ల ఆమె చూపిన భక్తిశ్రద్ధల్ని గురించి కూడా చెప్పాను. ఈకష్టాలలో ఉండగా ఆమెకు మరొకటి వచ్చిపడింది. ఫెర్నాండో ఆమెను విడిచి వెళ్ళిపోవలసి వచ్చింది. అతను చేసిన అక్రమం ఆమెకి తెలియదు. తనకి సోదరునివంటి వాడని భావించింది. అతను వెళ్ళిపోగానే ఆమె బొత్తిగా ఒంటరైపోయింది. మూడుమాసాలు దుఃఖిస్తూ గడిపింది. ఎడ్మండ్‌ని గురించి కాని, ఫెర్నాండోని గురించి కాని ఆమె కేమీ తెలియరాలేదు. నిరాశతో ప్రాణాలు కడంటి ఉన్న వృద్ధు డొక్కడే ఆమెకు తోడైనాడు. మార్సెల్స్‌నించి కాటలన్స్ గ్రామానికి వెళ్ళే దారిలో రెండు రోడ్లు కలిసే చోట కూర్చుని నిత్యం గడిపేది. ఒకనాటి సాయంకాలం ఆమె అలా కూర్చుని, ప్రాణాలు విసిగి నిస్పృహతో ఇంటికి చేరుకున్న సమయానికి ఫెర్నాండో ఉన్నా డక్కడ. అత నప్పుడు లెఫ్టినెంట్ హోదాలో ఉన్నాడు. ఆమెకి పోయిన ప్రాణం లేచి వచ్చినట్లయింది. ఆమెకి ఫెర్నాండోపట్ల ఎన్నడూ విరుద్ధభావం లేదు. కాని ప్రేమించలేదు. అంతే. ఆమె హృదయం మరొకనికి అర్పితమయింది. అతను మాయమైపోయాడు. బహుశా చచ్చిపోయి ఉంటాడు. ఈభావం కలగ్గానే ఆమెకి దుఃఖం పొంగివచ్చింది. ఇతరు లీమాట అంటే వినడానికి ఆమె సహించలేక పోయేది. కాని అప్పుడదే ఆమెకి తోచసాగింది. అదీ కాక వృద్ధుడు నిత్యం ఆమెతో 'మన ఎడ్మండ్ చచ్చిపోయే వుంటాడు. లేకపోతే, ఈపాటికి మనదగ్గిరికి తిరిగి రాడా?' అంటూఉండేవాడు. ఆవృద్ధుడే బతికిఉంటే, ఆమె ఇంకెవరినీ పెళ్లి చేసుకునేది కాదేమో. ఫెర్నాండోకి ఇది అర్థమయింది. అందువల్లనే వృద్ధుడు చనిపోయాడని తెలుసుకున్న తరవాత తిరిగివచ్చాడు. ఇప్పుడత నో పెద్ద సైనికోద్యోగి. మొదటిసారి ఆమెను చూసినప్పుడు ఆమెను ప్రేమించినమాట ఎత్తలేదు. రెండోసారి చెప్పాడు. ఎడ్మండ్‌కోసం పరితపిస్తున్న ఆమె ఆరుమాసాలు గడువుకోరింది.

ఫాదరీ పరితాపంతో చిరునవ్వు నవ్వి అన్నాడు: "అంటే పద్దెనిమిది మాసాలు నిరీక్షించిందన్నమాట. ఇంతకంటె ప్రియులకు కావసిన ప్రేమబంధం ఏంకావాలి?"

"ఆరుమాసాల తరవాత ఎకోలే చర్చిలో వివాహం జరిగింది"

"అంటే, ఎడ్మండ్‌ని పెళ్లిచేసుకోడానికి ఏర్పాటయిన చర్చిలోనే నన్నమాట. పెళ్లికొడుకులు మారారు, అంతే."

"అక్కడే మర్సిదా పెళ్లి జరిగింది. యథాలాపంగా చూసే వారికి ఆమె శాంతంగా ఉన్నట్లు కనపడినమాట నిజమే కాని రిజర్వ్ హోటల్ ప్రక్కనించి వెడుతుండగా ఆమె స్మృతితప్పిపడిపోయింది. ఇక్కడే ఎడ్మండ్‌తో ఆమె ప్రథానపు విందు పద్దెనిమిది మాసాలకు ముందు జరిగింది. అప్పటికికూడా ఆమె ప్రేమ డాంటీపైనే ఉంది. ఫెర్నాండోకి ఆనందంగానే ఉంది కాని ఎప్పటి కప్పుడు డాంటీ తిరిగివస్తాడనే భయంతో కలవరపడుతూనే ఉన్నాడు. ఆ చోటు విడిచిపెట్టి వెళ్లిపోవాలనీ, తన భార్యనక్కడినించి తీసుకుపోవాలనీ తొందరలో ఉన్నాడు. పెళ్లైన వారంరోజుల్లో ఇద్దరూ వెళ్లిపోయారు"

"ఆ తరవాత మీ రెప్పుడైనా మళ్లీ మర్సిదాను చూశారా?"

"చూశాను. యుద్ధకాలంలో పెర్పినాన్ అనే ఊళ్లో ఆమె ఉండగా చూశాను. ఫెర్నాండో యుద్ధానికి వెడుతూ ఆమెను అక్కడ దిగబెట్టాడు. అప్పు డామె కొడుక్కి విద్య చెపుతోంది."

"కొడుక్కా?"

"అవును. ఆమె కొడుకుపేరు ఆల్బర్ట్."

"కొడుక్కి విద్యచెప్పడం అంటే ఆమె విద్యావంతురాలన్నమాట. ఎడ్మండ్ చెప్పినదాన్ని బట్టి, ఆమె పల్లెకారికూతురనీ, అందమైనదైనా చదువు, నాగరికత లేనిదనీ అనుకున్నానే?"

"డాంటీకి తన ప్రియురాలినిగురించి తెలిసినదింతేనా? అందాన్ని బట్టీ తెలివితేటల్ని బట్టీ రాణులు కాగలిగితే, మర్సిదా మహారాణి కాగలిగేది. ఐశ్వర్యం అధికమైనకొద్దీ ఆమెతెలివి, గాంభీర్యం అధికమైనాయి. ఆమె చిత్రలేఖనం, సంగీతం, మొదలైన వెన్నో అభ్యసించింది. మనలో మన మాట. అసలు సంగతి ఏమిటంటే, ఆమెలోని దుఃఖాన్ని మరిచిపోయిని మనస్సు మళ్లించుకోడంకోసం ఇవన్నీ అభ్యసించేదని నా నమ్మకం. ఇప్పుడింక ఐశ్వర్యం గౌరవం ఆమెకి ఉపశాంతి నిచ్చాయనేది నిస్సందేహం. భాగ్యవంతురాలు, కౌంటెస్ అయినాసరే ఆమె ఇంకా సుఖంగా లేదని నా నమ్మకం.

"మీ రెందు కలా అనుకున్నారు?"

"నన్ను దారిద్ర్యం చుట్టుకున్నప్పుడు నా పాతమిత్రు లెవరైనా సహాయపడతారని ఆశపడ్డాను. డాంగ్లర్ ఇంటికి వెడితే అతను నన్ను చూడనైనా లేదు. ఫెర్నాండో ఇంటికి వెళ్లాను. అతను నౌకరుద్వారా నాకు నూరు ఫ్రాంకులు పంపాడు. నేను వెళ్లిపోతుండగా మర్సిదా నన్ను చూసింది. పాతిక బంగారునాణే

(46-వ పేజీ చూడండి)



ఉద్యోగం పురుషలక్షణమ్

శ్రీమతి శిరుగూరి రత్నమ్మ

వెంకప్ప అవధాన్లగారిని ఎరుగని వారు ఎవ్వరూ లేరు. ఆయన పేరు ఒక్క అమలాపురంలోనే కాకుండా కోనసీమయావత్తూ ప్రసిద్ధికెక్కింది. వెంకప్ప అవధాన్లు షోడశకర్మాధికారి. ప్రతి ఒక్కరూ ఆయన సలహా లేనిదే ఏపనీ చేయరు. కొబ్బరిచెట్టుకాయలు దింపుకుందుకు ముహూర్తం మొదలు తమ ఇంటి పెళ్లి ముహుర్తాల దాకా వెంకప్ప అవధాన్లు పెట్టవలసినదే. కోనసీమయావత్తూ పౌరోహిత్యం ఆయనదే. అవధానం చేయకపోయినా ఆయన తాతగారు అవధానం చేసి, అవధాన్లనిపించుకుంటే వారసత్వపు హక్కులాగ తాతగారి పేరు ఆయనకు వెంకప్ప అవధాన్లని పేరుమాత్రం సంక్రమించింది. ఈయన భుజశక్తివల్లనే అమలాపురంలో నాలుగిళ్లభవంతి కట్టేరు. ముగ్గురు కొడుకులలో పెద్దవాడయిన నీలకంఠం తండ్రివృత్తినే అవలంబించి తండ్రికి చేదోడువాదోడుగా వున్నాడు. రెండో కొడుకు పార్వతీశం 'స్కూలు ఫైనలు' పాసయి సర్వేఆఫీసులో గుమస్తాపని చేస్తూన్నాడు. మూడోకొడుకు గంగాధరం బి. యే పాసయి యేడాది అయింది. అతను పాసయేనాటికి బ్రాహ్మణ అబ్రాహ్మణ భేదం ప్రబలివుండడంనించి ఎక్కడా వుద్యోగం దొరకడం లేదు. ప్రతీ ఆఫీసులో ఖాళీలేదనేమాటే. పఠనమందిరంలో ప్రతీ రోజు 'హిందూ' పేపరు చూచి *Wanted Columns* లో వున్న ఉద్యోగాలలో తాను చేయగలిగిన ప్రతి ఉద్యోగానికీ అప్లికేషన్లు పెట్టేడు. రాజమండ్రీకీ, అమలాపురానికీ ఆ వీథి ఈవీధిలాగ తిరుగుతూన్నాడు. చేయవలసిన ప్రయత్నాలన్నీ చేస్తూన్నాడు. ఫలితం శూన్యం. చివరకు కోమటిగుమాస్తా పనికూడా దొరకడం లేదు.

రెండుఝాముల ప్రొద్దయింది. వేసవికాలం అవడంనుంచి సహస్రకిరణుడు తన ప్రభావం బాగా చూపిస్తూన్నాడు.

కమ్మగా వేయించిన కందిపప్పు,సప్పళ్ళం కొత్తగా పూరేసిన పచ్చడిబద్దలు, కమ్మటి గేదపెరుగు వేసుకుని సుష్టుగా భోంచేసి గ్రుమని తేన్చుకుంటూ,తడిఅంగోస్త్రంతలమీద వేసుకుని వెంకప్ప అవధాన్లు ఇవతలకొచ్చేసరికి ఆ వూరి పెద్దకామందు కామరాజు, కుమార్తె పెండ్లిముహూర్తం పెట్టించుకుందామని వచ్చేడు. ఆయనను చూచి వెంకప్ప అవధాన్లు "రండి రండి ప్రభువులు ఇలాగ దయచేశారు. కాకిచేత కబురు పంపితే తమలోగిటికి నేను వచ్చేవాడినిగదా! ఇంత ఎండలో తామింత శ్రమపడివచ్చేరు."అనిఅన్నాడు.

"ఫరవాలేదు. కార్యావసరం వుండి వచ్చేను. మా మూడో అమ్మాయికి సంబంధం నిశ్చయమైంది. ఈజ్యేష్ఠ, వైశాఖాలలో మంచి ముహూర్తం వుందేమో కనుక్కుందామని వచ్చేను."

"ఓహో అలాగా చాలా సంతోషం. దయచేయండి సావిట్లోకూర్చుని సావకాశంగా ముచ్చటిద్దాం. అమ్మాయి, అబ్బాయిగార్ల జాతకాలు తెచ్చారా?"

"ఆ. తెచ్చేను."

ఇద్దరూ ముందునా సావిట్లో పరచివున్న తాటాకుల చాపమీద కూచున్నారు.

వెంకప్ప అవధాన్లు "ఒరే బుల్లోడా" అని పెద్దకొడుకు కొడుకుని కేక పెట్టాడు. ఆ కేకవిని ఏడెనిమిదేళ్ళ కుర్రాడు పరుగెత్తుకొచ్చి 'తాతా పిలిచావా' అని అడిగేడు. "నా దస్త్రం పట్టుకురా" అని తాత చెప్పగానే ఆ పిల్లాడు ఒక్క పరుగుతో లోపలికి వెళ్ళి పంచాంగం కట్టివున్న దస్త్రం తెచ్చి ఇచ్చి ఆడుకుందుకు చక్కాపోయాడు.

వెంకప్ప ఒక పొడుంపట్టు పీల్చి చెయిచాపిన కామరాజు చేతిలో రవంత పొడుం రాల్చి పంచాంగకట్ట విప్పుతూండగా నిరాశాపూరితముఖంతో, రేగిన జుట్టుతో కాళ్ళీడ్చుకుంటూ మూడవకొడుకు గంగాధరం వీధివాకిలిదాటి లోపలికి వచ్చేడు. అతనిని చూచి కామరాజు "మన గంగాధరంగారికి ఉద్యోగ మేమయినా కలసి వచ్చిందా అండీ." అని అవధానగారిని ప్రశ్నించాడు. అసలే అవధాన్లగారికి మూడవకొడుకుని చూస్తే అరికాలిమంట నెత్తికెక్కుతుంది. తనలాగ పిలక పెట్టుకోకుండా క్రాఫింగు పెట్టుకున్నాడనీ, సంధ్యావార్చడనీ, ఇంగ్లీషు చదువు చదివేడనీ గంగాధరాన్ని చూచినప్పుడల్లా మండిపడుతూంటాడు. దానిమీద కామరాజు అలా గడిగేసరికి అగ్గిమీద గుగ్గిలంలాగ మండిపడి "ఆఁ కలసివస్తుంది. వీడికి వుద్యోగమిచ్చే దౌర్భాగ్యుడింకా పుట్టలేదు. ప్రొద్దున్నే దండించుకుని చద్దిఅన్నం పెట్టించుకుని తిని అది అరిగేదాకా దిమ్మదిరిగి వస్తాడు. వీడి మొఖాన చదువుకింద నాలుగువేలు తగలేశాను. ఈ తేఖ్యం నాలుగు దమ్మిడీలు సంపాదించడం చేతగాక దేవులాడుతున్నాడు. ఏమిటో ప్రయత్నం చేస్తూన్నాడుట ప్రయత్నం. వీడి శార్ధం. నా కడుపున చెడబుట్టాడు. ఈ రోజుల్లో పొయిదగ్గర కూర్చోవలసిన ఆడవాళ్లు సహితం ఇట్టా ఉద్యోగాలు సంపాదించి మగరాయుళ్లను మించి ఉద్యోగాలు చేస్తూన్నారు. అని కామరాజుతో అన్నాడు.

కామరాజు జవాబేమి చెప్పలేదు. అలాగ ఎందు కలిగేను బాబూ అనుకున్నాడు మనసులో.

ముక్తేశ్వరందేవాలయంలో ఏవో పద్దులు వ్రాసే గుమస్తాపని కాళీ వచ్చిందంటే విని గంగాధరం గంపెడాశతో ప్రొద్దున్నే అచ్చటకు వెళ్ళేడు. అచ్చట అధికారివైష్ణవు డవడంచేత తనజాతి వాడికి అప్పుడే ఆ పని ఇచ్చేశాడుట. గంగాధరం వెళ్లి అడుగుతే "అబ్బే! మాకు B. A. లూ, M. A. లూ ఎందుకండీ? ఏదో, లోవర్ సెకండరీ పాసయినవాళ్లయితే చాలు. అదీగాక ఆ పని అప్పుడే ఒకరికి ఇచ్చేయడమైంది. పాపం మీరు B. A. పాసయి ఇరవైరూపాయిలపనికొరకు వచ్చారంటే నాకు చాలా కష్టంగా వుంది. "అని ఆ రామానుజస్వామి చెప్పేసరికి గంగాధరం కుప్పకూలినట్లు అయిపోయాడు. తప్పక తనకీ యిరవైరూపాయల ఉద్యోగం అవుతుందని కొండంత ఆశపెట్టుకు రాగా పూరంగా నిరాశ అయింది. వెళ్లినపని వాకిట్లోనే అయిందన్నట్లు లేదన్నమాట అనిపించుకుని అలో లక్షణా అని మళ్లీ కాళ్ళీడ్చుకుంటూ ఇంటిమొగం పట్టేడు. ప్రొద్దున్న పెద్ద వదినెగారు ముప్పయి మూడు సాధింపులతో వెక్కిరింపులతో, మూతి విరుపులతో పెట్టిన చద్దన్నం అరిగిపోయింది. కడుపులో నకనక లాడుతూంది. ఆకలిబాధతో, ఎండదెబ్బతో బరువైన హృదయంతో కాళ్లీడ్చుకుంటూ వస్తూన్న గంగాధరానికి తండ్రి అన్నమాటలు శులాల్లా నాటాయి. 'నాజీవితం కన్న తండ్రికి కూడా ఇంత భారమైందే! నేనంటే ఎంత చులకనగా మాట్లాడుతూన్నాడు. పరాయి పెద్దమనిషి దగ్గర వున్నాడన్న సంకోచమైనా లేదు కదా!' అని అనుకుంటూ లోపలికి వచ్చిన గంగాధరాన్ని చూచి, "ఏంరా గంగాధరం నువ్వెళ్ళిన పని ఏమయింది? మామూలు పాటేనా? లాకేత్వం దాక్కొమ్మ." అని వెంకప్ప అవధాన్లు ప్రశ్నించాడు.

"ఆపని ఎవరికో అప్పుడే ఇచ్చేరుట" అని తలవొంచుకుని జవాబు చెప్పి లోపలికి వెళ్లిపోయేడు.

"లేకపోతే! నువ్వు ఉద్యోగం చేశావు. నేను చూసేను. నువ్వు సంపాదించావు నేను తిన్నాను. నాకడుపున ఎంత అప్రయోజకుడివి పుట్టావురా." అని కామరాజుతో 'ఇది వాడి తప్పు కాదు లెండి మా ఇంటావిడదే తప్పు. పెద్దాడిలాగ వీడికీ నాలుగు మంత్రంముక్కలు నేర్పుతానంటే సనేమిరా వల్లకాదంటే వల్లకాదని చదువుకొని వుద్యోగం వెలగబెట్టుతాడనీ ఈ ఇంగ్లీషుచదువులో పెట్టింది. సంపాదనా లేదు. చట్టుబండయా లేదు. వట్టి త్రాష్టం కింద తయారైనాడు. ఏవో నాలుగుమంత్రం ముక్కలు నేర్చుకుని మీబోటి నాలుగిళ్లలో పౌరోహిత్యం చేసుకుంటే చాలదుటండీ" అని వెంకప్పావధాన్లు కామరాజుతో అన్నాడు.

'ఏదో శుభంగా కూతురు పెళ్లిముహూర్తం పెట్టించుకుందామని నేను వచ్చి ఈ తండ్రికొడుకుల తగవుమధ్య పడ్డానేమిటి భగవంతుడా! అతని వుద్యోగంమాట ఎందుకు ఎత్తేనురా తండ్రీ! అని మనస్సులో అనుకుని మౌనంతో తలవూపేడు కామరాజు.

లోపలకు వెళ్లిన గంగాధరానికి తన పెద్ద వదినెగారయిన సుబ్బమ్మ, తన భార్య శారదతో ఈవిధంగా అనడం వినిపించింది. సుబ్బమ్మ మేనరికం అవడంనుంచీ, పెద్ద కోడలు అవడంనుంచీ ఆ ఇంట్లో చనవూ అధికారం హెచ్చు. ఆమె అందరిమీద అధికారం చెలాయిస్తూన్నా అత్తగారు ఏమీ కలుగజేసుకోదు. అందునించి ఆమె మరీ విజృంభిస్తూంది.

"మీ దొరగారు ఎప్పుడు వస్తారో ఏమో? నీవు అన్నానికి వస్తావా? అతగాడికి పనా పాటా? ఏముంది? తిరగడమే గా ఉద్యోగం? పిల్లలబట్టలు ప్రొద్దున్నే సబ్బులో నానబెట్టి వుంచేను. నువ్వన్నం తిని మైలపడి బట్టలు ఏటికి తీసుకెళ్లి వుతికి తీసుకురావాలి. ఎండ మాటు వాలిపోతే బట్టలు తెల్లగా వుండవు. అల్లా చూస్తూ నీనించుంటావేం. ఆకు తెచ్చి వేసుకో. కన్నీ అమర్చిపెట్టడానికి ఎవరూ ఇచ్చట నీ నౌకర్లు సిద్ధంగా లేరు"

"వారు వచ్చేదాకా వుంటాను. ప్రొద్దున్ననగా కాస్త చద్దన్నం తిని కాలినడకతో వెళ్లేరు. ఈ మండుటెండల్లో ఇంటికి ఏలాగ చేరుకుంటారో ఏమో! నా కేమీ తోచడం లేదు. బట్టలు ఇప్పుడే ఏటికి తీసుకెళ్లి వుతుక్కొస్తాను."

"ఏం, చద్దన్నం తిన్నాడు చద్దన్నం తిన్నాడని వూరికే వగచకపోతే అంత అభిమానం కలదానివి వేడివేడిగా వేపుడుకూర అన్నంచేసి అమర్చ లేకపోయావా? కాలినడక గాకపోతే మోటారు కొనమను. దొరగారు రాందే ఈ దొరసానమ్మ తినదట. ఇప్పుడేఇంత గీర్వాణంగా వుంది. రేపు ఆయనగారు నాలుగురాళ్లు సంపాదిస్తే ఇక క్రిందామీదా వుండదు. ఏమండీ శారదమ్మగారుమీవారు కలక్టరయితే కాస్త మావారికి ప్రమోషను ఇప్పిస్తారా అని హేళనగా రెండో తోడికోడలు రాజేశ్వరి అంది.

దానిమీద పెద్ద తోడికోడలు సుబ్బమ్మ "ఆఁ ఈ మొగాలే ఉద్యోగాలు చేయడం వూళ్లేలడం. బి. యే. పేసయి ఏడాదైంది. మూడు దమ్మిడీలు సంపాదించడం చేతకాక మిణుకుతూన్నాడు. మా వారు చూడు నిక్షేపంలాగ స్వతంత్రంగా గడపుతున్నారు. వారిష్టముంటే వెళ్లుతారు లేకుంటే లేదు. ఒక అధికారిచేత చివాట్లు తినక్కరలేదు. గాడిదచాకిరీ చేయక్కరలేదు. తనకోసరం ఒకరు ఎదురు

చూడవలసిందే, కాని ఒకళ్ళకోసరం తాను ఎదురు చూడక్కరలేదు. అందరూ ఎంతో గౌరవం చేస్తారు. నిత్యపంట. అల్లా వీధులోకి వెళ్ళి ఇల్లా వచ్చేసరికి ఇల్లు నిండుతుంది. ఏముంది ఉద్యోగాల్లో? అందులో ఈరోజుల్లో జీతపురాళ్లు కడిగేశి పారేస్తారు. ఫస్టుతారీఖు ప్రభువులు, మరునాడు మామూలు సంసార్లు, మూడోనాడు ముష్టివాళ్లు. ఉద్యోగాలో అని ఎగబడుతారు. వీళ్లు తెచ్చే ముప్ఫయి నలభయి రాళ్లతో సంసారాలు గడుస్తాయా? సీతారామాభ్యాం నమః అని అష్టోత్తరీ జపించేసరికి ఒళ్లున తవ్వెడు బియ్యం తప్పేలా చెంబులో ఒలకవలసిందే. ఉద్యోగాలలో ఏముంది? పైకి బటారం, లోపల లొటారం", అని అందుకుంది. పాపం వయస్సులోనూ అనుభవంలోనూ చిన్నదయిన శారద వీళ్ళ మాటలకు జవాబు చెప్పలేక మౌనం దాల్చి, ఆ మిడిమధ్యాహ్నపు ఎండలో బావగారి పిల్లల బట్టలు వుతకడానికి ఏటికి వెళ్ళింది. కాలిన ఇసుకలో కింద కాళ్లు అంటుకుంటున్నాయి. పైన మాడు మాడుతోంది, కడుపులో తోడికోడళ్లు దెప్పిన దెప్పుళ్లకు బాధగావుంది. వాళ్లకు జవాబుచెప్పే అధికారం తనకు లేదు. వాళ్ళు ఎన్నిమాటలంటూన్నా పడి పూరుకోవలసినదే. తన పుట్టింటివారు వారిద్దరు పుట్టింటివారికన్న చాలా భాగ్యవంతులు. తన భర్తకు బావగార్లిద్దరకన్న ఎక్కువ కట్నం ముట్టింది. తాను ఎంతో గొప్పగా సారె తీసుకు వచ్చింది. తన వంటిమీద నూరు తులాలదాకా బంగారం కన్నవారు పెట్టారు. కాని, తను నిరుద్యోగునిభార్య. తన పెనిమిటి ఇంటిల్లపాదిదృష్టిలో అతి చులకనగా చూడబడుతున్నాడు. పెద్ద భూస్వామి బిడ్డ అయివుండీ ఇంటిల్లపాదికీ అరవచాకిరీ చేస్తూంది. పెండ్లిలో భర్తను చూచి చదువుకున్న భర్త అందమైనవాడు తనకు లభ్యమైనందుకు పొంగిపోయింది. అందమైన గులాబిపూవు కంటకావృతమైవుందని ఆ బాలహృదయానికి తట్టలేదు. గొప్ప ఉద్యోగస్తుని భార్యను అవుతాననుకుంది. ఎన్నో మధురస్వప్నాలు కనింది. తన ఊహాసౌధాలన్నీ ఈవిధంగా కూలుతాయనుకోలేదు. ఇంటిలో బండచాకిరీ చేసినా మెప్పులేదు. అంట్లుతోమి, బట్ట లుతికి, వడ్లు దంచి నీళ్ళుతోడి చేతులు కాయలు కాచేయి. మాటమాటికీ తోడికోడళ్ల దెప్పుళ్లూ, ఆడదాని అదృష్టం ఇలాగుందని అత్తగారి సాధింపు స్మరణకు వచ్చి భోరున ఏడ్చింది. మనస్సులో ఇమిడివున్న దుఃఖమంతా పొంగి పొర్లి పైకి రావడంచేత హృదయం కొంత తేలికైంది. తనకు దానే ఓదార్చుకుని 'ఏనాటికైనా పడ్డవాళ్లు చెడ్డవాళ్లు కారు. కాలం మారకపోతుందా? ఎప్పటికీ ఇలాగే వుంటామా? నా భర్త ఏం అప్రయోజకుడా, చదువురానివాడా' 'అని అనుకుని ధైర్యం తెచ్చుకుంది. భర్తమాట జ్ఞాపకానికి వచ్చేసరికి ఇంటికి ఇంకా వచ్చారో లేదో' అని గబగబ బట్టలు వుతికి బుజంమీద వేసుకుని ఇంటికి వచ్చింది. వుతికిన బట్టలు క్రింద పడకుండా జాగ్రత్తగా ఆరేసి తనగదిలోకి వెళ్లింది. ఈజీచైరులో భర్త శోషొచ్చినట్టు పడుకుని వున్నాడు. ఏడ్చి ఏడ్చి నిద్దరపోయినట్లు కళ్లదగ్గర నీళ్ల చారికలు ఎండిపోయి కనబడుతున్నాయి. భర్తముఖం చూడగానే శారదకు తిరిగి వెర్రిదుఃఖం వచ్చింది. కాని, సమాళించుకుని భర్త నుదుటిపై జీరాడుతూన్న ముంగురులను సవరించింది. ఆ మధురస్పర్శకు గంగాధరం కళ్లు విప్పి చూచేడు. ఎదురుగా శారద నిల్చునివుంది. లేచి భార్యను తన చేతుల్లోకి తీసుకుని "శారదా నువ్వీ ఇంటికి వచ్చి ఎంత కష్టపడుతూన్నావు? ఇంకెవ్వరినైనా పెండ్లిచేసుకునివుంటే నీకీ పాట్లు వుండకపోవునుగదా, ఏజన్మన చేసుకున్న పాపమో నావంటి నిర్భాగ్యుడికి-ఇంతలో పైమాట అనకుండా శారద తనచేతితో భర్తనోరు మూసేసింది.

"అలా గనకండి. పడిన గోడలు పడినట్లే వుండవు. మీరేం చదువురానివారా? అప్రయోజకులా? కాలం కలసి వస్తేగాని మన ప్రయత్నాలు ఫలించవు. వూరికే మనసు పాడుచేసుకోకండి."

"లేదు శారదా లేదు. నన్ను ఎన్ని మాటలన్నా నేను సహిస్తాను. కాని, అమాయకురాల్ని నిన్ను పట్టుకుని ఇంట్లోవాళ్లు పెట్టేబాధలు చూడలేకుండా వున్నాను. ఇదివరకూ నాన్నగారు నన్నెన్ని మాటలన్నా సహించాను. కాని పరాయి పెద్దమనిషిదగ్గర కన్నకొడుకన్న భావం లేశమాత్రం లేకుండా కామరాజుగారితో నాన్నగారు అతినీచంగా నా గురించి మాట్లాడేరు. ఆ మీద ఇంట్లో కొచ్చేసరికి మావదినెగార్లిద్దరూ నిన్ను చెట్టును దులిపేటట్టు దులుపుతూన్న మాటలన్నీ విన్నాను. నామనస్సు చాలా విరిగిపోయింది. నేనిక ఈ ఇంట్లో నిముషం వుండను. వచ్చి మంచినీళ్లు ముట్టను. నీవు అనుగ్రహించి అనుమతియ్యి. ఎక్కడికైనా పైదేశాల కెళ్లి ఉద్యోగం సంపాదించి నిన్ను తీసుకెళ్లిపోతాను. ఒక్క రెండునెలలు నీవు ఈబాధలు ఓర్చుకొనివుంటే నిన్ను ఈ నరకకూపంలోనుంచి స్వర్గధామానికి తీసుకెళ్లుతాను. నిన్ను సుఖపెట్టవలశిన బాధ్యత నాది. నా బాధ్యత నేను నెరవేర్చుకుంటాను.

"అమ్మయ్యో మిమ్మల్ని వదలి నేను క్షణం వుండగలనా? నావల్లకాదు బాబూ! ఎవరన్ని అన్నా, ఎంత పని చేసినా మిమ్మల్ని చూచుకునేసరికి అంతా మర్చిపోతాను. మీ ముఖం చూస్తూంటే ఏదో గంధర్వలోకంలో విహారిస్తూన్నట్టుంటుంది. నాకు చెప్పలేని ఏదో ఆనందానుభవం కలుగుతూంటుంది. మీ రేం చెప్పినా

(27-వ పేజీ చూడండి)

కథానిక:

మాయిల్లు మ్యూజియం నేను మృగాన్ని!

శ్రీ అనుముల వెంకటశేషకవి

1

మాయిల్లు మ్యూజియం - నేను మృగాన్ని! - మా యింట్లో మాంసం తిని జీర్ణించుకోగల పెద్దపులివంటి క్రూరమృగాలూ ఉన్నాయి. తృణభక్షణలో తృప్తిపడేగోవులూ ఉన్నాయి. అటూ యిటూ చేరని నక్కలూ, కండ్లు మూసుకొని పాలు త్రాగే పిల్లులూ, కోపమొచ్చి కఱచే కుక్కలూ, యేదో విసంగా సంసార మీదే చేపలూ, అన్నిటికీ ప్రతులు వేసే చిలుకలూ, అసూయతోనే జీవించే గుడ్లగూబలూ - వీటికి లెక్క లేదు. పట్టుమని విస్తళ్లు వేసేవేళకు పిల్లా మేకా కలిసి, కనీసం ముప్పైమందైనా తయారు. పైగా వచ్చేవాళ్ళకూ, పొయ్యేవాళ్ళకూ అది మజిలీ.

ఇంతకూ నే నే జాతి మృగాన్నో చెప్ప లేను. అసలు మృగాన్నో, కానో గూడా సందేహమే! - మృగాన్ని కాకుంటే ఆ మ్యూజియంలో యెందు కుంటాను? ఐతే, కొందఱు మానవులతో యెందుకు కలిసి మెలసి తిరుగుతాను? - వాళ్ళంతా మానవులైతే నేనూ ఔతాను. కాక, మృగాలే ఐతే, నాకూ తప్పదుగా? ఊళ్ళోవ్నూ మానవులే లేరా? ఏమో? ఎవరికి తెలుసు? ఆనాడు నా కున్న విజ్ఞానాన్నిబట్టి, ఆ సంగతి నిర్ణయించడం అసాధ్యమేమో? నేను మృగాన్నే కావలసివస్తే కొదమ మృగాన్ని మాత్రమే. నా వయసు పదుమూడేండ్లు.

నా తొమ్మిదోయేటనే మా అమ్మ పోయింది. - "పోయిందని చప్పగా చెప్పడమేమిటి? నీ మొహం! - స్వర్గస్థురాలయిందనో, వైకుంఠయాత్ర వెళ్ళిందనో, కైలాసాని కేగిరిందనో, కాస్త గంభీరంగా అనూ! ఆదికవుల సాంప్రదాయాన్ని అనుసరించు! శిష్ట వ్యవహారాన్ని చంపకు!" - అని మీరు మాత్రం ఆగ్రహించరాదు. ఏమంటే? - నా మతంలో స్వర్గ వైకుంఠ కైలాసాలూ, నరక, పాతాళాది నానా జగత్తులూ వట్టి బూటకాలు. అవే నిజమైతే, నేనూ ఒక నాగకన్యనో, దేవకన్యనో వరించి తెచ్చి, హాయిగా కాలక్షేపం చేయలేకపోదునా?

బాల్యం లగాయతూ, నావన్నీ విపరీతమైన ఊహలు. అందఱూ ఔనన్నదాన్ని కాదనడం, కాదన్నదాన్ని ఔననడం నాకు మామూలు. అందువల్ల -యెందుకైనా నా అభిప్రాయాన్ని అడిగేవాళ్లు బుద్ధిహీనులు. ఈ సంగతి నా స్నేహితులంతా తెలుసుకున్నారు. ఒకసారి నేనే కాదన్నదాన్ని, ఔనని సమర్థించడం - ఔనన్నదాన్ని కాదని తిరస్కరించడం - నా కలవాటే. ఇందలి యథార్థం యీ కథ చదివితే మీరూ గ్రహిస్తారు.

మొదలు మొదలు సన్యాసం మంచిదనీ, ఆదర్శప్రాయమనీ నమ్మి, దాన్నిగూర్చి ఉపన్యాసాలు దంచేవాణ్ణి. విన్నవాళ్లు డంగైపోయి, డొంకతిరిగి డింకమాను కొడుతూంటే - నేనింకా వాళ్ల నేడిపించడానికి, కాషాయపురంగు చొక్కాలు తయారు చేయించి, శివిగా ధరించి, తిరిగేవాణ్ణి. ఇది చూచి నిజంగా నేను సన్యాసినే ఔతానని మావాళ్ళంతా భయపడసాగినారు.

అంతకంతకూ పిచ్చి ముదురుతూందనుకొనే దశలో, నేను హఠాత్తుగా మారినాను. పెండ్లి చేసుకున్నా, లేకున్నా సరేగాని, సన్యాసం వద్దని తీర్మానించుకున్నాను. హాయిగా ధవళాంబరాలు ధరించక, యీ కాషాయాంబరా లేమిటి, నా కర్మం?-మఱి కొన్నాళ్లకు, సన్యాసం మంచిదీ కాదు; ఆదర్శమూ కాదని వాదించినాను. 'ఈ మార్పేమిటిరా?'-అని మిత్రులంతా దిగ్భ్రాంతులైనారు. ఏది వచ్చినా మంచికే నంటూ, మా బంధువులు మాత్రం తృప్తిపడసాగినారు.

ఐతే, వాళ్లనుకున్నదానికీ, నా అభిప్రాయానికీ భేదం. "మనవాడు మార్గంలో పడినాడు; పెండ్లీ పేరంటం చేసుకుంటాడు. మనమాట వింటా"డని వాళ్లూ. "వివాహం జోలికి పోకుండానే విశ్వానికి సేవచేస్తూ, స్వార్థత్యాగినై ఒక పంథాలో నాయకత్వం వహించవచ్చు"నని నేనూ. పరిణయానికీ ప్రపంచోపకారానికీ పరస్పర విరోధమంటూ ప్రచారం చేయగాచేయగా, మళ్లీ మావాళ్లు మూతులు ముడిచినారు. పరులు నవ్వినారు. నాకుమాత్రం నమ్మకం తగ్గలేదు. నా పేరు విశ్వోద్ధారకుల పట్టీలో అగ్రస్థానాన్ని ఆక్రమించి, అన్నిపత్రికల్లో పడుతుందని సంతోషిస్తున్నాను. తా నొకటి తలిస్తే దైవ మొకటి తలుస్తాడని కలలోనూ అనుకోలేదు.

ఈ విధంగా కాలం జరిగిపోతుంటే, ఉన్నట్టుండి మా యింటికో భేతాళుడు వచ్చినాడు. తాటిచెట్టంత పొడుగూ, తగినంత లావూ, పెద్ద బొజ్జా, వెకిలినవ్వూ, వేళాకోళానికి కోసమూ, విపరీత ప్రసాధింపూ-ఇవీ అతని వికోచితలక్షణాలు. భేతాళుడంటే, భేతాళుడే!-అడగడమెందుకూ?-వచ్చీ రావడంతోనే పెండ్లిపెత్తనాలు ప్రారంభించినాడు. ఎదిగిన పిల్లలిద్దఱకూ ఒకేముహూర్తంలో ముళ్లుపెట్టిస్తానన్నాడు. ఎవరు కాదంటారు? ఎక్కువ రోజులుంటే తిండి దండుగని మావాళ్లు మొదటనే ఒప్పుకున్నారు. అందులో ఒక పిల్ల నావంతని నిర్ణయించినారు. నన్ను మా త్రంపలంకరించిన పాపాన పోలేదు. నాకేమీ తోచనూలేదు. అతడు వెళ్లిపోగానే, యెవరివల్లనో, జరుగబొయ్యే సంగతి తెలుసుకున్నాను. నాకీ వివాహం వద్దని గొణుక్కున్నాను. నా గొణుగు డెవరు వింటారు? నా దుఃఖమెవరు తీరుస్తారు? అసలు నే నంటే లక్ష్యమెవరికుంది?-ఇంకో భయం గూడా నాలో కలిగింది. "ఎదిగిన పిల్లలన్నాడు; ఇతడో భేతాళుడు!-అదే తాటకో, శూర్పణఖో ఐతే నాగతి?-దేవుడే దిక్కు!-అనడమేగాని ఆ దేవుడినైనా నమ్మితేనా?"—

నేను కృశించిపోసాగినాను. ప్రాణంతో ఉంటే చాలు!-పరిణయంచేసి తీరడానికి మావాళ్లు తీర్మానించినారు. నా పిడివాదాలూ, యతిమతాలూ, ఆదర్శాలూ, అవకతవకలూ-అన్నీ బుగ్గిలో కలిసినాయి. మా మేనత్తన న్నెగతాళిచేస్తూ, "ఏ పిల్లను చేసుకుంటావురా? పెద్దపిల్లనా? చిన్నపిల్లనా?" అని అడిగింది. "పెద్ద భూతమా? చిన్నభూతమా?-అంటే బాగుండేదేమో, కదా?"-అనుకున్నాను. "ఏదైతే నేం-ప్రాణం పోవడానికి?" అన్నాను. "ఛీ!

అపశకునపు పక్షి!-ఆ మాటేమిటిరా?"- అంటూ ఆమె లేచిపోయింది.

2

ముహూర్తం సమీపించింది. ఈ ఊరినుంచి మేమూ, యింకో ఊరినుంచి యితరులూ-యిరువాగులా వచ్చి ఆ భేతాళపురంలో భేటీఅయినాము. రెండు జట్లూ మగపెళ్లివాళ్లమే కాబట్టి, మాకంతా ఒకటే విడిది. భేతాళపురం పల్లెటూరు. అడవుల్లో కొండల్లో ప్రయాణంచేసి అలసిపోయినాము. చెమలికంట నీరుకారితే వేటగానికి ముద్దా! ఎదురుకోళ్లు తప్పవన్నారు. నా మొస్తరే నవసిపోతున్నాడా, లేదా, నా మిత్రుడని-అతనికంక చూచినాను. ఏమీ లేదు. ఎప్పుడెప్పుడా అన్నట్టుగా ఉన్నాడు!- నా ఆశ్చర్యానికి పారం లేకపోయింది. నేను 'మృగాన్ని' అన్నమాట జ్ఞాపకమొచ్చి, నాకూ అతనికీ ఉన్న భేదం సహజమేకదా?-అనుకున్నాను. నా పశుత్వం నాకే తప్ప, యితరులకు తెలేదు కాబట్టీ, మనుషులతోపాటు మర్యాదలు జరుగుతున్నాయి.

భేతాళపురంలో మగవాళ్లంతా భేతాళులే!-ఒక్కటే అచ్చు!-ఆడవాళ్లంతా అందుకు విరుద్ధం. వాళ్లంత పొడుగో వీళ్లంతపొట్టి వాళ్లం. భీకరులో వీళ్లంత భీరువులు; వాళ్లంత మోటో, వీళ్లంత మృదువు;-కాని, పెడసరంలో మాత్రం యిద్దరి కిద్దరూ తీసిపోరు.

మరునాడు పెండ్లిపీటలమీద కూర్చుంటే, నా కండ్లను నేనే నమ్మలేకపోయినాను. నా ఉద్వేగమూ, భీతీ, దుఃఖమూ-అంతా వట్టి అవివేకంగా తోచింది. ఎడమప్రక్కను కూర్చున్న పెండ్లికూతు రెనిమిదేండ్లదే. వజ్రపుతునకవలె, ప్రథమసంధ్యారాగ సమయంలోని యింద్రధనుస్సువలె, మిఱుమిట్లు గొలిపింది- "ఇంతకంటే దేవకన్యకా?-ఎక్కడుంది? పో"మ్మనుకున్నాను. ఎదిగిన పిల్లల సేమాట కిప్పు డర్థం తెలిసింది. 'అష్టవర్షాత్ భవేత్ కన్యా'-అనే శాస్త్రోక్తి అందుకుప్రమాణం. తుదకు నా రొట్టె విరిగి నేతిలోనే పడింది. నా తపస్సు-(ఎన్నడూ చేయకున్నా)-ఫలించింది.

ఒక్కసారిగా భేతాళపుర మనుకున్నది ఆనందపుర మయింది. నా దృష్టి మారింది. నా జీవితయాత్ర కది శుభశకునంగా పరిణమించింది. పెండ్లంటే యెంతో మధుర మనిపించింది. పీటలమీద కూర్చున్న మా యిద్దరినీ చూచి, చిలుకా గోరవంకలని [illegible] ప్రశంసించింది. నా చూపు మెల్లగా కుడిప్రక్కకు ప్రసరించింది. ఇటూ అటూ యిద్దరు పెండ్లికూతుండ్లు!- నేను నడుమ ఉన్నాను. ఆ ప్రక్కను నా మిత్రు డున్నాడు. నా అదృష్ట మతనికి పట్టకపోయింది గదా అనే గర్వం నన్నావేశించింది. అతని కీ విషయమై దుగ్ధ లేకపోయిందా!- ఏమో? సంశయింపవలసిన సంగతే?-

నేను మా వదినెనూ, భార్యనూ పోల్చి చూచుకున్నాను. ఎక్కడా పోలికలు లేవు! ఆమె పొడుగూ, యిది పొట్టీ, ఆమె మొహం కోలా, దీని మొహం గుండ్రనా; ఆమె బక్కపలచనా, యిది కొస్త దుబ్బూ;- ఈ తారతమ్యమంతా ఒక్కమాటలో చెప్పవలెనంటే, ఆమె నాగకన్యకా; - ఇది దేవకన్యకా ఇద్దరూ అందగత్తెలే!

పల్లెలలో పసుపుముత్తైదువులు పాటలకు పెట్టింది పేరు. పాటలాధరలనే మాటకు పాటలు పాడే పెదవులని అర్థం చెప్పుకుంటే బాగుంటుందేమో?-అప్పుడు సమాసం చెడుతుందని పండితు లాక్షేపించకుంటే స్త్రీ పర్యాయపదా లన్నిటికీ చిత్రమైన అర్థాలు దొరుకుతాయి. పండితులకూ మనకూ ఉన్న భేదమే యిదీ; వాళ్లు రసం చూడరు; మనం వ్యాకరణం చూడము. వాళ్లు వ్యాకరణమంటే, మనం గోకర్ణమంటాము. వాళ్లు సమాసం తప్పంటే, మనం సారస్యంగా ఉందని సంతోషిస్తాము. తొలిరాత్రి ప్రణయంలో వస్త్రమూల్యం విచారించే పద్ధతి మనదికాదు. ఎప్పుడైనా సమయం చిక్కించుకొని, యీ విషయంలో విపులమైన విమర్శ వ్రాయదలచుకున్నాను లెండి!

"ఈ దంపతులను సీతారాములు చిరంజీవుల చేయనీ! ఉమామహేశ్వరు లున్నతికి తేనీ! అరుంధతీ వశిష్ఠు లపేక్షలు హెచ్చించనీ!" - అంటూ మా అత్తగారు కొన్ని పాటలు పాడి, మంగళహారతు లెత్తుతుంటే, నేనీ లోకాన్నే మఱచినాను. బువ్వంబంతిలో యిద్దరు పెండ్లికూతుళ్లకూ యెంగిళ్లు వేసి, విస్తళ్ళు నింపినాను. ఇంకా పైత్యం తల కెక్కకొద్దీ, యెన్నో హాస్యాలు వర్షించినాను. ఈవిధంగా వివాహం జరిగిన అయిదు రోజులూ అఖండోత్సాహం ప్రదర్శించినాను.

నేనూ, నా మిత్రుడూ, పరస్పర పరిచయం చేసుకున్నాము. అతడూ నన్ను పొగడినాడు. కారణ మేమిటంటే, అతనికింగ్లీషు ముక్క రాదు. నేను నాలుగో ఫారంలో ఉన్నానంటే అదేదో గొప్పచదువుక్రింద గణించి, గాభరాపడ్డాడు. అతని పేరు కైలాసపతి (స్థాణువు-అంటే, మొద్దు); మా వదినె చండి; జత బాగా కుదిరింది. 'తగినట్టు కూర్చెరా తాకట్ల బ్రహ్మ'-అనుకున్నారక్కడివాళ్లంతా.

పెండ్లిలో మాకు జ్యోతిష్కుడు పెట్టిన పేళ్లలోగూడా ఒక ప్రత్యేకత:-నాగమణీ, శేషశాయీ. అగ్నిసాక్షిగా రోహిణీచంద్రులవలె పత్నీపతులమై, ప్రణయైకబద్ధులమై, ప్రపంచం జరిగినన్నాళ్లూ (పరలోకాల సంగతివచ్చినా నేను విశ్వసించను గనుక) ఉంటామని ప్రమాణాలు చేసినాము. మా కీర్తి లక్ష్మీనారాయణులూ, పార్వతీపరమేశ్వరులూ, సుభద్రార్జునులూ, మొదలైన ఆదర్శదంపతుల పట్టికలో అగ్రస్థానాన్ని వహిస్తుందని భావించి, విశ్వసించినాము.

ఒకనాటి కనుచీకటి వేళ, యిద్దరం మిద్దెమీది కెక్కి, యెవ్వరూ లేరనుకొని, హృదయాలు విప్పుకున్నాము. "మీకోసం నేనూ, నాకోసం మీరూ సృష్టింపబడినాము" అని ఒకేమాటలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది నాగమణి. అంత చిన్నవయసులోనే, యెంతి పాండిత్యం సేకరించిందా, అని ఆశ్చర్యపడ్డాను. చాటున ఉండి యీ మాటలు వింటూన్న పెద్దలెవరో బిగ్గరగా నవ్వినారు. మేము వెంటనే సిగ్గుపడుతూ, క్రిందికి దిగిపోయినాము. కాని, నా హృదయంలో ఆ బంగారు పలుకు లట్లనే అచ్చుపడినాయి. అటువంటి దాంపత్యంముందు, సన్యాసమూ, బ్రహ్మచర్యమూ తుచ్ఛంగా తోచినాయి.

3

మా ఊరికి రాగానే మళ్లీ వాదాని కారంభమయింది. "నళినీదళగత జలకణంగా నటిస్తూ, జనకమహారాజు మొస్తరుగా సంసారంలో సంచరిస్తాను. మీ కేం తెలుసు? ఆదిశక్తి అంశతోనే ఆడవాళ్లు పుట్టినారు. శక్తి లేకుంటే మనమీలోకంలో యెందుకైనా పనికొస్తామా? సత్యం విచారిస్తే, సన్యాసం వట్టి కపటం; బ్రహ్మచర్యం పనికిమాలినపని; అస్వాభావికమూ, అనవసరమూ, అసాధ్యమూ, నీరసమూ, నిర్లక్ష్యభాజనమూఅయిన ఆ రెండాశ్రమాలూ నామకార్థంగా గ్రంథాల్లో కనబడతాయి. అనుభవంలో కనబడవు. అందుకోసమే సమయానుకూల సంఘటనలకు ప్రతిబింబాలైన నాటకాల్లోనూ, సినిమాల్లోనూ శృంగారం వెల్లివిరిసింది. 'ప్రణయం దేవుడు; దేవుడే

ప్రణయ' మన్నమాట మీరు వినలేదూ? 'షెల్లీ' యేమన్నాడు? 'ప్రకృతిలో అన్నీ జంటలేతప్ప, యితరం లేదు; పోవోయ్!'-అన్నాడు. మన కాళిదాసుమాత్రం ఊరకున్నాడా?-నీళ్లకు పాచిఉండి తీరవలసిందేనని ఖండితంగా సిద్ధాంతం చేసినాడు. వాళ్ల ముందు మన మేపాటివాళ్లం?"-అని అనేక విధాలుగా నచ్చజెప్పి నా లోటు దిద్దుకున్నాను; కాదు-ఆదర్శం నిలుపుకున్నాను.

తరువాత మూడుమాసాలకే వేసవికాలపు సెలవులొస్తే, వీలు చిక్కించుకొని, అత్తగారింటికి ప్రయాణం కట్టినాను. అది పల్లెటూరు గనుక, అక్కడ దొరకని తినుబండారాలు కొన్ని మూటగట్టి తీసుకొని వెళ్ళడంవల్ల, ముఖ్యంగా పిల్లలందఱికీ నేను దేవుడనై కనబడినాను. పదేండ్ల యీడుగల మా వదినెతో సరసాలాడుతూ, భార్యకు పతివ్రతా ధర్మాలు బోధిస్తూ కాలం గడిపినాను. మా వదినె పొడుగరి అని మొదటనే చెప్పినాను. ఆ సంగతి సాధారంగా మనసులో ఉంచుకొని, "అబ్బో! నిన్ను ముద్దాడడానికి నిచ్చెన తెచ్చుకోవాలి!"-అన్నాను. ఆ దెబ్బతో అమాయకురాలైన ఆ బాలిక చిత్తం డోలాయమానమయింది. ఉన్నట్టుండి కన్నీరుకారుస్తూ, జాలిగా నావంక చూచింది. నేనూ పొడుగే!-తటాలున నవ్వి, దగ్గఱకొచ్చి, నా ప్రక్కను నిలిచింది. "ఏదీ? నే నెంత పొడుగైనా నీ భుజాలక్రిందకే!"-అంటూ బుగ్గలు పొడిచింది.

ఇదంతా యితరు లెవ్వరూ యెదుట లేనప్పుడే. బాల్య యౌవనాల మధ్యకాలంలో జరిగే భావకల్లోలాలు మహాకవులే వర్ణించలేకపోతారు. పవిత్రతా, అపవిత్రతా మెదడులో చేసే యుద్ధాల పరిణామాలు నానావిధాలు. సమయసందర్భాలనుబట్టి జయాపజయాలు భేదిస్తాయి. ఆ దశలోని పునాది, అనంతర జీవితసౌధానికాధారం. ఐతే, నా పాలిటబడింది పునాదో, సమాధో మీరే నిర్ణయించండి!-అప్పటి చాటుమాటున సరసాలాపే అలవాటు, నన్నిప్పటికీ వదలనంటుంది.

రెండేండ్లపాటు జీవితం ఒడిదుడుకులు లేకుండా నడిచింది. వేసవికాలపు సెలవులత్తగారింట్లో, మిగిలిన కాలమంతా పాఠశాలలో వ్యయించినాను. యస్. యస్. యల్. సి. పరీక్షలకు ముందు కొన్ని నెలలు, నా మనసంతా గందరగోళంలో పడింది. ఒకవంక సహాయనిరాకరణోద్యమం నన్నాకర్షించింది. ఇంకోవంక ప్రణయవికారం కొలుపట్టి లాగింది. ఏ స్త్రీని చూచినా, యెక్కడెక్కడో చూపులు దొంగతనంగా తిరిగేవి. ఏ గ్రంథం చదివినా, స్త్రీ వర్ణనకోసం పుటలు త్రిప్పబడేవి. ఇందుకు ఫలితంగా పాఠ్య పుస్తకాల కోపానికి పాత్రుడను కావలసివచ్చింది. తుదకు, పరీక్షాఫలితం పల్టీ కొట్టింది. అంతటితో విద్యాభ్యాసం ఆభాసమయింది.

"ఈ యింగ్లీషు చదువు కున్న రోగమే యిదీ. ఛీ! ఇది మన దేశానికెంతమాత్రం పనికిరాదు. పరీక్షలతో అవసరంలేని మన చదువువంటి సలక్షణమైన చదువు ప్రపంచంలో లేదు. ఇప్పటినుంచీ దాన్ని సాధిస్తాను. ఇల్లే పాఠశాల చేస్తాను. ఇష్టంలేని విద్య నాకెందుకూ?" అని నా వలెనే అవస్థపడుతున్న స్నేహితు లందఱికూ ఉత్సాహజనకంగా ఉపన్యసించినాను. దేశోద్ధారక దృష్టి సూచించినాను. లోలోపల కలిగే నిరుత్సాహాన్నీ, అధైర్యాన్నీ మ్రింగి, అన్యులయెదుట గంభీరంగా ప్రవర్తించినాను. నా ఉద్దేశాన్ని విపులీకరించి నాలుగు సమాసా లుపయోగించి, నవ్యపద్ధతిలో ఒక గ్రంథమే వ్రాసి, "విద్యార్థి సమస్యా పరిష్కారిణి" - అని పేరుపెట్టి ప్రకటించినాను.

"పరీక్ష లెందుకు?" - అనే శీర్షిక క్రింద వాటిమీద నా కున్న కోపమంతా తీర్చుకున్నాను. "నాలుగు వేదాలూ చిక్కులు తీసి, నానా పురాణాలూ వ్రాసి, నాటికీ నేటికీ ప్రసిద్ధుడైన వేదవ్యాసు డే పరీక్షప్యాసైనాడు? ఆదికావ్యమైన రామాయణం, రాముడు పుట్టకముందే వ్రాసిపెట్టిన వాల్మీకి, యే కళాశాలలో పఠించినాడు? ఉత్తమోత్తమ కావ్యనాటకకర్తయై, ఉన్న భాష లన్నిటిలోనూ అనువాదాలు పెంపొందడానికి హేతుభూతుడై, స్వదేశ విదేశీయ సరసజ్ఞులచేత సంతోష నాట్యాలు చేయించగలిగిన కాళిదా సెక్కడ 'స్కాలర్ షిప్' సంపాయించినాడు? అవతార పురుషుడైన శ్రీకృష్ణుడు 'గ్రాడ్యుయేటు' కాగలిగినాడా? బుద్ధుడు పాఠశాలముఖమైనా చూచినాడా?-" ఈవిధమైన ప్రశ్నల వర్షంతో కావలసినన్ని కాగితాలు నింపినాను. అనువైన గ్రంథాలయాలన్నీ గాలించి, అనుకూల గ్రంథాలు సేకరించి, అమోఘమైన నా ప్రయత్నాన్ని కొనసాగించి, విజయభేరి మ్రోగించినాను.

ఈ విపరీతసృష్టిచాతుర్యం చూచి, నా సహాధ్యాయులంతా దిగ్భ్రాంతులైనారు. పండితులూ పామరులూ పలువిధాల ప్రశంసించినారు. కాని, మావాళ్లుమాత్రం చెడిపోతున్నానని సొదపెడుతూ, వీపున మెటికలు విఱిచినారు.

4

"బోధించేవాడు సాధించలేడు!"-అన్నట్టుగా నా ఉద్యమం, "ఆదిలోనే హంసపాదు" వేసింది. నాగమణి కాపురానికొచ్చింది. కొంత స్థిమితపడ్డట్టయిందిగదా అని సంతోషిస్తుంటే, యేటా ఒక కాన్పు!-మూడోసారి ప్రసవించి, ముద్దరాలు మంచం పట్టింది. విషమవ్యాధి సూదివలెవచ్చి దబ్బనమై తేలింది. నా ప్రయత్నాలన్నీ విఫలాలైనాయి. జీవిత స్వప్నసామ్రాజ్యంలోని నవరత్నఖచిత సింహాసనం క్రుంగిపోయ్యే కాలం దాపురించింది. నా యింటిదీపం-నా హృదయజ్యోతి-నా ప్రణయసర్వస్వం-అదృష్టదేవత-అంతరించే అవస్థలో ఉంది. నాలో అంతవఱకూ గూడుకట్టుకొని కాపురమున్న లఘుప్రకృతి అనే పిట్ట హఠాత్తుగా యెగిరిపోయింది. ఎక్కడలేని ఓపిక తెచ్చుకొని, రాత్రింబగళ్లు నాగమణి శయ్య ప్రక్కనే ఉండి, యిష్టదేవతను ప్రార్థించసాగినాను. నా జీవితంలో యెన్నడూ నే నింత హృదయపూర్వకంగా యేపనీ చేసినవాడను కాను.

"తల్లీ! జగదంబా! నీ విచ్చిన వరాన్నే నీవు ప్రతిసంహరించడం న్యాయం కాదు. నాప్రణయరాసిని బ్రతికించు! నాసంసారం అంధకారబంధురం చేయకు! నా లోపాలేవైనా ఉంటే క్షమించు! కాదంటివా? నన్ను నీ యిష్టానుసారం శిక్షించు!-నా నాగమణి మాత్రం నష్టపఱచకు! నాకు గల నిరంతర నిష్కల్మష ప్రేమకు నీవే సాక్షి. నేను మహాపరాధినే. పరమపాపినే. ఒప్పుకుంటాను. నీవు దయామయివే? పతితపావనివే? నీ కోపం నావంటి అల్పమైన పురుగుమీదనా ప్రయోగిస్తావు? వద్దు, తల్లీ! వద్దు!-నీకు శతసహస్ర సాష్టాంగ నమస్కారాలు."—

నా ప్రార్థన నా మొహాన్నే కొట్టి, పాడు విధి తనపని తాను చేసింది. నా నాగమణిని దొంగిలించి మృత్యుదేవత తన కిరీటంలో ముడుచుకుంది. కట్టెమాత్రం నా యెదుట!-నేను మాస్తూ కూర్చున్నాను. ఒకవిధమైన వజ్రశాంతి నన్నావేశించింది. కడుపునిండా దుఃఖం-కన్నీరు వెలువడక, లోపలనే యింకిపోయింది. నోట మాట రావడంలేదు. స్తబ్ధత్వం హెచ్చింది. నా ప్రాణం నాలో లేనట్టు తోచింది. ఆశిరస్సు దగ్గఱిసీమ నూనెదీపం నన్నూరక వెక్కిరించింది. నా మెద డెక్కడెక్కడనో సంచరించింది. "నే నెవరు? నాగమణి యెవతె? నా కంటికి కనబడకుండా ఆ

శరీరాన్ని వదలిపెట్టిపోయిన పదార్థం యేయే పరిణామాలు పొందుతుంది? నేను ప్రేమించేది ఆ పదార్థాన్నా? ఈకట్టెనా? ఒకనాడు నాకట్టెకూ యిదేగతి పడుతుంది. అప్పుడు నే నేమౌతాను?"—ఈ ప్రశ్నలకు సమాధానాలు వెదకేకొద్దీ, విశ్వమంతా అంధకారంగానే అగపడింది.

బిగ్గరగా నే నేడ్వలేదని, వింతపడినారు కొందరు బంధువులు. చూడడానికొచ్చిన పెద్దలందరూ రాని కన్నీళ్లు తెచ్చుకున్నారు. వాళ్ళంతా మానవుల్లో జమ. నేను మృగాన్ని కనుక, యింత బాగా దుఃఖాన్ని ప్రదర్శించే యోగ్యత కలుగక పోయినది. లోలోపల కుళ్లిపోవడమే నా అలవాటు. శోకభారం అనుభవించడానికా, ప్రదర్శించడానికా?—మీరే చెప్పండి!

శ్మశానయాత్ర సాగేముందు, పూలూ, కుంకుమా మొదలైన పరిమళద్రవ్యాలు నాగమణిశరీరాన్ని తమలో దాచుకోడానికి తయారైనాయి. నేను నడుస్తుంటే జగమంతా చక్రమై తిరిగింది. సూర్యబింబం భూతమై బెదరించింది. హృదయకోణం దాకా గొడ్డలిపెట్టు పెట్టి, కొమ్మను ఖండిస్తే వృక్షమేవిధంగా విహ్వలిస్తుందో, ఆ విధంగా విహ్వలించినాను. ఆకాశం పరిహసించింది. అగ్ని, రాజకుండానే నాలో మండి, ఆపాదమస్తకం కాల్చినట్టయింది. జరగవలసిందంతా జరిగిపోయింది.

5

హృదయమనేది లేశమైనా లేని కొందరు బంధువులప్పుడే నా ద్వితీయ వివాహానికి పెత్తనాలు సాగించారు. మానవుల్లో యిది కామూలన్నారు. "పోయినవాళ్ళతో మనమూ పోతామా? నొసటిగీతెవ్వరూ తప్పించలేరు. ఎన్నాళ్లని యీ విధంగా ఉంటావు? నీవింకా యువకుడవు. నిన్నామొన్న కళ్లు తెరచినావు. మా కండ్లెముందర పుట్టినావు. ఇరవై అయిదేండ్లకే యేమైనట్టు? ఇంకో పెండ్లి చేసుకో! ఈ పిల్లల నెవరు పోషిస్తారనుకున్నావు? నీవు గనుక 'ఊఁ-' అంటే నేడే సంబంధం తెస్తాము"—అని ఉపదేశించినారు.

నాకు పచ్చిపుండుమీద పచ్చిమిరపకాయలు నూరినట్టయింది. "సన్యాస మనుకున్న రోజులు సాగినాయి; బ్రహ్మచర్యమన్న రోజులు పాడైనాయి; దేశసేవ దిబ్బలో కలిసింది. కడకు నాగతి, 'ఆదర్శపతి', అనిపించుకోడానికైనా లేకపోవడమా? పరిణయకాలంలో చేసిన ప్రమాణాలన్నీ యే గంగలో కలిసినాయి? సర్వదేవతలూ, సర్వఋషులూ, సర్వతీర్థాలూ, సర్వభూతాలూ సాక్షులుగా, 'నాతిచరామి', అని నోరార పలికినానే? ఆ పలుకులన్నీ చిలుకపలుకులేనా? అర్థం చేసుకోగలిగితే, వ్యభిచారంకంటే ద్వితీయవివాహం దోషమనిపించదూ? మనదేశంలో స్త్రీలుమాత్రం తమ ధర్మాన్ని పరిపాలిస్తారు. మనం వాళ్లకే ద్రోహం తలుస్తాము. క్షుద్రజీవికలే మానవసాంప్రదాయాలా? చెప్పేదొకటీ, చేసేది వేఱొకటా? జపించేవి స్వర్గ, వైకుంఠ, కైలాసాలా? సంచరించేవి అధః పాతాళాలా? భూలోకంలోనైనా వీళ్లు నిలువడానికి తగరే? వీళ్ళకొక నాలుక లేనే లేదే?—ఛీ! నాకీ మానవుల జోలే వద్దు. మృగంగా ఉన్నా కొంత మేలు."—అని నిశ్చయించుకున్నాను.

* * *

మూడు కాన్పులైనప్పటికీ, మిగిలిన బిడ్డ ఒకడే. వాడి పోషణ కూడా కాలక్రమేణా కష్టసాధ్యమయింది. 'ఆడుదానిచేతి అన్నం, మగవానిచేతి బిడ్డా'—అనే సామెతలోని ఆఖరుభాగం నాయందు బాగా అన్వయించింది. నా మెదడు మొదటికి వచ్చింది. తర్కవితర్కాల పోరాటంలో తండనాలాడుతూ కొన్నాళ్లు గడిపినాను. నాగమణి మరణంనాటి ఉద్రేకమంతా సన్నగిలి, నాలో నిద్రపోతున్న నిజస్వభావం చిగురింప సాగింది. "జీవితంలో యిటువంటి కఠినవ్రతం చిత్తభ్రాంతి కాకుంటే యేముంది? నా ఊహలే ధర్మమార్గసోపానాలైతే, నానాటికీ మనసులో యీ తుముల యుద్ధమెందుకూ? ఊళ్ళో ఉండవలసిన ప్రాణి అడవిలో కూర్చుంటే, నీళ్లల్లో ఉండదగిన చేప నేలమీద సంచరించదూ? ఇందుకు ఫలితం ఆత్మహత్యే తప్ప యింకేమిటి? అస్వాభావికమైనదే అధర్మం. ఐతే, ఉగ్రమైన యింద్రియనిగ్రహంతో కాముడు రాముడు కావడంలేదూ?"—

* * *

మరి కొంతకాలం జరిగేటప్పటికి, మళ్లీ పెళ్ళే మంచిదని తోచింది. "కాని, యీసారి మామూలు పెళ్లి పనికిరాదు. దేశంలో వీరేశలింగం పంతులుగారి ధర్మమా అని వితంతువు లెందరో వివాహాలకు తయారౌతున్నారు. వాళ్లలో ఒక సరిక్రొత్త వితంతువును వరిస్తాను. సంసారం పూర్తిగా జయిస్తాను. ఇంతకుముందు కలిగిన అపజయాలన్నిటిని రాబోయ్యే విజయానికి మెట్లుగా భావిస్తాను."—అని ఆకాశంలో మేడలు కట్టినాను.

ఇంతలో పురాణయుగం మాసి, అధునాతన యుగం ఆరంభమయినందుకు సూచనగా, శారదాబిల్లు అమలులో కొచ్చింది. ఎదిగినపిల్ల లేయింట్లో చూచినా యెక్కువైనారు. "వీళ్లకే వరులు దొరకడం గగనమైతే, వితంతువుల గో డెవరు విచారిస్తారు? కావలసినంత ఆస్తితోగూడా అమ్మాయిలను, కోడిపిల్లలను గ్రద్దలు మోస్తరుగా తన్నుకొని రావచ్చు. ఆ శారదాగాడు నాకో సమే పుట్టినట్టున్నాడు. బలే యెత్తు వేసినాడు! ఎందులో దిగినా నాకష్టంలేదు గద?" అని కూడా అప్పుడప్పుడూ ఉబలాట పడినాను.

వితంతుశరణాలయాలకు ఉత్తరాలు వ్రాసి, జవాబులకోసం యెదురు చూచినాను. ఏమీ ప్రయోజనం లేకపోయింది. వాళ్లడిగే ప్రశ్నలన్నీ అన్నీకావు. ఖూనీకేసుల్లో ముద్దాయిలను క్రాసు చేసేపోలీసులైనా కొంత మేలనిపిస్తారు. "స్వయంగా ఒక చక్కరు కొడదామా?—అక్కడి రహస్యాలన్నీ తెలుస్తాయి. ప్రత్యక్షం వేఱూ, పరోక్షం వేఱూనూ." అనుకొని బయలుదేరినాను.

6

తంతువు తెగిన గాలిపటానికొక ఊరేమిటి? నిరుద్యోగికి నియమమేమిటి? రాయలసీమ విడిచి ఒక్కసారిగా రాజమహేంద్రవరం దిగినాను. భాషలో అంతరం; భావాల్లో అంతరం; అలవాట్లలో అంతరం; ఆకారాల్లో అంతరం;—ఆడవాళ్లలో గూడా అంతరమే!—మా సీమలో శృంగారవతులకు సారస్యప్రధానమైనవి రెండూ సామాన్యాలు; అక్కడ అసామాన్యాలు. ఆనకట లేని తుంగభద్రాతీరపు తిన్నెలకూ, అఖండగోదావరీ డెల్టాలకూ యెక్కడి కెక్కడ? నిమ్మ మొదలు దానిమ్మ, లేదా నారింజ మొదలు నారికేళం—ఇంతకంటే యెక్కువ మా సీమలో అరుదు. అక్కడనో? బత్తాయి మొదలు పనసవఱకూ పంచారించినాయి. చూడడానికి రెండు కండ్లూ చాలవేమో?

వితంతుశరణాలయంలో విగత తంతువులూ, విపరీత తంతువులూ; వినోద, విశ్రాంత, విజృంభిత, విభ్రమ, విక్రమాది

(29-వ పేజీ చూడండి)

కరివేపాకుమొక్క

శ్రీ ఓగేటి శివరామకృష్ణ



రామచంద్రరావు ఆఫీసు నించి యింటికివస్తూ...సరస్వతిని పిలిచి. అరుఅంగుళాల పొడవున్న మొక్కను ఆమెకిస్తూ 'చూశావా యిది కరివేపాకు మొక్క మరి మనకు కరివేపాకు లేనిలోటుండదు. మా ఏజంటు కొత్తగా డాబాకట్టాడు కదూ...వాళ్ళ దొడ్లో వేయించటానికి—ప్రత్యేకంగా బంట్రోతును పనిగట్టుకొని పంపి తెప్పించాడు-వాడు తెచ్చిన అరడజను మొక్కల్లో... రెండు మూడుమార్లు బలవంతంమీద అడగ్గా, అడగ్గా ఒకమొక్క యిచ్చాడు. ఉన్న గుమస్తాలంతా అడిగినా... చిరచిరలాడుతూ నా ఒక్కడికే యిచ్చాడు. మరి కరివేపాకు మొక్క యెంత జాగ్రత్తగా పెంచుతావో యేమో' అన్నాడు.

'మీకేమయినా పిచ్చియెత్తిందేమిటి?.. కరివేపాకు మొక్కకోసం — ఏజంటు నాశ్రయించటం యెందుకూ? ఆయనకు యివ్వటం యిష్టంలేనప్పుడు బలవంతాన అడిగి అడిగి తెచ్చుకోటంయెందుకూ?... పోనీ యేమయినా స్వంతయిల్లయితే నాలుగు మొక్కలూ వేసుకోవచ్చు...' అద్దెకొంపాయిరి. నిలకడగా ఉండేవాళ్ళమూ పోనీ అనుకుంటే— ఈ దినం ఒకచోటా, మరో దినం మరోచోట ఉండేవాళ్లమాయెను. ఇంటివాళ్ళకు అవసరం అని తోస్తే... వాళ్ళుదొడ్లో వేసుకోరూ...మీ కేమిటో పిచ్చి గాని' అంది సరస్వతి—

'పిచ్చి అను యేమను— ఏమిటో ఏజంటు దొడ్లో వేయించటానికి మొక్కలు తెప్పించటంతోటే— వాటిలో ఒకటి పెంచాలని బుద్ధిపుట్టింది... బ్రతిమాలితే బ్రతిమాలితే యిచ్చాడు—ఆయన శ్రమపడి యిచ్చినందుకు, మనం దాన్ని పెంచి పెద్దచేసి సంతోషించాలి... మొక్క యిస్తూ మరీమరీ అతడు అన్నాడు. 'మీకు మొక్క పెంచటం అంటే తగిన శ్రద్ధ ఉంటదనుకొంటాను. అందరికంటే ముందడిగినది మీరవటంవల్ల యిచ్చాను. జాగర్తగా మొక్కను పెంచండి — దాని కేవిధమైన లోట్లూ రాకుండా కాపాడాలి'—అని.

'ఓ - అని నే నాయనకు వాగ్దానమిచ్చా. ఆయన పెళ్లో డబ్బు యిస్తున్నట్లుగాబాధపడ్డాడు—ఎలాగో యిచ్చాడు—మరి పెంచి, పెద్దచేసి యెంతపనైనా చెయ్యాలి-ఏమంటావ్?' అని అన్నాడు తిరిగి రామచంద్రరావు.

'మీ పిచ్చి చాలా బాగుంది. కానీ, పారేస్తే గుప్పెడు ఆకు గుమ్మంలో తెచ్చి పడేస్తారే; ఏమిటో కరివేపాకుమొక్కను తెచ్చి— ఇంత హంగామా?'

'హంగామా యేముంది. దీన్ని పెంచి పెద్దదిచెయ్యాలి... దీనికి పిల్లల్ని పుట్టించాలి...ఇంటివాళ్ళ కవసరంలేకపోతే, మన వాటాభాగంలో మనం వేసుకొని పెంచుకొంటే వాళ్ళు వద్దంటారా?—ఆలోచించి చూడు...మొక్క మనదొడ్లో ఉన్నట్లయితే మరి మనం ఒకళ్ళను అడగవలసిన అవసరం ఉండదు—కొంచెం ఖర్చు తగ్గుతుంది. మనం దానికి యేమీ తిండీ, బట్టా యిచ్చి పోషించనక్కర్లేదు. కొంచెం నీళ్ళూ, కుడితీ పోస్తే, దాని మానాన్న అది బ్రతుకుతుంది. పిల్లాపీచూ ఉన్న అతడే 'మాయింటావిడకు మొక్కలంటే ప్రాణం. అందులో కరివేపాకు చెట్టంటే మరీనూ—ఆమె ప్రతిరోజూ వేధించటంవల్లనే యీ దినం ఈమొక్కలు తెప్పించటం జరిగింది' అన్నాడే—పిల్లా నల్లీ ఉన్న ఆమె మొక్కలు పెంచటంలో—తీరుబడి చేసుకొని శ్రద్ధచూపుతూన్నప్పుడు—సంతానం-నాస్తి— అయిన నీవు కొంచెం మొక్కను పెంచలేనంటే చాలా ఆశ్చర్యపడవలసి వస్తుంది—

'సరే... మంచి గొడవ తెచ్చిపెట్టారు-ఏదో మూల పాతండి—బ్రతుకుతే బ్రతుకుతుంది— చస్తే చస్తుంది' అన్నది సరస్వతి కొంచెం గట్టిగా విసుక్కొంటూ.

'శుభం పలకరా మంకెన్నా అంటే—యేమిటో అన్నాట్ట. అలా ఉంది నువ్వు చేసే పని. మొక్క వేసి— పెంచమని సుమారుగంట కాలంనించి బతిమాలుతూంటే యేమేమిటో తెలివితక్కువ ప్రసంగం చేస్తావెందుకు? పిల్లా జెల్లాలేని నీలాటివాళ్ళకు కొంచెం మొక్కను పెంచటంకూడా కష్టంగానే ఉంటుంది— ఏదో పారేశాను— ఏదో చేశానంటే వీల్లేదు. మొక్కను నీ అధీనం చేస్తున్నప్పుడు—దాన్ని కంటిరెప్పల్లో పెట్టుకొని కాపాడే భారం నీది—'

'సరే బాబూ—మరి గొడవ చాలించండి—ఆక లేస్తూంది'—


'భోజనంసంగతి తర్వాత చూద్దాం ముందీపని కానీ—నీ చెయ్యి చాల మంచిటద—మీ చెల్లెలంటూంటే రెండుమూడుమార్లు విన్నాను—నీ చేత్తో పెట్టిన అనప్పాదు తెగ కాయలు కాస్తుందట. అందువల్ల నువ్వే ప్రత్యేకంగా మొక్కను నాటాలి. నీళ్ళుపొయ్యాలి. అవి పూర్తవుతేగాని భోజనం చేసేది లేదు—ముందు నువ్వు మరి యీ పని కానివ్వాలి'—అని పట్టుపట్టాడు రామచంద్రరావు.

(30-వ పేజీ చూడండి)

థానిక:

పెద్దపదవి

శ్రీ ద్వివేదుల సోమనాథశాస్త్రి



వెంకన్న పంతులు చేసిన మోసానికి రామస్వామి చాలా విచారించాడు. డబ్బు అయిపోయింది కాని ఫలితం లేదు. ఆ ఆరునెల్లనుండి వెంకన్న పంతులు మీద తను ఎంతో ఆశపెట్టుకొన్నాడు. అతని వల్ల తనకూ ఒక గౌరవమైన పదవి వస్తుందని, ఆమాత్రం వస్తే మిగతా పని నెరవేర్చుకొనే శక్తి తనలో ఉందని తనకు బాగా తెలుసు కాని అతడు తన సొమ్ము తిని తన నింత అన్యాయం చేస్తాడని యెన్నడూ తలవలేదు. వెంకన్న పంతులు చేసిన యీ ఘోరం తలుచుకుంటే రామస్వామికి పూర్వం అతని కిచ్చిన లంచాలూ అవీ యివీ గుర్తుకొచ్చి గుండె గభేలుమంటుంది! యిలా యితను ఒక్కడే కాదు - మరో యిద్దరుకూడా రామస్వామి డబ్బు తిని ఆఖరికి లాభం లేదని పొమ్మన్నారు. కాని - రామస్వామికి యింకా ఏదైనా పదవి సంపాదించాలనే కండూతి పోలేదు. అందుకే ఇంత డబ్బు పోయినా నాల్గుతిట్లు తిట్టి ఊరుకున్నాడు. ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

రామస్వామి భార్య లక్ష్మికిమాత్రం యిది ఏమాత్రం నచ్చలేదు. ఎన్నోసార్లు యిలా డబ్బు పాడుచెయ్యవద్దని చెప్పి విసిగి ఊరుకుంది! రామస్వామి ఎలాటివాడయినా లక్ష్మినిమాత్రం సాధ్వి అని చెప్పకోక తప్పదు. అన్నిటిలోనూ ఆమెలాటి మనిషి లేదనే చెప్పకోవాలి - ఆమెకి పిల్లలు లేరన్న చింత తప్ప వేరే చింత మరేమీ లేదు!

పిత్రార్జితం రామస్వామిని ఉద్యోగం చేయనిచ్చింది కాదు. ఎంత డబ్బయినా ఖర్చుచేసి ఓ పెద్ద పదవి సంపాదించాలని రాత్రి పగలూ ఆలోచించేవాడు! అవిధంగానే ఏభైవేలవరకూ ఖర్చుచేసి రెండేళ్ళ క్రితం చైర్మన్ పదవి సంపాదించాడు. కాని యితని నిర్వహణ రుచి చూసినతర్వాత మళ్లీ ఎన్నికలలో ఒక్క ఓటుకూడా వచ్చిన పాపాన్ని పోలేదు - ఆఖరికి ఓటు ఒక్కింటికి పది రూపాయలు ఇస్తానన్నా లాభం లేకపోయింది! ఆతర్వాత వెంకన్నపంతుల్లాంటివారిని ఎందర్నో ఆశ్రయించి వారికి మస్తుగా మేపినా కృతకృత్యుడు కాలేకపోయాడు.

వెంకటేశంగారు రామస్వామి వున్న వూరికి చెందిన రాష్ట్రానికి మంత్రులలో ఒకడు. ఆయనలో కొన్ని లోపాలున్నా కార్యనిర్వహణలో గట్టిబుర్రే అని చెప్ప కోవచ్చు. ఆయన గంభీరాకృతిని చూసేసరికి ఎవడో మహానుభావుడని తోచక తప్పదు. ఈయనకి చెందిన దగ్గరి బంధువులందరూ దరిదాపు యిలాటి పదవులు ఆక్రమించినవారే! వెంకటేశంగారు పదవిలోనికి వచ్చినతరువాతే వారి బంధువులందరూ కూడా పదవులు సంపాదించారంటే— వెంకటేశంగారి కృషికి ఎంతైనా మెచ్చుకోవాలి! ఈ మూడు సంవత్సరాలబట్టి ఆయన నిర్వహణలో ఏలోపం లేదు కాని యీమధ్య ఓ యిద్దరి పెద్దమనుష్యులవద్ద లంచం పుచ్చుకొన్నాడని బయటికి తెలిసిపోవడంవలన తన ప్రఖ్యాతికి కొంచం మబ్బు కమ్మింది. ఇంతలో తిరిగీ ఎన్నికలు ప్రారంభం అవడం వల్ల వెంకటేశంగార్కి తనని తిరిగి ఎన్నుకుంటారో లేదో నన్న భయం కల్గింది— అందుకనే ముందుగానే రాష్ట్రం అంతా పర్యటనచేసి ప్రజల్ని తనవైపు తిప్పకోడానికని ప్రతీ పల్లెకి, పట్నానికి బయలుదేరాడు. కొంతవరకూ తిరిగి యింక భయం లేదని గుండె నిబ్బరం చేసుకున్నాడు— ఆ మర్నాడు రామస్వామి ఉన్న ఊరికి వెళ్లి ఉపన్యాసం యివ్వడానికి నిశ్చయించుకొని ముందుగానే కబురుచేశాడు. ఈయన కీర్తిని, ఉదారస్వభావాన్ని విని, రామస్వామి యీయన వల్లనైనా తనూ ఓపదవి సంపాదించవచ్చుకదా అనే ఆశతో యీయనికి అఖండ స్వాగతం యిచ్చి సత్కరించడానికి నిశ్చయించుకున్నాడు.

ఆ రోజుని రామస్వామి తన యిల్లు చక్కగా ముస్తాబు చేయించేడు. హడావుడిగా అటుంచి యిటు ఇటుంచి అటూ తిరుగుతూ అందరికీ పనులు పురమాయిస్తున్నాడు. క్రిందటి రాత్రంతా వాల్ పోస్టర్లు రాయించడంలోనూ మిగతా పనుల్లోనూ మునిగియుండడంవల్ల అతని కళ్లు చింత నిప్పల్లా ఉన్నాయి. ఊరిలో ఎక్కడ పడితే అక్కడ "శ్రీ వెంకటేశంగారి ఆగమనం" అనే కాగితాలు అటించబడ్డాయి. సాయంత్రం అయ్యేసరికి మైదానంలో వేదిక

చాలా అందంగా తయారు చేయించి, వెంకటేశంగార్ని ఎదుర్కోడానికి టాక్సీతో సహా స్టేషన్‌కి వెళ్లేడు. విలువయిన చమ్కీ దండలు కొన్నాడు. బండీ వచ్చేలోపు నితనింకా చెయ్యవలసిన పనులు ఏమైనా ఉండిపోయాయేమో నని ఆలోచించేడు. ట్రైను రాగానే వెంకటేశంగార్కి స్వాగతం యిచ్చి తిన్నగా ఉపన్యాస వేదికకి తీసుకుపోయాడు.

వెంకటేశంగారి ఉపన్యాసానికి మొదట రామస్వామిగారు రెండు ముక్కలు వెంకటేశం గురించి, ఆయన ప్రతిభ గురించి ఆయన దేశసేవ గురించి పొగిడి చెప్పి కూర్చున్నాడు. వెంకటేశంగారు తన ఉపన్యాసంలో రామస్వామిని అభినందిస్తూ చెప్పేసరికి రామస్వామి పొంగిపోయాడు.

కార్యక్రమంఅంతా అయిన తర్వాత రామస్వామి వెంకటేశంగార్ని తనింటికి అతిథిగా తీసుకువచ్చాడు. ఇది యితనికి కొత్తకాదు. ఆపాటి యీపాటి పేరున్నవాడు అప్పూరుకొచ్చి రెండు ముక్కలు ఉపన్యాసం చెప్పేసరికి ఆయనవల్ల ఏదో పెద్ద పెన్నిధి వచ్చినట్టు వాడిని తనింట గౌరవించడంఅంతా అయిన తర్వాత నిట్టూర్పు విడవడం పరిపాటే! అయితే యింతకుపూర్వం వచ్చిన వారికీ యీ వెంకటేశంగార్కీ వ్యత్యాసం ఏమంటే - వారందరికన్నా యీయన కొంచెం ఎక్కువ పదవిలో ఉన్నవాడు. అందరికీ కొస్తో కూస్తో తెలిసినవాడూను. ఆయన పేరు చాలాసార్లు పేపర్లలో పడింది. ఉపన్యాసాలుకూడా కొన్ని పడ్డాయి- యిన్నిటికన్నా ముఖ్యమైంది రామస్వామికి యీయన్ని చూసేసరికి ఏదో తెలియని అభిమానం పుట్టుకురావడమే! ఆయనవల్ల తనకు పదవి తప్పకుండా రాగలదనే నమ్మకం రూఢిగా స్థిరపడింది. ఆయనకోసం ఎంత ఖర్చుచేసినా వృథా పోదనే గట్టిగా నమ్ముతున్నాడు. ఎలా అయితేనేం రామస్వామి గార్కి వెంకటేశంగారిమీద గట్టి నమ్మకం కలిగిపోయింది - ఆయన్ని చూసేసరికి ఏదో పెద్ద దేవతని చూస్తున్నట్టు - ఆయనతో మాటాడేసరికి తన కేదో చెప్పలేని గౌరవం కలుగుతున్నట్టు - ఆయనప్రక్కని కూర్చునేసరికి అప్పుడే తనూ ఓ పదవిలో అధికారం చెలాయిస్తున్నట్టూ భావిస్తున్నాడు. తనకు శక్తి ఉన్నంతమట్టుకు ఏ లోపం రానీయకండా ఆయన్ని గౌరవించాడు - ఆయనకూడా యీయనతో ఏకీభవించడం ఔనన్నదల్లా అవుననడం కాదన్నదల్లా కాదనడం మూలాన రామస్వామి పరి సంతోషం పట్టలేకపోయాడు.

రామస్వామి వెంకటేశంగారు భోజనానికి కూర్చున్నారు. నెయ్యి వడ్డించమని రామస్వామి లక్ష్మిని కేక వేశాడు. లక్ష్మి నేయి పట్టుకువచ్చి రామస్వామికి వేసి తరవాత వెంకటేశంగారికి వేసింది. ఆమె వంగి వడ్డిస్తున్నపుడు వెంకటేశం ఆమె వైపే చూస్తూ ఒక్క నిముషం ఉండిపోయాడు. ఆమెను చూసి ఒక్క గుటక మింగేడు. యీ ఆలస్యంలో చెయ్యి పూర్తిగా నేయితో నిండిపోవడంవల్ల మంచెల మీదుగా కూడా కారిపోతోంది. వెంకటేశం తెలివి తెచ్చుకొని 'చాలండి! చాలు - చాలు!' అని చెయ్యి తిప్పడంలో యింకా నెయ్యి పోస్తూన్న లక్ష్మిచేతిలోని మిళ్లిగరిటె క్రింద పడిపోయింది! యీ వాలకం అంతా చూసి లక్ష్మి మొహం చిట్లించుకోబోయింది. కాని, అంత పెద్దమనిషి, అధికారి ఏంచేస్తాడో అని భయపడి వెళ్లిపోయింది, రామస్వామి తనూ, తన పదవి, అధికారం, యీ గొడవల్లో పడి యీవిషయంగమనించనేలేదు. తక్కిన వంటకాలన్నీ లక్ష్మి వంటమనిషిచేతే వడ్డింపచేసింది. లక్ష్మి మరి రాకపోవడం వెంకటేశంగార్కి మనస్సు చివుక్కుమంది! ఎలాగయితే నేం భోజనాలు అయింతర్వాత లక్ష్మికి తాంబూలపు పళ్లెం అందించక తప్పింది కాదు. వంకటేశం ముందుగాను తన భర్త వెనకను కూర్చొని ఉండటంవల్ల వెంకటేశాన్ని దాటుకుపోవలసి వచ్చింది. వెంకటేశం ఆమె వచ్చినుండి అదోలా ఆమెవైపే చూస్తున్నాడు! యీసారి మాత్రం లక్ష్మికి ఒళ్లుమండింది. చిరాకుగా వెంకటేశంవైపు కళ్లు పెద్దవిచేసి చూసి వెళ్లిపోయింది. రామస్వామికి యిదంతా చూడగానే చెప్పలేని కోపం వచ్చేసింది. కాని, ఏం చేయగలడు - పెద్ద అధికారి? ఏమో ఏంచేస్తాడో! అని కోపం తనలోనే అణుచుకున్నాడు. తన కోర్కెని వెంకటేశంతో చెప్పడానికిదే మంచి సమయం అని ఆయన్ని మాటల్లోకి దింపేడు!

'అయితే మీకు ప్రతికక్షిగా ఎవరు నిలబడినట్టు?'

'ఇప్పటికి ఎవరూ నిలబడలేదు కాని నరసింహం అనే ఆయన నిలబడవచ్చునని అందరూ అంటున్నారు!'

'అలాగా - ఎవరయితే నిలబడనీయండి. యీసారికూడా మీకే జయం తప్పదు -'

'ఏమో ఎవరు చెప్పగలరు...ఆ భగవంతుడి దయ'

'మిమ్మల్ని చూసి మీ ఉపన్యాసం విన్న తర్వాత మరొకరికి ఓటు వెయ్యగలరా?'

'ఆయనకూడా తక్కువ వాడు కాడు!'

'ఏమైనా సరే మీలాటివారు మా రాష్ట్రానికి ఉండడం అరుదు'

'అది మీ అందరి దయే కదూ!'

'ఇక్కడనుండి మీ తరువాత కార్యక్రమం ఏమిటి?'

'ఇక్కడ ఇంకా ఒక రోజు పని ఉంది! తరువాత యీ ప్రక్కఊరు చూసుకొని పోవడమే. అక్కడికి పూర్తి అవుతుంది!'

'ఎల్లుండి మంచిది కాదు. ఆ మర్నాడు వెళుదురు గాని మీకు అభ్యంతరం లేకపోతే అలాగే చెయ్యవచ్చు!'

'మాకింకా అవుసర కార్యాలు న్నాయండి! తిథులు, శకునాలు, మాసుకుంటే ఎలా?'

'చిత్తం! చిత్తం! అలాగే కానియ్యండి......చిన్న మనవి'

'ఏమిటి చెప్పండి. సంకోచం దేనికి? మీరు నాకోసం యింత శ్రమ తీసుకున్నందుకు మీకు నా వీలైనంత సహాయ్యం చెయ్యగలను'

'ఏమీ లేదు చూడండి-! అప్పుడే ముప్పై ఏళ్లు దగ్గరపడ్డాయి. ఇంతవరకూ ఏ ఉద్యోగం సద్యోగం ఏమీ లేదు...ఎంత డబ్బుఉండి ఏం ప్రయోజనం మనిషికి గౌరవం అన్నది ఉండాలి కదండి!-అందుకని......'

'ఓ...అదా...ఈ పాటిదానికేనా - నా చేతనైనంత సహాయం చేయడానికి ఏం అభ్యంతరం లేదుగాని చూశారా! ఇప్పుడెలాటి పరిస్థితిలో ఉన్నానో - ఎన్నికల్లో నేను గాని నిలబడకపోయినట్లయితే ఎలాగా అని'

'అయ్యో. మీరు నిలబడకపోవడం ఏమిటి! నిలబడేటట్లు చేద్దాం. ఆ మాత్రం మాట యిస్తే చాలు ఏదో అందరితోపాటు చిన్న పదవిలాటిది.....ఇప్పిస్తే...'

'చెప్పేను కదండి. నేనేగాని యీసారి కూడా యీ స్థానంలోనే వుండినట్లయితే మిమ్మల్ని ఎలాగైనా ఓ మంచి పదవిలోనికి తీసుకువచ్చే ఏర్పాటు చేస్తాను. నన్ను నమ్మండి!'

'చిత్తం! చిత్తం! మీ సంగతి తెలుసులెండి! ఏనా పూరికే జ్ఞాపకం చేశాను-'

'ఆఁ హాఁ! దానికేం లెండి! రాళ్లెత్తాలా గుళ్లు ఎత్తాలా - నా చేతిలో ఉన్న పనికి!'

"చిత్తం అందుకేనండి- మీ చేతిలో ఉన్న పని"

'సరేలెండి తప్పకుండా అలాగే-చేద్దాం-'

(38-వ పేజీ చూడండి)

అతివృష్టి

పెద్దకథ — శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

(క్రిందటివారం తరువాయి)

3

కామాక్షి విషయమై బలభద్రం, బంగారమ్మ తల్లడిల్లిపోతున్నారు. భోజనాలై సావిటిలో వాళ్లిద్దరూ కూర్చున్నారు.

"ఈఏడు వర్షాలు అధికమై పంటలు నాశనమైపోయాయి" అన్నాడు బలభద్రం.

"అతివృష్టి అనావృష్టికూడా ఫలితంలో సమానమే!" అంది భార్య.

ఇంతటిలో పోస్టుమాను గుమ్మంలో ఎదురయాడు. బలభద్రం వెళ్లి లేఖ అందుకొన్నాడు. ఉత్తరం చూసి 'శోభనాచలం దగ్గరనుంచి వచ్చింది' అని, చదువుకొని, భార్యతో "మన అమ్మాయి ఆమె పింతల్లి గారింటికి వెళ్లిందని రాశాడు. ఈ పింతల్లి ఎవరు? మనవైపు పింతల్లు లెవరూ లేరు కదా! ఒక వేళ అల్లుడి పింతల్లి గారింటికి అల్లుడు అమ్మాయి వెళ్లేరేమో! కాని అక్కడినుంచి పుట్టింటికి వెళుతుందని చెప్పడం చూస్తే ఈమాటలేఅర్థంకాకుండా పోతున్నాయి" అన్నాడు బలభద్రం.

"ఏదయినా పిల్ల సంగతి ఇదమిత్థం అని తేలలేదు" అంది బంగారమ్మ.

ఇద్దరికీ ఏమీ పాలుపోలేదు. దిగులుగానే కూర్చున్నారు. వియ్యంకుడిదగ్గరనుంచి ఉత్తరంకోసం అనుక్షణం చూస్తూనే ఉన్నారు.

ఆ మర్నాడు సన్నిధిరావు రాసిన ఉత్తరంచేరింది. బలభద్రం చదివి, భార్యతో "అమ్మాయి ఖులాసాగానే ఉందిట!" అన్నాడు. ఆ మాట విని భార్య "అమ్మయ్యా!" అని గుండెలమీంచి భారం తీసినట్టుగా కనబడింది.

"ఈదసరా సెలవులకి వాళ్ల పింతల్లి గారింటికి కొడుకు కోడలు వెళతారుట! బహుశ! ఈసంగతే కామోసు శోభనాచలం తల్లకిందులుగా రాశాడు. ఇంతకీ వాళ్లకేమి పట్టింది చెప్పా! అతని భార్య వెళ్లి కనుక్కొండిట! ఒకరి పని మరొకరు చెయ్యడం వస్తే ఇలాగే ఉంటుందనుకో" అని నవ్వి "పైగా, ఆమెకి ఈచుట్టరికాలన్నీ సరిగా తెలియక తబ్బిబ్బు పడినా పడుండవచ్చు!" అని వ్యాఖ్యానం చేసి, సర్దుబాటు చేశాడు.

అప్పటి కేదో కొత్త శాంతి అనిపించింది వాళ్ల మనస్సులకి.

ఆ మర్నాడు రామామణిదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. తల్లిదండ్రు లిద్దరూ ఉత్తేజం పొందారు. తండ్రి ఆ ఉత్తరం విప్పి చదివిచూసుకొని నిర్ఘాంతపోయాడు. అతని మొహం చూసి భార్య ఆదుర్దాపడి "ఏమి టేమిటి!" అని ప్రశ్నించి "పిల్ల ఖులాసాగా ఉందో లేదో మొదట చెప్పండి!" అని గాబరాపడింది.

బలభద్రం కళ్ళ నీళ్లు తుడుచుకొంటూ ఉత్తరం ఇలాగు చదివాడు. "శ్రీమహాలక్ష్మి సమానురాలైన అమ్మగారికి — నేను ఇక్కడ బాధలు పడలేకుండా ఉన్నాను. పోనీ ఓపిక తెచ్చుకొని చాకిరీ చేద్దామా అంటే ఓపిక సన్నగిలింది. శల్యావశిష్టంగా ఉన్నాను. చిన్ననాడు ఉపాధ్యాయుడు నేర్పిన అక్షరం ముక్కలు నాకు ఇంత అక్కరకి వస్తాయని నేను కలలోనైనా తలచలేదు. నా క్షేమ సమాచారాలు మీకు తెలియ జేసేవారు ఎవరిక్కడ? మనుష్యులకి నన్ను చూడడానికి సాధ్యంకాదు. అటువంటి చెర అనుభవిస్తున్నాను. ఈ మధ్య నాయోగక్షేమాలు తెలుసుకోడానికి ఎవరో ప్లీడరుగారి భార్య వచ్చిందట! కాని నేను మా పింతల్లిగారింటికి వెళ్లినానని చెప్పిమా అత్తగారు పంపించి వేసినారట! ఈ సంగతి నాకు నా పొరుగింటి స్నేహితురాలివల్ల తెలిసింది. ఆ అమ్మాయే నా ఉత్తరాలు పోస్టులో పడవేస్తూ ఉంటుంది. ఇంతకంటే రాయవలసిన విశేషాలు లేవు. ఎంతో రహస్యంగా ఈ ఉత్తరంరాయడమే కష్టమైపోయింది. ఇహ నాదగ్గర కార్డులు, కవర్లు లేవు. మీ మొహాలు చూసే అదృష్టం దేవుడు నాకు రాసి పెట్టేడో లేదో!" అని చదివి బలభద్రం కళ్లనిచేతితో కప్పుకొన్నాడు. అతని చెక్కిళ్లవెంబడి కన్నీళ్లు ప్రవహిస్తున్నాయి.

బంగారమ్మ వల వల ఏడ్చింది.

"శోభనాచలం రాసిన విషయం ఈ ఉత్తరంతో కాని రుజువుకాలేదు. "పాపం! అతన్ని నిష్కారణంగా దూషించాను" అని బలభద్రం పశ్చాత్తాపపడ్డాడు.

"వాళ్లు పెట్టే బాయిదాకి మితం కనబడడంలేదు. పిల్ల బతికినప్పటి మాట!" అంది భార్య.

"అల్లుడు తన పింతల్లిగారింటికి వెళతాడని సన్నిధిరావు రాసిన సంగతి ఉత్తమోసమని ఈ ఉత్తరంవల్ల బైటపడింది" అన్నాడు బలభద్రకం.

"వాళ్లు ఎంతకైనా తెగించిన మనుష్యులు! మన ఖర్మం ఇలాగు కాలిపోతుందనుకోలేదు!" అని మళ్లీ ఏడ్చి "ఒకమారు బయలుదేరివెళ్లి సొంతంగా సంగతులు తెలుసుకు వచ్చేవరకూ నా మనస్సులో మనస్సు ఉండదు" అంది బంగారమ్మ.

"నేను ఒక్కణ్ణే కాకుండా ఇద్దరం బయలుదేరివెళ్లి చూసివద్దాం" అన్నాడుభర్త.

"ఇద్దరంవచ్చి ఇంటిమీద పడ్డామని ఏడుస్తుందేమో వియ్యపురాలిముండ!" అంది బంగారమ్మ.

"ఏడవనీ, మృతవనీ, మొత్తుకోనీ! తప్పుతుందా ఏమిటి అవసరం వచ్చినపుడు అని "ఉత్తరం మొదట రాయకుండా వెళ్లడం పెద్దమనిషితరహా కాదు. కాబట్టి వియ్యంకుడికి 'ఇలాగు వస్తాము' అని ఒక లేఖ రాసి పడవేస్తాను. దానికి జవాబువస్తే సరి! లేకపోతే బయలుదేరి వెళ్లడం ఎలాగూ తప్పదు!" అన్నాడు బలభద్రం.

"అది జవాబు రాయనిస్తుందా, ఆ తుల సెమ్మముండ!" అంది బంగారమ్మ.

"రాయనియ్యకపోయినా మనం వెళ్లడం తప్పదుగా!" అన్నాడు భర్త.

"శోభనాచలంగారికి కూడా ఒకటి రాసి పడవెయ్యండి" అంది బంగారమ్మ.

"ఔను! ఔను! అదిమంచి ఆలోచనే."

'ఇలాగు ఇలాగు త్వరలో వస్తున్నాం. వచ్చినప్పుడుమిమ్మల్ని కలుసుకొంటాం. మీరు మాపిల్ల యోగక్షేమాలు తెలియబరచినందుకు అనేక వందనాలు' అంటూ ఒక లేఖ అతనికి కూడా రాసిపడవేస్తాను" అన్నాడు బలభద్రం.

ఆ మోస్తరుగానే అతను ఉత్తరాలు రాసిపోస్టులో పడవేశాడు.

స్నేహితుడి దగ్గరనుంచి వచ్చిన ఉత్తరం చూసుకొన్నాడు శోభనాచలం. "మీరు ఈ ఊరికి వచ్చినప్పుడు తప్పకుండామా

ఇంటి దగ్గిర రెండురోజులు ఉండి మా ఆతిథ్యాన్ని స్వీకరించి, మా ఉభయుల్నీ ఆనందింపజేయవలసింది" అంటూ జవాబు రాశాడు.

శోభనాచలం రాసిన ఉత్తరం అందగా బలభద్రమూ, బంగారమ్మా పొంగిపోయేరు.

బలభద్రం రాసిన లేఖ సన్నిధిరావుకి అందింది. రామామణిమినహాగా తక్కిన నలుగురూ సావిటిలో చేరి మంత్రాంగం జరిపారు.

"ఇక్కడ సంగతులన్నీ కొన్ని కొన్ని ఏనో మోస్తరుగా అవతలకి పాక్కుతున్నాయి" అంది తులసెమ్మ.

"ఈ లేఖమోస్తరే వేరుగా ఉంది. వెనకటి లేఖలలాగు లేదు. మనం అల్లుడు, కూతురూ ఊళ్లో ఉండరు అని రాసినా కూడా తాను ఇక్కడికి వస్తానని రాయడం చూస్తే నీవు చెప్పిన సంశయం బలపడుతూంది" అన్నాడు సన్నిధిరావు.

"కాని ఇంతకుముందు ఏ సంగతీ తెలిసినట్టుగా కనపడదు" అంది సింగమ్మ.

"ఇప్పటికైనా కొన్ని కొన్నే గాని అన్నీ తెలిసినట్టుగా లేదు" అన్నాడు చెన్నారావు.

"సరే! ఇవన్నీ ఎవరి ద్వారా తెలిసేయో మనకి అంతుపట్టడంలేదు!" అన్నాడు సన్నిధిరావు.

"ఏమో ఆ మధ్య శోభనాచలంగారి భార్య మన ఇంటికి ఒకమారు వచ్చి 'మీ కోడలు లేదా' అని అడిగింది. అప్పుడు నాకేమీ తోచపడలేదు. ఇందుకే నేమో మన ఇంటికి వచ్చింది!" అంది తులసెమ్మ.

"బహుశః! ఇందుకే అయుంటుంది" అంది సింగమ్మ.

"పోనీ ఎవరిద్వారా వెళ్లేయో కనిపెట్టేరా?" అన్నాడు సన్నిధిరావు.

"ఏమో నాకేమీ అంతుపట్టడంలేదు" అంది తులసెమ్మ.

"మనం తగినంత ఉషారుగా ఉండడం లేదన్న సంగతి రుజువయింది!" అంది సింగమ్మ.

"ఇహ ముందే నా కొస్త జాగ్రత్తగా ఉండండి!" అన్నాడు తండ్రి.

"సరే ఇప్పటి మాటేమిటి?" అన్నాడు కొడుకు.

"అదే నేను అనవచ్చేదీ!" అంది తల్లి.

"ఎలాగ జవాబు రాయాలి అని ప్రశ్న" అంది సింగమ్మ.

"ఎలాగ వాళ్లు రాకతప్పరు!" అన్నాడు సన్నిధిరావు చేతిని కదిలించి.

"వస్తే, ఇది ఊరుకుంటుందా! వాళ్లని ఇంట్లోకి రానిస్తే ఉన్న గుట్టుమట్టు వెల్లడిచేసి వాళ్లముందర ఏడవదూ! మన మర్యాద ఏం నిలబెడుతుందని!" అంది తల్లి.

"ఇహ అదంతా ఉత్తమాట!" అన్నాడు స్లీడరుసుమస్తా.

"అసలు ఇంటికి రాకుండా చేసేస్తే!" అంది సింగమ్మ.

"అమ్మాయి ఆలోచన బాగుంది" అని తల్లి మెచ్చుకొంది.

"బాగానే ఉంది! పులిని పట్టుకొని కోరలు, గోళ్లు లాగేస్తే మంచిది అన్న ఉపాయంలాగే ఉంది. వాళ్లని రాకుండా చెయ్యడ మెలాగు?" అని ప్రశ్నించాడు సన్నిధిరావు.

"మా ఇంటికి రావద్దని రాసేస్తే" అంది సింగమ్మ.

"అదే, ఎలాగు అని నే నడగడం?" అన్నాడు తండ్రి.

"ఏదో ఒక చిలిపి తగవు తెచ్చి, వచ్చిన వాళ్లని తోలివేస్తే" అంది సింగమ్మ.

"ఇంకా ఆ ఆలోచన బాగా ఉంది" అన్నాడు సన్నిధిరావు.

"పోనీ ఆ తగువు ఉత్తరంలోనే తెచ్చి మీరు మాకొంపకి రావద్దని రాసేస్తే!" అంది తులసెమ్మ..

"ఇది భేషైన ఆలోచన! ఇది వెండికి బంగారపు పూతపూసినట్లుంది." అన్నాడు సన్నిధిరావు.

"బృహస్పతిలాంటి ఆలోచన!" అన్నాడు కొడుకు.

"ఇహ నెందుకు! కొస్త అందించేరు కదా. తక్కినది నేనే చేసుకుపోతాను. 'మీరు పెళ్లిలోను, అటుతర్వాత మమ్మల్ని పెట్టిన ఇబ్బందులవల్ల, అమర్యాదలవల్ల, మీ రెప్పుడూ మా గుమ్మంతొక్క వద్దంటూ గట్టిగా రాసేస్తాను" అన్నాడు సన్నిధిరావు.

"మనం రాసినా కూడా వాళ్లు చొరవచేసి వస్తే ఏమి చేస్తారు?" అని ప్రశ్నించింది సింగమ్మ, బుర్ర నిలువుగా ఆడిస్తూ.

"ఇంటిలో మీ అల్లుడు, కూతురు లేరంటూ చెప్పి, తగువులాట పెట్టి పంపించివేద్దాం. రావద్దంటే వచ్చినందుకు ఎవరమూ పలకరించ నేవద్దు. పరాభవం జరిగిపోతుంది అదెంత పని అనీ!" అంది తులసెమ్మ.

పై ఆలోచనల ప్రకారమే బలభద్రానికి ఉత్తరం తయారుచేద్దామని సన్నిధిరావు లేచాడు. సింగమ్మ పెరటివైపు వెళ్లింది.

రామామణి ఇంటిగోడ కన్నంలోంచి పొరుగింటిపిల్లతో మాట్లాడుతుండగా చూసింది సింగమ్మ. తుర్రున ఇంటిలోకి వచ్చి అందరితోనూ చెప్పింది. అందరూ పెరటింలోకి వెళ్లారు. ఇంతటిలో రామా మణి వచ్చి నిలబడగా "అక్కడ ఏమి చేస్తున్నావు?" అని ప్రశ్నించింది అత్తగారు.

"అవతలనుంచి వాళ్లపిల్ల అందరూ కుశాగా సాగా ఉన్నారా?" అని అడిగింది. 'ఊఁ' అన్నాను. అంతే" అంది రామామణి.

"మాసేవుత్రా అబ్బాయీ!" అంది తల్లి.

"అదంతా ఈద్వారానే జరిగి ఉంటుంది" అని తండ్రి గుర్తుగా అన్నాడు.

"ఏమో చెప్పలేము!" అన్నాడు కొడుకు.

సందేహ మెందుకు?" అంది సింగమ్మ.

"ఇంత ఘనమైన కోడలు దొరికింది మనకు!" అంది తులసెమ్మ.

"అబ్బాయి శక్తి యుక్తులు ఇంతగా ఉన్నాయి!" అన్నాడు తండ్రి.

"వాడు వట్టి వాజమ్మ కాబట్టే దాని ఆటలు సాగుతున్నాయి!" అంది తల్లి.

చెన్నారావుకి పెళ్లాంమీద కోపం వచ్చింది. రెండు చరిచి కిందికి గెంటివేశాడు. రామామణి కిందికి పడిపోయి మొర్రోమంటూ ఉండగా, నోరు నొక్కి రెండు అణిచింది అత్తగారు. ఆడపడుచు బుగ్గలు చిదిమింది. నోటికి వచ్చినట్లు అందరూ తిట్టేరు.

గోడకన్నానికి రాళ్లు కూరాడు సన్నిధిరావు.

సన్నిధిరావు తమమీద నేరాలు మోపుతూ, మా ఇంటికి రావద్దంటూ రాసిన లేఖ బలభద్రానికి చేరింది. అతను చదువుకొన్నాడు. భార్యకి తెలియజేశాడు. ఇద్దరూ నిర్ఘాంతపోయి కూర్చున్నారు.

"పిల్లని మన కళ్లఎదట పెట్టదలచుకోలేదు వాళ్లు" అంది బంగారమ్మ విచారంతో.

'వ్యవహారం ఇంతవరకు ముదిరిపోతుందని కలలో నేనా అనుకోలేదు" అన్నాడు బలభద్రం.

"మన నుదుట రాసిన రాత ఇలాగుంది" అంది భార్య.

"తగవులాట, అల్లరికంటె దారికనబడడం లేదు" అని బలభద్రం విచారించాడు.

వారు ఉభయులు ఆలోచనచేసి రాజమహేంద్రవరానికి బయలుదేరి వెళ్లి, శోభనాచలంగారి ఇంటిలో మకాంచేసి, వ్యవహారం జరపదలుచుకొన్నారు.

బలభద్రం, బంగారమ్మ వచ్చి శోభనాచలంగారింటిలో మకాం చెయ్యగా శోభనాచలం [illegible] దంపం

లిద్దరూ వియ్యాలవారింటికి వెళ్ళారు. కాని అక్కడ ఆలనపాలన కనపడలేదు. 'మీ అల్లుడు, అమ్మాయి వాళ్ళ పింతల్లిగారింటికి వెళ్ళారు' అన్న మాట మట్టుకు ఇంటిలోంచి వినవచ్చింది. కాని అది ఉత్తమాట అని బలభద్రం భావించుకొన్నాడు.

ఒకరిద్దరి మధ్యవర్తులచేత బలభద్రం తన వియ్యాలవారికి కబురుచేశాడు. వారివల్ల 'మీ ఆస్తిఅంతా మీ అల్లుడిపేర రాస్తే మీ అల్లుడు ఎప్పటికేనా మీతో మాట్లాడతానని చెప్పాడు' అని కబురొకటి అదనంగా తెలియవచ్చింది. అది పట్టి అబద్ధం అని బలభద్రం తలచాడు.

పిమ్మట బలభద్రం సన్నిధిరావు ఇంటి పక్కనిఉన్న రామామణి స్నేహితురాలింటికి భార్యాసహితంగా వెళ్ళాడు. వాళ్ళు ఎంతో మర్యాద చేశారు.

బలభద్రం "ఇదివరకు మీ అమ్మాయి మా అమ్మాయికి చేసిన సాయానికి మేము ఉభయులం చాల సంతోషిస్తున్నాం. మా కృతజ్ఞతకి మేరలేదు" అంటూ తీసుకొని వెళ్ళిన నేమానులు ఆ అమ్మాయి తండ్రికి అందించాడు. ఆ అమ్మాయి తల్లితండ్రులు చాల సంతోషించారు.

తండ్రి "మాకూ, సన్నిధిరావు కుటుంబానికీ చాల ఏళ్ళుగా మాటలు లేవు. ఆ తులసెమ్మకి ఎవరితో సరిపడుతుంది. మేము వాళ్ళపొరుగన ఉండడమే వాళ్ళకి జగడానికి కారణం. ఎల్లో నారాయణమ్మలాగు ఉంటానంటుంది తులసెమ్మ. మీ అమ్మాయితో మా పిల్ల మాట్లాడుతూందని తెలిసి కాబోలు మాకూ వాళ్ళకీ మధ్య నున్న గోడ కన్నంలో రాళ్లు కుక్కేశారు. కాబట్టి మేము కొత్తగా చెయ్యగలిగిన సాయమేమీ ఉన్నట్లుగా కనబడదు" అని విచారించాడు.

"మీరు వెనక చేసిన సాయానికే మా కృతజ్ఞతలు!" దంపతు లిద్దరూ ఒకేమారు అన్నారు.

"ఏవిధంగానైనా మీ పిల్లని మీఇంటికి తీసుకు పొండి!" అన్నాడు ఇంటాయన.

"పిల్ల, అల్లుడు ఇంటిలో నేఉన్నారా?" అని అడిగాడు బలభద్రం.

"లేకేమి! రోజూ ఏవో మాటలు, కొట్లాట, తిట్లూ వినపడుతూనే ఉంటాయి!" అన్నాడు ఇంటి యజమాని.

"ఇంటిలో లేరని ఉత్తరం రాశాడు మా వియ్యంకుడు" అన్నాడు బలభద్రం.

"అవన్నీ ఉట్టిమాటలు! తులసెమ్మ ఏమి చెప్పితే మొగుడది చేస్తాడు. కాబట్టి మీరు ఆ మాటలు నమ్మకర్లు. మీ అల్లుడు ఇంటిలో ఉన్నమాటమట్టుకు నిజం" అన్నాడు. ఇంటాయన.

"ఎలాగయినా మా పిల్లని ఇవతలకి తీసుకువచ్చే మార్గం మీరే చూడాలి. మీకెంతే నాపుణ్యం ఉంటుంది" అని బలభద్రం అన్నాడు.

దంపతు లిద్దరు ఇంటిఅతన్ని కాళ్లు, కడుపు పట్టుకొని బతిమాలుకొన్నారు.

"అది ఎలాగు సాధ్యమవుతుంది అబ్బా!" అని ఇంటి అతను ఆలోచించాడు.

అతనికొడుకు ఒక ఉపాయం చెప్పాడు. "వాళ్ల ఇంటికి మన ఇంటికి మధ్యనున్న గోడపక్కనే ఒక జామిచెట్టు ఉందికదా. ఆచెట్టుకి ఒక పెద్ద గోనె పట్టా వెలాడ కడదాం. చెట్టుకి ఆన్చి ఒక నిచ్చెనవేసి, చెట్టుపంగాలు కొమ్మమీద నిల్చుని చూస్తే వాళ్ళ పెరట్లో జరిగే విచిత్రాలన్నీ చక్కగా కనబడతాయి."

ఈ ఉపాయం అందరికీ నచ్చింది. ఆ పనిని చెయ్యడం ఆ అబ్బాయికే విడిచిపెట్టారు. అతను ఆ మోస్తరుగానే గోనె పట్టా కట్టేడు. అతను చూస్తూండగా రామామణి పెరటిలోకివచ్చి, అంట్ల గిన్నెలు ముందు పడవేసుకొని తోముతూంది. అతను వేగిరం దిగివచ్చి, బలభద్రాన్ని త్వరగా రమ్మని సైగ చేసి నిచ్చెనసాయంతో చెట్టెక్కి చూడమనగా, అతను అలాగు చేశాడు. రామామణిపోల్చి లేకుండా చిక్కిపోయి, చింకిగుడ్డకట్టుకొని, అంట్లు పరపర తోముతూండగా బలభద్రం చూసి భరించలేక కిందికి దిగి ఏడ్చేడు. సంగతి తెలుసుకుని బంగారమ్మ వెక్కివెక్కి ఏడ్చింది.

ఇంటివారి అబ్బాయి మళ్లీ చెట్టెక్కి చూశాడు. కాని రామామణి పని ముగించుకొని ఇంటిలోకి వెళ్ళిపోయింది. అతను దిగి లోపలకి వచ్చివేశాడు.

"మీరు ఊళ్ళోకి వచ్చినట్టుగా మీ అమ్మాయికి తెలిసినట్టుగా లేదు" అన్నాడు ఇంటి యజమాని.

"అయుండవచ్చు" అన్నాడు బలభద్రం.

"ఈ విషయంలో మీ అమ్మాయే మాకు దారి చూపించాలి" అంది బంగారమ్మ.

"అది ఏలాగు సాధ్యమవుతుందో!" అన్నాడు ఇంటాయన.

"మొదట అమ్మాయికి చెట్టు ఎక్కడం నేర్పాలి" అన్నాడు అబ్బాయి.

"అదెంతపని తర్వాత?" అని అడిగేడు తండ్రి.

"ఉత్తరం ఒకటి రాసి రాతికి చుట్టబెట్టి అమ్మాయి చేతికి ఇచ్చి, రామామణికి విసరమని చెప్పాలి" అన్నాడు అబ్బాయి.

'ఈ ఆలోచన బాగుందంటే' బాగుం' దనుకొన్నారు.

ఆ ప్రకారమే అమ్మాయికి తరిఫీదు ఇవ్వదలచుకొన్నారు.

"ఆ తర్వాత చెయ్యవలసిన పనేమిటి?" అని అడిగాడు ఇంటాయన.

"మీరు ఉత్తరం రాసి ఇవ్వండి. ఆమోస్తరుగా పంపుదాం" అని అబ్బాయి బలభద్రాన్ని అడిగాడు.

"అది మంచి పని కాదు. మేము రాసిన ఉత్తరం మా వియ్యంకుడిచేతిలో పడితే ప్రమాదం. మేము వచ్చినట్లు, చేసినట్లు మీ అమ్మాయే ఉత్తరం రాసిపంపడం మంచిది. మీ అమ్మాయి పేరుఊరు లేకుండా రాసిన లేఖ ఒకవేళ ఇతరుల చేతులలో పడినా ప్రమాదంలేదు" అన్నాడు బలభద్రం.

"లేఖ ఒకళ్ల చేతులలోపడకుండా మేము తంటాలు పడతాం" అన్నాడు అబ్బాయి.

"మొదట మీరు రాసి సంగతులు కనుక్కోండి" అన్నారు బలభద్రం.

ఆరోజుకి బలభద్రం, అతని భార్య అక్కడినుండి వెళ్లలేక మకాంకి వెళ్లిపోయేరు.

మరునాటి పొద్దున్న ఇంటివారి అబ్బాయి ఒక లేఖ తయారుచేశాడు. అమ్మాయి చెట్టెక్కడం నేర్చుకొంది. ఆ అమ్మాయి చెట్టుమీదే కాచుకు కూర్చుని, రామామణి ఇవతలకి వచ్చిన వేళకి, రాతికి చుట్టబెట్టిన ఉత్తరం విసరగా రామమణి తన స్నేహితురాలిని చూసి, సంతోషించి, కిందనుండి ఉండని తీసి, ఉత్తరం విప్పి, గబగబా చదువుకొంది. మళ్లీ ఆ ఉత్తరం ఆ రాతికే చుట్టి విసిరి వేయవలసిందని ఆ లేఖలో ఉండడంచేత, ఆ అమ్మాయి అలాగే వెనక్కి విసిరి వేయగా, ఇంటివారి అమ్మాయి తీసుకొంది. రామామణి తన తలిదండ్రులు ఊళ్లోకి వచ్చేరని తెలుసుకొని సంతోషించి, వాళ్ళని చూడలేకపోయినందుకు ఏడుస్తూ ఇంటిలోకి వెళ్లిపోయింది.

మధ్యాహ్నము బలభద్రమూ, భార్యా స్నేహితురాలి' ఇంటికిరాగా, జరిగిన సంగతంతా వాళ్ళకి ఇంటిఆయన తెలియజేశాడు. వాళ్లు ఒకవైపు సంతోషిస్తూ, మరొకవైపు ఏడ్చారు. మళ్లీ కిందటిరోజులాగే బలభద్రం చెట్టెక్కి, పిల్లని చూసి, బ్రహ్మానందసముద్రంతోపాటు, దుఃఖసముద్రంలో కూడా మునిగిపోయాడు.

అందరూ సావిటిలో చేరి "దీని తర్వాతి ఎత్తు ఏమిటి?" అని ఆలోచించారు.

"పిల్ల ఎలాగో ఇవతలపడితే మా ఊరికి

మేఘాలమీద తీసుకు పోతాం" అన్నాడు బలభద్రం చిటికెలు వేస్తూ.

"సరే! ఆవిషయమై ఒక లేఖని తయారు చేద్దాం. మళ్లీ అదీ ఎప్పటిలాగే రాతికి చుట్టబెట్టి విసురుదాం" అన్నాడు అబ్బాయి.

"మీరు ఏదో వేళకి జట్కాబండీతో పెరటి గుమ్మందగ్గర సిద్ధంగా ఉండండి. ఆ అమ్మాయి తలుపు తీసుకొని ఇవతలకి వచ్చిన వెంటనే, జట్కాబండీమీద కూర్చోబెట్టుకొని తీసుకుపోయి, తర్వాత సంగతి తర్వాత ఆలోచించండి" అన్నాడు ఇంటాయన.

'ఈ ఆలోచన బాగుందంటే బాగుం'దని అందరూ ఆమోదించారు. దాని విషయమై ఒక లేఖ అబ్బాయి తయారు చేసి, అందరికి వినిపించగా, బాగుందని మెచ్చుకొన్నారు. ఆ ఇంటివారు తనకి ఇన్ని విధాలుగా సహాయపడుతూంటేగా తన కృతజ్ఞత ఏమోస్తరుగా చూపించాలో తోచక బలభద్రం అశ్రువులు రాల్చాడు.

ఆ మరునాడే జట్కాలో సామానులన్నీ పెట్టుకొని బండీవాడితో 'నీవు అడిగినంతా ఇస్తాము, బండీ మావశంలో ఉంచాలి' అన్నాడు బలభద్రం. వాడు ఒప్పుకొన్నాడు. ఆ బండీ రామామణి స్నేహితురాలి ఇంటి పెరటిగుమ్మానికి కొంచెం పక్కగా నిలబెట్టారు.

జామిచెట్టుమీదికి ఎక్కి, తెరవనక నుంచి కనిపెట్టుకొని చూస్తూంది రామామణి స్నేహితురాలు. రామామణి పెరటిలోకి వచ్చి, అంట్లు అన్నీ ఇవతల పడవేసి, ఊరికే జామిచెట్టు వైపు చూసింది. చెట్టుమీది స్నేహితురాలు ఉత్తరం విసిరింది. ఆ అమ్మాయి అది తీసి గబగబ చదువుకొంది. ఇది నిజమో అబద్ధమో తెలుసుకోడానికి పెరటి తలుపుతీసి బయటికి వచ్చింది. ఇంతటిలో సంగతులు తెలుసుకొని, బలభద్రం బంగారమ్మ, పెరటి తలుపు తీసుకొని వీధిలోకి వెళ్లారు. ఒకళ్లనొకళ్లు చూసుకొని మొహాలకి గుడ్డలు అడ్డు వేసుకొని, దుఃఖిస్తూండగా, 'ఇది ఏడ్పులకి సమయం కాదు' అని బలభద్రం, రామామణిని జట్కాబండిలోకి ఎక్కించాడు. తెరలు దింపివేశారు. అందరూ కలిసి పడవల రేవు చేరుకొని, అప్పుడే బయలుదేరుతూన్న రాధారీపడవ నందుకొన్నారు.

రామామణి వికృతవేషం చూసి భరించలేకపోయేరు. ఏబ్రాసిగుడ్డ విప్పించి ఏటిలో పారవేయించారు. మంచిచీర రవిక ధరింపజేశారు. తల్లితలదువ్వి జడవేసి, మొహం కడిగి బొట్టుకాటుక పెట్టింది. అప్పుడు కాని ఆమెతో మాట్లాడలేకపోయేరు.

రామామణి ఇంటిలోనే ఏదో పనిచేసుకొంటూందని ఇంటిలోవాళ్లు తలచారు. కాని బొత్తిగా జాడ కనబడకపోగా తులసెమ్మ కోడలిని పిలిచింది. కాని ఎక్కడా ఉలుకు పలుకు లేదు. అందరూ ఇంటిలో చూశారు, పెరటిలో చూశారు, నుయ్యి చూశారు. పెరటి తలుపుతీసి ఉండడం చూసి 'వీధిలోకి ఎక్కడికి వెళ్లింది చెప్మా!' అనుకొంటూ వెతికారు. ఎక్కడా కనబడలేదు! శోభనాచలంగారి ఇంటికి ఒక అతను వెళ్లి "బలభద్రంగారు ఉన్నారా?" అని అడగగా, వాళ్లు 'మా ఇంటిలో ఎవ్వరూ లేరు' అని సమాధానం చెప్పారు. చివరికి రామామణి వాళ్ల పుట్టింటికి పారిపోయి ఉంటుందని ఊహించుకొని, ఆ సంగతి ధ్రువపరుచుకోవడానికి మనిషిని ఒకణ్ణి రాజోలు పంపదలచుకొన్నారు.

ఆ మర్నాడు చెన్నారావు స్నేహితుణ్ణి ఒకణ్ణి 'సంగతులు తెలుసుకొని రావలసింది' అంటూ రాజోలు పంపించాడు. అతను వెళ్లి కనుక్కొని, తిరిగివచ్చి'

"మీకోడలు రాజోలులో ఖులాసాగా ఉంది" అని చెప్పగా "ఎలాగ చేరిందో!" అని అందరూ ఆశ్చర్యపోయారు.

తన ప్లీడరుద్వారానే సన్నిధిరావు 'ఇలాగు ఇలాగు మాకోడలిని పుట్టింటివారు బలవంతంచేసి తీసుకుపోయేరు; కాబట్టి తిరిగి మాకు అమ్మాయిని అప్పజెప్పవలసింది' అని కోర్టులో వ్యాజ్యం వేశాడు.

కోర్టువారివద్దనుంచి వచ్చిన సమ్మన్లు బలభద్రం అందుకొన్నాడు. కథ మరొకదారి పట్టినందుకు విచారించాడు. విషయమంతా భార్య తెలుసుకొంది. ఆమె "ఇప్పుడు విచారించవలసినపని ఎంతమాత్రం లేదు. సంబంధం మొదట తెచ్చుకొన్నప్పుడే విచారించి ఉండవలసింది. ఒకదాని ఫలితమే మరొకటి. నలుగురి నోళ్లలో నానడే పడ్డాం. ఇప్పుడు వెనక్కి తగ్గితే వచ్చే లాభం లేకపోగా నష్టం ఉండవచ్చు" అని సలహా చెప్పింది.

"భగవంతుడు కల్పిస్తూన్న పాట్లకి విచారిస్తున్నాను" అన్నాడు బలభద్రం.

"మనం చేసుకొన్న ఖర్మం ఇలాగుండగా భగవంతు డేమి చేస్తాడు!" అంది భార్య.

తమవైపు వకీలుగా శోభనాచలాన్ని ఏర్పాటు చేశారు. కేసు విచారణ అయ్యే రోజుకి బలభద్రం అతని కుటుంబం రాజమహేంద్రవరం చేరుకొన్నారు. కోర్టులో ప్లీడర్లు బల్లగుద్ది వాదించారు. వియ్యంకులు తిట్టుకొన్నారు. కాగితాలు, ఉత్తరాలు దాఖలు చేశారు. కాని బలభద్రం చెప్పినవి ఏవీ రుజువు కాలేదు. అందుచేత జడ్జిగారు రామామణిని ఆమె అత్తవారింటికి అప్పగించవలసిందని అంటూ తీర్పు చెప్పాడు.

రామామణితల్లిదండ్రులు విచారంతో కుంగిపోయారు. 'లోకంలో ధర్మమంటూ ఎక్కడా లేదు' అన్నాడు బలభద్రం. 'ఇది కలికాలం, ధర్మం ఒక్కపాదం మీదే నడుస్తూందట!' అంది బంగారమ్మ. విధిలేక కోర్టువారి తీర్పుప్రకారం రామామణిని అత్తవారివశం చేశారు.

కథ మళ్ళీ ఎప్పటిలాగే తయారయింది. 'పిల్ల బతికే ఎత్తు కనబడదు!' అని బలభద్రం, బంగారమ్మ చాలా దుఃఖించారు. 'అన్యాయానికే గాని న్యాయానికి దారిలే'దంటూ బలభద్రం విచారించి, ఎప్పటి ఆటే ఆడదలుచుకొన్నాడు.

రామామణిని అత్తవారు మునపటి కంటె ఎక్కువగా కొట్టి తిట్టి హింసిస్తున్నారు. ఖాయిదా అధికం చేశారు.

మళ్ళీ మునపటిలాగే బలభద్రం భార్యతో కూడా శోభనాచలంగారి ఇంటిలో బస చేసేడు. రహస్యంగా రామామణి స్నేహితురాలి కుటుంబంతో ఆలోచనలు జరిపేరు. రహస్యంగా వెనకటి ఆటే మొదలు పెట్టారు.

రామామణితో సంప్రదింపులు రహస్యంగా జరిపేరు. బలభద్రం డబ్బుకి వెనక్కి తియ్యలేదు. అంతా వెనకటి ఆటే ఆడి రామామణిని తిరిగి తమ ఊరికి తీసుకుపోయేరు.

'ఎన్ని విధాలు కనిపెట్టినా, లాభం లేకపోయింద'ని తులసెమ్మ కుటుంబం విచారించింది. 'ప్రతిమాటు కోర్టుకి ఎక్కడ ఎక్కుతాం,' డబ్బెక్కడ పోస్తాం? తతిమా పనులు పాడుచేసుకొని కోర్టువెంట ఎక్కడ తిరుగుతాం! పైగా ఇష్టంలేని కాపరం చేసేమి, మానేమి. ఎందుకు వచ్చిన రొష్టు ఇది మనకి? అని ఆ విషయం తలపెట్టడం మానివేశారు.

కుమారుడికి మరొక సంబంధం చూసింది తులసెమ్మ. మంచిరోజు చూసి ముడిపెట్టారు.

సమాప్తం

సినిమా:

విమర్శకుల దృష్టిలో సినిమాచిత్రాలు

★

చిత్రనిర్మాణంలో విమర్శకు ఎటువంటి స్థానం ఉండేదీ ఇంతవరకు నిర్ణయం కాలేదు. "విమర్శకులకోసం చిత్రాలు తీయవలసివస్తే దుకాణం కట్టిపెట్టవచ్చు" అని ప్రసిద్ధ కార్టూన్ చిత్ర నిర్మాత వాల్ట్ డిస్నీ అన్నాట్ట. ఈ దేశంలో మన చిత్ర నిర్మాతలూ అదే వైఖరిలో ఉన్నారనుకోవచ్చు. హాలీవుడ్ చిత్రనిర్మాతలు విమర్శకు తావివ్వకుండా చూస్తారని ఒక ప్రతీతి. మూకీల కాలంలో "హంచ్‌బాక్ ఆఫ్ నోటర్ డామ్" తయారుచేసిన చిత్ర నిర్మాతలు ఆ చిత్రంకోసం తయారుచేసిన సెటింగులలో పూర్తిగా కథా కాలంనాటి శిల్పం నిర్దుష్టంగా ప్రవేశపెట్టబడిందని చెప్పుకున్నారు. అటువంటి హాలీవుడ్ చిత్రనిర్మాతలే "ప్రొఫెషనల్ సోల్జర్" అనే చిత్రం తీస్తే, ఆ చిత్రంలో విక్టర్ మాక్లాగ్లెన్ ధరించిన సైనిక దుస్తులలో 17 తప్పులు కాబోలు ఉన్నట్టు విమర్శకులు నిరూపించారు!

జనబాహుళ్యం కోసం తీయబడే ఈ చిత్రాలను అచ్చగా పామరజనమే గాక వివేచనాశక్తిగలవాళ్లు కూడా చూడటంతో విమర్శన అనేది అంతో ఇంతో కలగటమూ, ఒక్కొక్కప్పుడు అది అచ్చులో ప్రవేశించటమూ కూడా జరుగుతున్నది. అయితే ఇట్లా వెలువడే విమర్శ సినిమా సాహిత్యం కింద ఉండిపోతున్నదేగాని చిత్రనిర్మాణంమీద ఈ విమర్శకు గల ప్రభావం దాదాపు ఏమీ లేదని చెప్పవచ్చు. పత్రికలలో వెలువడే విమర్శలైనా, చిత్రంలో తగినంత వినోదం లేదన్నంతవరకే చిత్రనిర్మాతలను బాధిస్తాయిగాని, కథ సరిగా లేదన్నా, పాత్రపోషణ లేదన్నా కూడా బాధించవు.

ఇతర కళలలో మభ్యపెట్టటాలు చాలా తక్కువ. పండితసభలో ఎవడన్నా లేని పాండిత్యం ప్రదర్శించబోయినట్లయితే పరాభవం చెందుతాడు. గానకచేరీలో గాయకుడు తనకు రానిరాగం పాడ సాహసించలేడు. కళలలో దక్షతా, ప్రావీణ్యమూ కంటె ప్రజారంజకత్వానికి ప్రాముఖ్యం హెచ్చినకొద్దీ కళాకారులు తమకు తెలియని విషయాలు తెలిసినట్లు నటించటం పరిపాటి అయిపోవటమే గాక ఒక్కొక్కప్పుడు అది తప్పని సరి అవుతుంది.

దీనికి అతి సామాన్యమైన ఉదాహరణ చిత్రాలలోని పాత్రలు జంత్రవాద్యాలు వాయించటం. అతి నవీనమైన సాంఘిక చిత్రంలో అయితే కథానాయిక పియానో వాయిస్తుంది, జానపద చిత్రాలలో అయితే వీణ వాయిస్తుంది. పియానో, వీణ వాద్యాలను గురించి తెలిసిన అభాగ్యుడు చిత్రం చూస్తూఉంటే నాయికాపాత్ర ధరించిన తారామణికి ఆ వాద్యం వాయించటం రాదనీ, తప్పు వాయిస్తున్నదనీ తెలిసిపోతుంది. ఈ తెలుసుకునే పెద్దమనిషి గానకళే ప్రాణకళ అయినవాడైతే చాలా నొచ్చుకుంటాడు, అందరితోనూ చెబుతాడు, చిత్రనిర్మాతలనూ, దర్శకులనూ, పాత్రధారులనూ తిట్టేస్తాడు కూడానూ. అతని విమర్శ ఎంత సక్రమమైనదైనప్పటికీ చిత్రం చూసేవారి ఆనందానికి భంగం కలిగించేది కాదు. తారామణి అందచందాలూ, నటనా మాత్రమే వారికి ముఖ్యం. ఆవిడకు వీణ వాయించటం చేతకాదన్నంతమాత్రాన వారికేమీ సంతాపం లేదు. ఆవిడ పెదవులు కదిలిస్తే నిజంగా పాడేది మరొకరని తెలిసినా వారు బాధపడరు. అంతే చిత్ర నిర్మాతలకుకూడా కావలసింది.

"నిపుణుల" విమర్శ ఏవిధంగా ఉంటుందో నిరూపించే లేఖ ఒకటి మా కార్యాలయానికి వచ్చింది. అది రాసినవారు జ్యోతిషంలో గట్టివారే అయిఉండవచ్చు. ఆయన చెప్పే విషయాలలోని సత్యాసత్యాలు "దైవజ్ఞులకు" వదలి ఆయన తెలిపే విషయాలనుమాత్రం ఇక్కడ చెప్పుకుందాం. ఈ లేఖను శ్రీ కె. పార్థనాథ శర్మ అనేవారు బళ్లారినుండి 16 ఏప్రిల్‌న రాశారు. ఆయన ఈ విధంగా అంటున్నారు:

("...పాతాళభైరవి"లో) పండితులు రాజకుమార్తె జాతకమును గురించి చెప్పుచు, 12 వ ఇంటిలో నీచలో రవి, 8 వ ఇంటలో ఇంద్రుడు, ఉన్నట్టు ఉచ్చారించిరి. రవికి నీచరాశి, తుల. ఈ రాశి 12 వ ఇల్లు కావలయునన్న రాజకుమార్తె లగ్నము వృశ్చికరాశి అయిఉండవలయును. 7 ఇంట నుంచి 8 వ యిల్లు మిథునమవును. మిథు(న)ములో ఇంద్రుడు 1900 సంవత్సరము, అంతకు కొంచెము ముందుగను ఉన్నట్లు పంచాంగమునుండి తెలియును.

"ఈ కథ ప్రారంభము రాజకుమార్తెకు సుమారు 18 సంవత్సరములు ఉండునప్పుడు చేసిఉండురు. అనగా ఇంచుమించుగా 1914 – 18 సంవత్సరములలో. అప్పుడు, ఉజ్జ(యి)నీలో కథలో చూపిన పరిస్థితులన్నియు ఉండినవా? అప్పుడే మొదటి ప్రపంచయుద్ధము జరిగినది. మనదేశపు రాజులందరు బ్రిటిష్ చక్రవర్తిగారికి లోబడక తప్పియుండెదు. కథలో చూపబడిన వైభవములకు అది సమయమేనా!" అని ఈ విలేఖరి అడుగుతున్నారు. ఇప్పటికే విమర్శ జానపదచిత్రానికి, అందులో భూగర్భస్థ పాతాళభైరవికీ, మాంత్రికుడికీ చాలా ఎక్కువైపోయిందని మనం భావించవచ్చు. కాని ఇంకా ఉంది.

"...రాజకుమార్తె మొహము చూడగా వృశ్చికరాశి గుణము లేమియు కనపడవు. ఆమె నడవడిక కూడా ఏ మీనరాశియో లేక కటకరాశియో కావచ్చునని తోచుచున్నది. (!) రాజుగారి జ్యోతిషులు 2 వ ఇంటిలో శని ఉన్నాడనికూడ చెప్పిరి. అనగా ధనస్సులో. అట్లయిన, మిథునములో ఉండు ఇంద్రునితో ఈ శనికి సమసప్తక వేధ కల్గును. రాజకుమార్తె ఇందువలన అష్టదరిద్రురాలు కావలయును(!!!)"

ఇంతదాకా వచ్చినతరవాత ఇటువంటి విమర్శలను గురించి సినిమా ప్రేక్షకులూ, చిత్రనిర్మాతలూ ఏం చెయ్యాలన్న సమస్య ఏర్పడకతప్పదు. "కథా కల్పకులు ఇట్టి తప్పులు జాగ్రత్తగా గమనించిరేని, జ్యోతిషశాస్త్రమునకు గౌరవము గల్గును. ఇష్టములేదేని, ఆ శాస్త్రములోనికి ప్రవేశమే పెట్టగూడదని నా మనవి", అని లేఖకులు సలహా ఇస్తున్నారు.

ఈ విమర్శ సంపూర్ణంగా మనం ఆమోదించ నవసరంలేదు. మాట వరసకు ఇంద్రుడు మిథునరాశిలోకి 1900 కు పూర్వం ఎన్నిసార్లయినా వచ్చిఉండవచ్చు. అయినప్పటికీ ఈ విమర్శలో చూపిన అన్ని లోపాలనూ కొట్టివేయటానికి లేదు.

ఇటువంటి లోపాలు రాకుండా చూసుకోవటం అసాధ్యం కాదు. సాధ్యమైన

(26-వ పేజీ చూడుడు)

చిత్రసమీక్ష:

శ్రీ రాజరాజేశ్వరివారి

సౌదామిని

[తెలుగు జానపద చిత్రం]

మాటలు, పాటలు: సముద్రాల
సంగీతం: ఎస్. వి. వెంకట్రామన్
నాట్యం: అనిల్‌కుమార్ చోప్రా
ఆర్టు: కే. ఆర్. శర్మ
ప్రొడక్షన్, డైరెక్షన్: కే. బి. నాగభూషణం
స్టూడియో: జెమిని
నటులు: కన్నాంబ, సి. యస్. ఆర్., రజిని, ఎస్. వరలక్ష్మి, నాగేశ్వరరావు, రేలంగి, కనకం, ఏ. వి. సుబ్బారావు, సూరిబాబు, ప్రభాకర్, దొరస్వామి, వగైరా.

ఆంధ్రప్రదేశంలో చాలాచోట్ల రెండో వారం నడుస్తున్న "సౌదామిని" జానపద చిత్రం గత 19 తేదీన మద్రాసు పత్రికలవారికి జెమినీస్టూడియోలో చూపబడింది. సాధారణంగా జానపదచిత్రాల కుంటూన్న హంగులన్నీ ఈ చిత్రంలోనూ ఉన్నాయి—తన రాణిని వెళ్లగొట్టి వేశ్యాలోలుడై, వేశ్యకు సర్వాధికారాలు ఇచ్చి ఆ పాపానికి తగిన ప్రాయశ్చిత్తంపొందే రాజూ, అష్టకష్టాలూ పడి అజ్ఞాతవాసంలో నుమిలే కథానాయికా, తల్లిదండ్రులకష్టాలు గట్టెక్కించడానికి పూనుకునే పుత్రరత్నమూ, తుఫానులూ, మాంత్రికులూ, మునీశ్వరులూ, కథానాయకుణ్ణి మోహించడానికి ఎదురుమానే రాజకుమారీ, స్వాప్నిక ప్రణయాలూ, ఒక గంధర్వస్త్రీ, ఖైదూ, కామిక్సూ ఇత్యాది. కాగా, ఈ చిత్రంలో ఒక సంచారవృక్షమూ, దేవమందారమూ అదనంగా ఉన్నాయి.

చాలా జానపదచిత్రాలకన్న "సౌదామిని"లో మెరుగైన విషయమేమంటే, దీని కథకూడా అనేక డొంక తిరుగుళ్లు తిరిగినా, కథకు నిరూపయోగ మనిపించే తిరుగుళ్లు చాలా తక్కువ. సాధ్యమైనంతవరకూ ప్రతి సన్నివేశాన్నీ కథకు ఉపయోగపరచుకున్నారు. అన్ని పాత్రలకూ వాటి వాటికితగ్గ పని కల్పించారు. వ్యర్థసంభాషణలుకూడా లేవు.



ప్రకాష్ ప్రొడక్షన్స్‌వారి "దీక్షలో" శ్రీమతి వరలక్ష్మి



"దీక్ష"లో

★ రామగోపాల్ ★

కథా కల్పనలో ప్రత్యేకంగా చెప్పుకో దగిన విషయంలేదు. సౌదామిని పాత్ర కొంతవరకు బాలనాగమ్మను పోలిఉన్నది. మరి కొంతవరకు సాంఘిక చిత్రాలలో కష్టాలుపడే ఇల్లాళ్లను పోలిఉన్నది. కథలో సౌదామినికికన్న విలాసవతి అనే నర్తకికీ, ఉదయసేనుణ్ణి ప్రేమించే రాజకుమార్తె హేమకూ ఎక్కువ ప్రాముఖ్యం ఉన్నది. ఉదయసేనుడి పాత్ర కూడా కొంతవరకు బాలనాగమ్మ కొడుకైన బాలవర్ధిరాజును పోలిఉన్నది. బాలవర్ధిరాజు తన తండ్రులను బతికించుకుని భార్యను చెరవిడిపిస్తే, ఉదయసేనుడు తన తండ్రి అంధత్వం పోగొట్టి, తన భార్యను చెరవిడిపించుకుంటాడు. పాతి వ్రత్యమహిమా, కొడుకుయొక్క మాతా పితృభక్తి ("మాతృదేవోభవ, పితృదేవోభవ" అని ఉదయసేనుడు చిన్నతనంలోనే తల్లి దగ్గర నేర్చాడు) ఈ చిత్రానికి ఆధార వస్తువులు, సంప్రదాయానికి భిన్నం లేకుండా దుష్టశిక్షణా, శిష్టరక్షణా చిత్రించబడింది. ఇందులో మనుష్య యత్నం ఒకపాలూ, దైవసంకల్పం ఒక పాలూగా ఉంచబడ్డాయి. (తుఫాను రాకపోతే సౌదామినీ, కుమారుడు కలగక పూర్వమే శిరచ్ఛేదం అయిఉండేది. దేవతలు అనుగ్రహించకపోతే ఉదయసేనుడు దేవమందారం తెచ్చి తండ్రికి దృష్టి ఇవ్వగలిగేవాడు కాడు.)

పాత్రధారులలో కన్నాంబా, సి. యస్ ఆర్., ప్రభాకర్, రజని, ఎస్. వరలక్ష్మి తమ పాత్రలను చాలా సమర్థతతో పోషించారు. ఇతరులు కూడా తమ పాత్రలను బాగానే నిర్వహించారు. రేలంగి, కనకం హాస్యంకోసమేకాక కథను నడిపించటానికి కూడా బాగా తోడ్పడ్డారు.

పాటలూ, మాటలూ కూడా సమయోచితంగానూ, సందర్భశుద్ధి గలిగీ ఉన్నాయి. గాని నాటక సంభాషణల ధోరణిలో ఉండటంచేత ఉండదగినంత సహజంగా లేవు. ప్రధానపాత్రలన్నీ కూడా నాటకంలో లాగే నటించాయి.

పాటలమట్లు కొన్ని పచ్చికర్నాటకంగానూ, మిగిలినవి హిందీచిత్రాలలోని పాటల అనుకరణాలుగానూ ఉన్నాయి. సంగీతదర్శకుడు పాటలన్నిటినీ ఒకే ధోరణిలో ఎందుకుంచలేదో తెలియదు. పాటలు కథకు ఎక్కడా అడ్డుతగులుతున్నట్టు ఉండకపోవటం సుగుణం. సూరిబాబు పాడిన పద్యం విన సొంపుగాఉన్నది గాని అనవసరం.

నృత్యాలు శాస్త్రోక్తంగా ఉన్నాయి. అవి ఎంతవరకు నిర్దుష్టంగా ఉన్నదీ నాట్యశాస్త్రం తెలిసినవారు మాత్రమే గ్రహించగలుగుతారు. మిగిలినవారికి అవి ఎంత ఆనందాన్ని చేకూర్చేదీ చెప్పటం కష్టం. సంప్రదాయానికి భిన్నంగాచేసిన నృత్యం (దేవకన్యది) చూడటానికి అంత రమణీయంగా లేదు.

తన తండ్రి వ్యాధిని ఎట్లా కుదర్చటమా అన్న చింతలో ఉండి హేమ కనిపించినా ప్రణయభావం కలగని స్థితిలో అతని మెదడులో మూసిఉన్న తలుపులు తెరిచినట్టు చూపించారు. ఇది "స్పెల్ బౌండ్" అనే హిచ్‌కాక్ చిత్రంలోనిదన్నమాట అటుంచి ఈ సందర్భంలో ఉచితంగా ఉన్నదా అనే ప్రశ్న, దీన్ని ప్రేక్షకుల్లో ఎందరు అర్థంచేసుకుంటారన్న ప్రశ్న కలుగుతాయి.

ఫొటోగ్రఫీ, శబ్దగ్రహణమూ, సెట్టింగులూ వగైరా హంగులు బాగానే ఉన్నాయి. కథలో తగినంత కొత్తదనం లేకపోవటమే ప్రధానమైన లోపం.

★

విమర్శకుల దృష్టిలో సినిమా చిత్రాలు

(23-వ పేజీ తరువాయి)

చోట వాటికి ఎడంగా ఉండటం కూడా అసాధ్యం కాదు. ఉదాహరణకు వీణ వాయించినట్టు నటించదలిచిన మనిషి తాను వాయించినట్టు నటించే పాటకు చెయ్యి ఎక్కడ పైకి కదపాలో, ఎక్కడ కిందికి కదపాలో, ఎక్కడ తీగెలను గబగబా మీటాలో అయినా తెలుసుకున్నందువల్ల బాధలేదు. ఇది సరిగా జరిగేటట్టు చూడటానికి పక్కన నిజంగా వీణవాయించే మనిషి ఉండనే ఉంటాడు గనక ఆయన సహాయాన్ని డైరెక్టరు పొందవచ్చు. అప్పటికీ తప్పులు వస్తే ఏదో ఇన్‌సర్షన్ వేసి ఆ భాగాలు కప్పవచ్చు.

జ్యోతిషం అంత సులువైనది కాదు. అటువంటప్పుడు అతిగా వివరాలకు పోకుండా ఉంటే మంచిది.

చిత్రాలు ఎంత పామరులకోసం తీసేవైనా విచక్షణాజ్ఞానంకల వాళ్లకు లోపాలు దొరికిపోవటం అంత మంచిదికాదు. కళ కల్పనఅయినప్పటికీ చాతగాని కల్పన కావలిసిన అవసరంలేదు; నటనేఅయినా చాతగాని నటన అనిపించుకోవలసిన అవసరం కూడా లేదు. చిత్ర నిర్మాతలు సాధ్యమైనంతవరకు "ప్రవీణులకు" దొరకకుండా చూసుకోవటం మంచిది. దొరికిపోయినప్పుడు వారి విమర్శలను పాటించటం కూడా మంచిది. "ప్రవీణులు" ఎన్నే లోపాలనుసరి చేసుకోవటంవల్ల చిత్రాలకు డబ్బువచ్చు రాకపోయినా ఖ్యాతి రావచ్చు.



పాతాళభైరవి చిత్రంలో మాంత్రికుడుగా అసమానచాతుర్యంతో నటించిన రంగారావు

★

విన్నారా?

* గత 30 ఏళ్ల కాలంలో ప్రపంచ జనాభా 1, 83, 40, 00, 000 నుండి 2, 37, 80, 00, 000 దాకా పెరిగినట్టున్నదని ఐక్యరాజ్య జనాభా నిపుణులు చెబుతున్నారు. ఈ లెక్క ప్రకారం ఒక శతాబ్దంలో ప్రపంచ జనాభా రెట్టింపుకావచ్చు.

* అస్సామ్ గవర్నరుగారి కుమార్తె కుమారి ప్రేమా జైరామ్‌దాస్ సరస్సులో చేపలకు మేత పెడుతూ ఉంగరం నీటిలో జారవిడిచింది. జాలర్లు సరస్సును గాలించి ఉంగరం పైకితీయ లేకపోయినారు. ఇంజనీర్లు వచ్చి సరస్సులోని జలాన్ని సమీపంలోఉన్న నదిలోకి తోడసాగారు. సరస్సు ఎండబెట్టడంవల్లకూడా ప్రయోజనం లేకపోతే సరస్సులోని చేపలన్నిటినీ ఎక్స్-రే యంత్రాలతో పరిశోధించడానికి ఏర్పాట్లు జరిగాయట.

* "మూడవ ప్రపంచయుద్ధం ఏ ఆయుధాలతో జరుగుతుందో చెప్పలేనుగాని నాలుగవ ప్రపంచయుద్ధం మటుకు కర్రలతో జరుగుతుంది," అని ఐన్‌స్టయిన్ పండితుడు అన్నాడు.

ఉద్యోగం పురుష లక్షణమ్

(11-వ పేజీ తరువాయి)

సరే నేను మిమ్మల్ని వదిలివుండలేను. నన్ను కూడామీతో తీసుకెళ్లండి." అని భర్తకళ్లల్లోకి సూటిగా చూసింది.

"అలాగంటే ఎలాగ శారదా! నామాట విను. ఒక్క అరవై రోజులు ఓపిక పట్టు. నా మాట నిలుపుకుంటానో లేదో చూడు." అని భార్య గడ్డం పట్టుకు లాలించాడు.

"సరే అయితే మీ మాట జవదాటడం నా కిష్టంలేదు. తప్పక అరవై ఒకటవ రోజు మీరు రావలశిందే. అలాగనక రాకపోతే నేను ఏ నుయ్యో గొయ్యో చూసుకొంటాను."

"నీ పుణ్యం వుంటుంది అటువంటి పని పెట్టుకు చెయ్యకు. ఒక రోజు అటూ ఇటూ ఐతే అవుతుంది."

"అదిగో అప్పుడే మొదలుపెట్టేరే. ఒక రోజల్లా ఒకవారం, వారం అల్లా నెలాఅలాగ మట్టుకు చేయకండి. సరి కాని, నా దొక్క చిన్నమనవి. మీగు కొదు పోదనడానికి వీలులేదు. నాకు మావాళ్లిచ్చిన మూడు పేటల గశియారపుగొలుసు ఇవాళ అమ్మేసి ఆ డబ్బు మీరు రైలుఖర్చులకు తీసుకెళ్లాలి." ఇంతవరకూ రైలుఖర్చులమాట గంగాధరం ఆలోచించనేలేదు. మాట జ్ఞాపకం చేసి తన వంటిమీద బంగారం ఇస్తానని భార్య అన్నందుకు ఆమె కుశాగ్రబుద్ధికి ఔదర్యానికి మనస్సులో ఎంతో మెచ్చుకున్నాడు. కొంచెంసేపు ఆలోచించి "బంగారం అమ్మడం సులభం. కాని, తిరిగి మళ్లా కొనడం చాలా కష్టం"

"ఆఁ పోనిద్దురూ మీరు వుద్యోగం చేస్తే నాకు కావలసినన్ని నగలు చేయిద్దురుగాని, అవసరానికి పనికిరాని వస్తువు వున్నా ఒకటే లేకపోయినా ఒకటే. నా మెళ్ళో ఇంకా నానుపేటలు, చంద్రహారాలు వున్నాయిగా మీరు మరొకమాట చెప్పవద్దు."

ఇక విధిలేక భార్యఇచ్చిన గొలుసు తీసుకుని రాజమండ్రీ ప్రయాణమైనాడు. అంతవరకూ తాను ఎక్కడికి వెళ్లడానికీ నిశ్చయించుకోలేదు. చుక్కాని లేని పడవలాగు తాను పడవలో కూర్చున్నాడు. రాజమండ్రి వచ్చిన తరువాత ఎక్కడికి వెళ్లను? అని ప్రశ్నించుకున్నాడు. చివరకు వర్తక కేంద్రమయిన బొంబాయి పట్నాని కెళ్లడానికి నిశ్చయించుకున్నాడు.

* * * *

బెజవాడ స్టేషనులో జనం కిటకిటలాడుతున్నారు. వివిధ ప్రాంతాలకు రైలుమార్గా లుండడంనుంచీ అన్ని రకాలమనుష్యులు కనపడుతారు. అందులో తెల్లవారుఝామున నాలుగుగంటలకు ఇటు నైజాము బండీ, కలకత్తాకు పోవు మెయిలు, అటు మెడ్రాసువెళ్ళే పాసింజరు, బందరుబండీ, మాచర్ల పోవు బండీ ఒక్కసారిగా బయలుదేరుతాయి. అందుచేత ఆ టయిములో స్టేషను మరీ కోలాహలంగా వుంటుంది. గంగాధరం బొంబాయి వెళ్లుటకు నైజాముబండీ ఎక్కేశాడు. రైలు కదులుటకు ఇంకా గంట ఆలస్య మున్నప్పటికీ కదలితే జాగా దొరకదనే భయంచేత మూడవతరగతి బండ్లలో కూర్చున్న వారెవరూ కదులుటకు సాహసించటం లేదు. రెండవతరగతి ప్రయాణీకులుమాత్రం 'ఎవరు మాకింక సాటి' అన్నట్లు బోరలు విరుచుకుని ప్లాట్ ఫారంమీద నడుస్తున్నారు. వ్యర్థంగా ఖర్చు పెట్టుకుంటే ఉద్యోగం దొరికేదాకా ఇబ్బందిపడతానని దూరదృష్టితో గంగాధరం మూడవ తరగతి టిక్కట్టు తీసుకున్నాడు. జనసమూహం ఎక్కువ అవడంనుంచీ రైల్లో చాలా వుడికి పోతోంది. ఇంతలో మెల్లిగా రైలు పూర్ణగర్భవతిలాగ కదిలింది. కొంచెం సేపటికి రైలు డోర్నకల్ స్టేషనులో ఆగింది. ఎక్కే జనం ఎక్కుతున్నారు. దిగే జనం దిగుతున్నారు. ఆ గుంపులో తప్పించుకుని ఒక వృద్ధ బ్రాహ్మడు గంగాధరం కూర్చున్న బండిలోకి ఎక్కి ఇతని ప్రక్కనే చోటుచేసుకుని కూర్చున్నాడు. రైలుచక్రాలలాగే గంగాధరం తలలో ఆలోచనలు పరుగెట్టుతున్నాయి. ఇంటిదగ్గర పరిస్థితు లెలాగ వున్నాయో తన భార్యను ఏమేమి బాధలు పెట్టుతున్నారో, తాను బొంబాయి కెళ్లి ఎచ్చట దిగాలో ఏమి చేయాలో ఏమీ తోచటంలేదు. భవిష్యత్కాలపరిస్థితు లగమ్యగోచరంగా వున్నాయి. ఏమీ పాలుపోవడంలేదు. ఆలోచనాప్రవాహంలో పడి కొట్టుకుంటూన్న గంగాధరానికి తన ప్రక్కనే కూర్చున్న ముసలిబ్రాహ్మడు ఈవిధంగా ప్రశ్నించడం వినిపించింది.

"ఏవూరు వెళ్లుతారు బాబూ?"

"బొంబాయి."

"ఏదన్నా పనిమీద వెళ్లుతున్నారా!

"పని ప్రయత్నంమీద వెళ్లుతున్నాను."

"అలాగా మీకు పెండ్లయిందా?"

"ఆఁ అయింది."

"తల్లీ దండ్రీ బాగున్నారా?"

"నిక్షేపంలా వున్నారు."

"అన్నదమ్ము లెంతమంది బాబూ?"

"ముగ్గురం వున్నాము."

"మీరు ఎన్నోవారు?"

"నేనే ఆఖరువాడిని."

"మీ రెక్కడినుంచి వస్తూన్నారు?"

ఏదో పరధ్యానంగా ఆలోచిస్తూ గంగాధరం "గుంటూరు"నుంచి అని జవాబు చెప్పేడు.

"మీరేం చదువుకున్నారు బాబూ?"

"బి. యే. పేసయినాను."

"అంత పెద్ద చదువు చదివికూడా మన దేశంలో ఉద్యోగం దొరకలేదా మీకు? దేశంకాని దేశం వెళ్లుతున్నారు?"

"ఆఁ ఏదోలెండి - దేశంకూడా చూచినట్లుంటుందని వెళ్లుతున్నాను."

"మన అత్తవారు స్థితిమంతులేనా?"

"ఆఁ నలభయి, ఏభయి యెకరాల భూస్వామి."

"అలాగా సంతోషం. మన యింటి పేరు?"

"రాచకొండవారు."

"నాన్నగారి పేరేమిటి?"

"వెంకప్ప అవధాన్లుగారు?"

"మీకు అప్పచెల్లెళ్ళు ఎంతమంది నాయనా?"

"లేరండీ"

"మీ స్వస్థలం గుంటూరేనా?

"కాదు."

"మరేవూరు?"

"అమలాపురం?"

"అయితే గుంటూ రెందుకెళ్ళేరు?

ఈ ముసలాయన అడిగే ప్రశ్నపరంపర కంతు కనబడటంలేదు. గంగాధరానికిచాలా విసుగెత్తింది. మరొక పక్కకు ముఖం తిప్పేసుకున్నాడు. తన ప్రశ్నకు జబాబు చెప్పలేదని ఆబ్రాహ్మడు తిరిగి "మీరు గుంటూరు ఎందు కెళ్ళేరో చెప్పేరు కారు." అని అడిగేడు.

గంగాధరం విసుగుతో "నాగ్రహచారం చేత" అని జబాబు చెప్పేడు. అది విని ఆ బ్రాహ్మణు సానుభూతి చూపించే స్వరంతో "అయ్యో ఏం నాయనా ఎవరికయినా సుస్తీచేసిందా? గుంటూరుఆస్పత్రిలో మందు పుచ్చుకొందుకు వెళ్లేరా? ఎవరికి సుస్తీచేసింది? నింపాదిగా వున్నారా? అపాయం ఏం జరుగలేదు కదా?" అని తిరిగి ప్రశ్నించాడు.

దానితో గంగాధరానికి మరింత వొళ్లుమండింది. ఇక అక్కడ కూర్చుంటే లాభం లేదనీ అవతల బల్లమీదకు వెళ్లి కూర్చున్నాడు. అంతటిలో ముసలాయన గంగా

ధరాన్ని వదలలేదు. తానుకూడా ఆ బల్లమీకిది వెళ్లికూర్చుని" అక్కడకన్నా ఇక్కడ విశాలంగా వుందని కూర్చున్నారా? నే నడిగిన ప్రశ్నలకు జబాబు చెప్పేరుకారు. ఇంక గంగాధరం కోపం పట్టలేకపోయాడు.

"ఇక్కడ విశాలంగా వుందని రాలేదు. మీబాధ తప్పించుకుందామని వచ్చేను. మీ ప్రశ్నపరంపర కంతు కనబడడంలేదు. రైలెక్కినదగ్గరనుంచీ నన్ను ఇలాగ చంపుతున్నారు. నాకు పెండ్లయితే మీ కెందుకు, నా కన్నదమ్ములు అక్కచెల్లెళ్లు ఎంతమయిందయితే మీ కెందుకు, మా అత్తవారి ఆస్తిపాస్తివిషయం మీ కెందుకు, ఒక్కలాగ నాకు డబ్బా రాస్తున్నారు. ఏదో యోగక్షేమానికి అంటే మీ రడిగిన మాటల్లో రెండుమూడు మాటలు చాలు నే! నేను అడగాలంటే మిమ్మల్ని లక్ష ప్రశ్నలు అడగ్గలను. మీ రేం చదువుకొన్నారు? వేదమా? శాస్త్రమా? వేదం చదివితే శాస్త్రం ఎందుకు చదవలేదు? శాస్త్రమయితే వేదం ఎందుకు చదవలేదు? మీకు పిల్లలెంతమంది? మనమలు, మునిమనమలు ఎంతమంది? వాళ్ల కాపరాలు? ఇవన్నీ అడిగితే లక్షయేభయివేల ప్రశ్నలడగ వచ్చును. ఎందుకీ చొప్పదంటు ప్రశ్నలు చెప్పండి. హాయిగా శ్రీరామజపం చేసుకోండి. నన్ను బాధపెట్టినట్టు ఇకమీద ఎవరినీ చంపుకుతినకండి."

ఇంతలో ఖాజీపేట స్టేషను వచ్చింది. భోజనానికని దిగిన గంగాధరం ఈసారి ఇంకో పెట్టిలోకి ఎక్కేడు.

* * *

బొంబాయిలో దిగిన గంగాధరం రైల్లో ప్రయాణీకుల సలహా అనుసరించి ఒక హోటల్లో బస చేసేడు. వారంరోజులపాటు వూరికే వూరంతా తిరిగేడు. ఒక వారం ప్రతీ ఆఫీసుకు వెళ్లి చూచేడు. ఇంకొకవారం ప్రతీ ఫ్యాక్టరీలోకీ వెళ్లి ఏమున్నా పనులున్నాయేమో అని కనుక్కున్నారు. ఎక్కడా ఉద్యోగం దొరికే సూచన కనబడడం లేదు. రైలుఖర్చులక్రింద భోజనం క్రింద తెచ్చుకున్న డబ్బులో సగందాకా ఖర్చయిపోయింది. ఒకనాడు అదేవిధంగా కొన్ని ఫ్యాక్టరీల్లో తిరిగి తిరిగి అలసిపోయి కొంచెం టీ తీసుకుందామని ఎదురుగా ఉన్న ఒక పెద్ద హోటలులోకి వెళ్ళేడు. ఎక్కడా సీట్లు కాళీ లేవు. ఒకమూల ఒక బల్లదగ్గర వున్న రెండు కుర్చీలలో ఒక కుర్చీ కాళీగా వున్నందున అక్కడి కెళ్లి కూర్చుని జేబురుమాలుతో మొగం తుడుచుకొని సర్వరుకి టీ, బిస్కట్లు తెమ్మని ఆర్డరిచ్చారు. ఎదురుగా కూర్చీలో కూర్చున్న వ్యక్తి తేరిపార చూచి "మీరు ఈ ప్రాంతంవారుకారని తోస్తూంది." అని ఇంగ్లీషులో అడిగేరు.

"అవునండీ నేను ఆంధ్రుణ్ని. మాది గోదావరిజిల్లా అమలాపురం."

"ఓ అలాగ చెప్పండి. నేను మిమ్మల్ని చూడగానే మీరు ఆంధ్రులని అనుకున్నాను. నేనుకూడా తెలుగువాడినే. మాది నైజాముస్టేటు తెలంగాణా వరంగల్ జిల్లా." మీ రిక్కడికి ఏంపనిమీద వచ్చారు.

"ఉద్యోగం ప్రయత్నంమీద వచ్చేను. ఇంకా ఎక్కడా ఏమీ దొరకలేదు."

'అలాగా' అని కొంచెంసేపు ఆలోచించి "మిస్టర్. నేను ఈవూరులో ప్రస్తుతం ఒక ఫిలిండైరెక్టు చేస్తూన్నాను. మాకు ఒక ఎక్ష్ట్రాకి ఒకరు కావలసివున్నది. మీ కిష్టమైతే మీరు మా కంపెనీలో చేరవచ్చును. జీతం ప్రస్తుతం నెలకు రెండువందల రూపాయ లిస్తాము. ఆతరువాత మీరు బాగా యాక్టుచేశారని మా ప్రొడ్యూసరుకు తోస్తే మీకు హీరోపార్టు ఇవ్వబడుతుంది. మీ 'ఫేస్‌కట్టు' చూస్తే మీరు సినిమాప్రపంచంలో బాగా వృద్ధి పొందగలరని నాకు తోస్తూంది. మీరు సమ్మతించినట్లయితే ఇప్పుడే నా కారులో మిమ్మల్ని మా సినీటోనుకు తీసుకువెళ్లుతాను." అని అన్నాడు.

"నేను ఆ పనికి పనికివస్తానని మీకు తోస్తే తప్పక వస్తూన్నాను. ఏ వుద్యోగం లేక అల్లాడుతున్న నాకు మీరు మహోపకారం చేసేరు."

"సాటివాడికి ఆ మాత్రం చెయ్యడం ఒక గొప్ప విషయమా? రండి ఇక వెళ్లుదాము" అని ఇద్దరూ లేచి సినిటోనుకు వెళ్లేరు.

తనకు వుద్యోగం దొరికినట్లు వెంటనే భార్యకు వ్రాసేడు. శారద భర్త ఎన్నడు వచ్చి తనను తీసుకు వెళ్లతాడా? అని చూస్తూంది. శారద మీద ఇంట్లో వాళ్లు ఇప్పుడంత ధుమధుమలు జేయడం లేదు.

ఒకనాడు మధ్యాహ్నం భోజనంచేసిన విస్తరాకులు వీధిలో పారేయుటకు వచ్చిన శారదకు ఒక కొత్తమోటారు తమ ఇంటివేపు రావడం కనిపించింది. ఆశ్చర్యంగా చూస్తూ నిలబడింది. తన భర్త వెళ్లి రెండు నెలలు కావస్తూంది. ఒకవేళ తన భర్త మోటారులో వస్తూన్నాడా అని ఒక చిన్న ఆశారేఖ తలలో తళుక్కుమంది. ఇంతలో తమ వాకిట్లోనే మోటా రాగింది. అందులోంచి గంగాధరం ఫుల్ యూరోపియన్ డ్రస్సుతో దిగేడు. శారద ఆనందానికి అంతు కనబడలేదు. కలా? నిజమా? అని తెల్లబోయి చూస్తూంటే 'రా శారదా లోపలికి వెళ్లుదామని' గంగాధరం అన్నాడు. ఊరిలో వున్న కుర్రసజ్జంతా క్షణంలో మోటారుని చుట్టేశారు. ఇద్దరూ కలసి లోపలికి వచ్చేరు. గంగాధరం కూడా తీసుకొచ్చిన నౌకరిద్దరూ సామాను లోపల పెట్టారు. గంగాధరాన్ని చూచి ఇంటిల్లపాదీ సంతోషం కనబరచేరు. వెంకప్పావుధాన్లు కొడుకుని చూసి మొదటలాగ మండిపడడం మానేసి తనకు నమస్కరించిన పుత్రుడుని మనఃపూర్తిగా ఆశీర్వదించాడు. అక్కడ వున్న నాలుగురోజులు అందర్నీ మోటారులో గంగాధరం తిప్పేడు. ప్రతీరోజూ వూరిలోవున్న జనం అందరూ గంగాధరాన్ని చూడడం కోసరం వచ్చేవారు. తన కొడుకు ప్రయోజకత్వాన్ని గురించి విధినిరామం లేకుండా అందరిదగ్గరా పొగిడి వెంకటప్పావుధాన్లు చెప్పేవాడు. సుబ్బమ్మ, రాజేశ్వరి, మట్టు మోటారుచూచి, నౌకర్లనిచూచి ఓర్వలేక ముక్కుమూతి తిప్పేవారు. ఇప్పుడెవ్వరేమనుకున్నా శారదకు లక్ష్యంలేదు.

తాను మొదట వూరంతా తిరిగినా ఎక్కడా వుద్యోగం దొరక్కపోవడం, ఒకనాడు ఫిలిండైరక్టరుతో హోటల్లో పరిచయం అవడం, వాళ్లకు సంతృప్తికరంగా తాను ఫిలింలో యాక్టు చేసినందున ఇంకొక ఫిలింలో హీరోగా తనను ఇరవై వేల రూపాయిలకు బుక్ చేయడం అడ్వాన్సుగా పదివేల రూపాయిలు తీసుకొన్నానని శారదతో మాత్రం గంగాధరం చెప్పేడు. పైవాళ్ళతో మాత్రం తాను ఏదో కంపెనీలో పని చేస్తూన్నాననీ నెలకు రెండువేలు జీతం అనీ వాళ్లే మోటారుకొనిచ్చారని చెప్పేడు.

"మీ శీలంమాత్రం జాగ్రత్తగా చూసుకోండేం" అని శారద హెచ్చరించింది. "పిచ్చిదానా నామీద నీకు నమ్మకం లేదా?" అని గంగాధరం జవాబిచ్చాడు.

అమలాపురంనుండి వెళ్లేనాడు. సామానులన్ని నౌకర్లు కట్టేశారు. తీరా మోటారు ఎక్కేముందు గంగాధరం చిన్నవదిన గారితో

మా యిల్లు మ్యూజియం నేను మృగాన్ని

(15-వ పేజీ తరువాయి)

వివిధపరిణామ విశ్వసర్వస్వమంతా ప్రత్యక్షమంటే చాలదూ? "ఈ వకారగుడులన్నీ వాస్తవంగా ఉద్ధరించదగినవే!"-అని మన ఊహ; మనలనే ఉద్ధరించడాని కవతరించిన అపరశక్తులమని వాళ్ళ ఊహ. ఉభయత్రా స్థిరపడిన యీ రైలుపట్టాలు కలుసుకునే దెప్పుడు?

నేను నా శక్తియుక్తులన్నీ ఉపయోగించి శరణాలయాధికారులతో శత పోరినాను. వాళ్ల చరిత్ర వ్రాస్తాననీ, 'వకారగుడి వైభవ' మనేపేరు పెడతాననీ, యేమేమో వాగినాను. నేనెవతెను అభిలషిస్తానో ఆమె నన్నంగీకరించదు; నన్ను కోరే నారీమణిమీద నాకు బుద్ధిపుట్టదు. ఈ విధంగా చూచిచూచి, తుదకు విసిగి, వెనుకకు మళ్లినాను.

తరువాత గుంటూరుగు శారదానికేతనం నడిపే పుణ్యదంపతులను జన్మపావనంగా దర్శించి, నా కథ చెప్పుకున్నాను.

"చిన్నవదినా నీవానాడు శారదతో, 'నవ్వలేకపోతే మోటారు కొనమను' అన్నావు. నీనోటివాక్యం ఫలించింది. నీకు నమస్కారం. పెద్దవదినా మీరీ మారు బొంబాయివస్తే మా శారద నౌకర్లు మీకు అన్నీ సిద్ధంగా అమరుస్తారు. తప్పకరండి. అని చెప్పి అందరికీ నమస్కారం చేశేను. ఇద్దరు వదినగార్లు ఏమీ జవాబు చెప్పలేక సిగ్గుతో తలలు వంచేసుకున్నారు. తల్లిదండ్రిమాత్రం అప్పుడప్పుడు క్షేమసమాచారం తెల్పుతూండండి అనిగద్గదికకంఠంతో అన్నారు. తల్లి కుమారుని వదలవలసి వచ్చిందని కంట నీరు పెట్టుకుంది. ఎంతయినా కన్నప్రాణం కదా! "ఉద్యోగం పురుషలక్షణం అనివాడు సుఖంగా ఉద్యోగంచేస్తూ కాపురం పెట్టుకుందుకు వెళ్లుతూంటే కంట నీరెందుకే వెర్రిదానా" అని వెంకటప్పావధాన్లు భార్యతో అన్నాడు. శారద అందరకూ నమస్కరించి మోటారెక్కి ముందు సీటులో కూర్చుంది. నౌకరు వచ్చి కారు తలుపు మూసేడు. డ్రైవరు సీటులో గంగాధరం కూర్చుని కారు స్టార్టు చేసేడు.

★

'ఎక్కడా గతిలేనివాళ్లకే యీ సంస్కార' మన్నట్టు వ్యంగ్యంగా వారభిప్రాయ సూచన చేసినారు.

తిరిగితిరిగి మద్రాసు చేరినాను. అక్కడ నా స్నేహితు డొకడు సంధిల్లినాడు. అతడన్నాడుగదా? "నీవు కులం వదలినావు; జాతి వదలినావు; మతం వదలినావు; ధర్మం వదలినావు; అభిమాన మెందుకు వదలవూ? నాకు తెలిసి, ఒకానొక ఊళ్ళో, ఒక అనాఘ్రాతపుష్పం ఉంది. నిన్ను చూస్తే తప్పక అంగీకరిస్తుంది. ఐతే, నీవు నడుము పుట్టియుంచగూడదు. ఆమె కళావంతుల తెగకు చేరింది. నీకు భూసురత్వం చెడుతుంది. ఒప్పుకుంటావా?"

ఆలోచించి ఆఖరుకు సరే నన్నాను. ఇద్దఱం ఆ రాత్రే రైలెక్కి తెల్లవారు జామున ఆ ఊళ్లో దిగినాము. ఇదీ ఒక విధమైన సంస్కారమే కదా? - అని సంతోషించినాను. అతడు చెప్పినట్టే అన్ని లక్షణాలూ సరిపోయినాయి. ఆదర్శ సంస్కర్తనైనాను. ఇంక వివాహం మాత్ర మెందుకూ? పనికిమాలిన మంత్రాలూ, ప్రాణసంకటాలైన ప్రమాణాలూ, ప్రాచీన సాంప్రదాయాలూ - అన్నిటికీ స్వస్తిచెప్పి అవంత స్వాతంత్ర్య మార్గాన్ని అవలంబించినాను. మన్మథుడే మా యిద్దఱనూ కూర్చినాడు. విద్యుద్దీపాల సువర్ణశోభలో అలౌకికమైన పద్మావతీప్రతిమ! - అన్నిటా పేరు సార్థకమయింది. కండ్లకు మిఱుమిట్లు గొలిపే ఆ రూపం చూచేకొద్దీ నాకొక విధమైన క్రొత్తరుచి పుట్టింది. ముందుకు వంగి ముద్దాడబోతుంటే, అంతర్వాణి ప్రబోధించింది. హఠాత్తుగా భీతి! - ఆందోళన! - జీవిత విప్లవం! - నేను తటాలున వెనుకకు తగ్గవలసి వచ్చింది.

"నీవు ద్రోహివి; దురాచారివి; నాస్తికుడవు; పరమపాషాణ పతితహృదయుడవు; నమ్మినందుకు నన్ను నాశనం చేస్తావా? జాగ్రత!"-అని పండ్లు పటపట కొఱుకుతూ ఉఱిమిచూచే ఉద్దండశక్తి నాముందు ప్రత్యక్షమయింది. ఆ వాణి వీనుల్లో విస్పష్టంగా మ్రోగింది. ఒక్కసారిగా కండ్లకూ చెవులకూ కలిగిన బీభత్సంవల్ల బిత్తరపోయినాను. తేలమొహం వేసి దిక్కులు చూచినాను. అంతటా, అదే విశ్వరూపదర్శనం- హఠాత్తుగా మూర్ఛపోయినాను.

స్మృతి కలిగేప్పటికి, నేను నిజమైన మృగాన్ని. కాకుంటే, చిత్రంగా నా చుట్టూ మూగి, జన మెందుకు గోలచేస్తారు? నెమలి పింఛపు విసనకఱ్ఱవలె నా ప్రక్కను నిలిచిఉన్న పద్మావతి గాభరా యెందుకు ప్రకటిస్తుంది? నే నెందుకో నిబ్బరపడినాను. ఆద్యంతాలు జ్ఞాపకం చేసుకుంటూ ఆ సుడిగుండంలోనుండి తప్పించుకోడానికి మార్గం వెదకినాను. తటాలున లేచి, తల వంచుకొని, వీధిలోనికి వెళ్లి, "మీ రంతా యెవరు? నేను మృగాన్ని దారి వదలండి!"- అని వెఱ్ఱిగా గర్జించినాను. కొందఱు భీతిపడినారు; కొందఱు నవ్వినారు; మఱికొందఱు, "వీ డెవడో పిచ్చివాడురా!"-అని గుసగుస లాడినారు.

★

విన్నారా?

* యుద్ధానంతరం అమెరికన్ యుద్ధనౌకలకు అమెరికన్ కాంగ్రెసు చాలా తక్కువ ధరలు నిర్ణయించి విక్రయించడంవల్ల జోసఫ్ కేసీ, అడ్మిరల్ హాల్సీ, ఎడ్వర్డ్ స్టెటినియస్‌లు లక్ష డాలర్ల పెట్టుబడితో 28 లక్షలు లాభం సంపాదించారు.

* ఫోర్ట్‌వర్త్, టెక్సస్, లెక్సింగ్టన్ రాష్ట్రాలలోని ఆస్పత్రులు నాలుగేళ్లక్రితం 26 మంది యువకులను, మాదద్రవ్యాలకు అలవాటుపడ్డవారిని చేర్చుకున్నాయి. ఇట్టి వారి సంఖ్య ఇప్పుడు 700కు పెరిగింది.

* బార్సిలోనా(స్పెయిన్)లో ఇటీవల జరిగిన సమ్మెలూ, ఫ్రాంకో వ్యతిరేక ప్రదర్శనాలూ చూసి పశ్చిమరాజ్యాల నౌకా, విమాన స్థావరంగా స్పెయినును వినియోగించేవిషయమై అమెరికను సైనికశాఖాధికారులు నిరుత్సాహం చెందుతున్నారు.

* నిరుద్యోగంతో బాధపడుతున్న ఒక జపానీవాడు, 50 వేల యెన్‌లు ఇచ్చిన వారికి యావజ్జీవ దాస్యం చేస్తాననీ, లేనిపక్షాన తన భార్యనూ, నలుగురు బిడ్డలనూ చంపి తానూ చస్తాననీ "యొమియూరి" అనే టోక్యో దినపత్రికలో ప్రకటన వేశాడు. ఆ పత్రిక ఈ ప్రకటనను ఉచితంగా వేసింది.

* 1945 ఆగస్టు 6 న హిరోషిమానగరం మీద మొదటి అణువుబాంబు పడ్డచోట 30 అడుగుల ఎత్తుగల స్తంభం కట్టి దానిపైన 90 పౌనుల బరువుగల "శాంతి గంట"ను హిరోషిమా పౌరులు - అణువుబాంబునుండి తప్పించుకున్నవారు - ఏర్పాటుచేశారు. ఇటీవల ఈ గంటను ఎవరో దొంగిలించారు. హిరోషిమా పురపాలకులు దొంగకు "శిక్ష లేదు," అని ప్రకటించారు.

కరివేపాకు మొక్క

(16-వ పేజీ తరువాయి)

'మంచి గొడవ తెచ్చి పెట్టారు-భోజనం చేసిన తర్వాత పొద్దాంలెండి—ఎప్పుడో వండిన వంట చల్లారిపోతూంది... అరటి కాయ వేపుడు చల్లారినట్లయితే మీరు మరి ముట్టుకోరుగా'

'ఫరవాలేదులే— అన్నట్లు మరో గంటకు వర్జ్యం. దుర్ముహూర్త ఘడియల్లో మొక్కను పాతటం యేమిటి—మొక్కను ముందు పాతితీరాలి... భోజనం యెక్కడికి పోతుంది. తర్వాత చెయ్యొచ్చులే'—

'మరి మీపట్టుదల—పట్టుదలే-- పట్టిన పట్టు విడిచేది లేదు— మాయదారి మొక్క! ఈ కుఱ్ఱతనం చేష్టలు చూస్తే... ప్రక్కవాళ్ళు యేమనుకొంటారు?—

'ఏమనుకొంటారు— దంపతులనుకొంటారు— కరివేపాకు మొక్క అంటే ప్రేమ అనుకొంటారు—ఎవరు యేమనుకొంటేయేం— మన క్కావలసింది మొక్క అభివృద్ధిగాని'—

'అబ్బ—మరి మీతో యింతే'— అంటూ దొడ్లోకి వెళ్లింది సరస్వతి. సరస్వతి వెనకాలనే వెళ్ళాడు రామచంద్రరావు. గరిటకాడతో గొయ్యితీశాడు; స్వయంగా... మన్నులో ఉన్న గులకరాళ్ళు, మసిబొగ్గులూ, వగైరాలన్నిటినీ యేరి బయట పారేశాడు—మొక్క వేళ్ళు విశాలంగా త్వరితంగా పాకడానికి వీలుగా ఉండేందుకై... ఒక్కడుగు లోతు గొయ్యి తీసి... అందులో ఏడెనిమిది అంగుళాల భాగం, తిరిగి మట్టితో కప్పేశాడు— భార్యచేత మొక్కను గోతిలో పెట్టించి కప్పించాడు — అచిరకాలంలో మొక్క అభివృద్ధి పొందాలని మనసులో భగవంతుణ్ణి ప్రార్థించుకొన్నాడు—సరస్వతి స్వహస్తాలతో మొక్కమీద ఒక చెంబుడు నీళ్ళుపోసింది: ఉత్సాహంతో చుట్టూ బోదె చేసి... యేవేవో కలలు కంటూ, చేతులూ, కాళ్ళూ కడుక్కొని భోజనానికి వెళ్ళాడు రామచంద్రరావు. స్వహస్తాలతో వేసిన మొక్కయెక్కడ యెండమూలకంగా ఎండిపోతుందో అని సరస్వతి ఒక పాత బియ్యపుబుట్ట — ఆమొక్కమీద మూత గూడా పెట్టింది!

రామచంద్రరావు — ఏజంటును కరివేపాకు మొక్క అడిగిన వేళావిశేష మనండి సరస్వతిచేతి చలవనండి, మరియేమనుకోండి, మొక్కమాత్రం, రోజూ బియ్యం కడిగిపోస్తున్న కుడితిసహాయంతో యేపుగా పెరగటం ప్రారంభించి— పొడుగ్గా— కొమ్మలతో తయారయింది. రామచంద్రరావుకు జోస్యంమీద నమ్మకం లేకపోయినా— మొక్క అభివృద్ధితో మరదలుపిల్ల చెప్పిన ఆనపకాయల జోస్యం అభిమానం మీద అభివృద్ధి పొందింది.

మొక్క అభివృద్ధితో సరస్వతికీ— రామచంద్రరావుకు మరికొంచెంపని పెరిగింది.:. ఇంట్లో యేపనీలేకుండా ఉన్నప్పుడు ఒకమారు మొక్కదగ్గర కెళ్ళటం, యేమిటో పిచ్చిగా చూడటం, దానిచుట్టు, వీథులో దూడ వేసిన పేడ తెచ్చి వెయ్యటం, నీళ్ళుపోయటం, మొక్క పొడవు కొల్చటం, ఎంత యెత్తు పెరుగుతుందో, ఎన్నికొమ్మలు వేస్తుందో ఊహించడం సరస్వతి కార్యక్రమమైంది.

ఆఫీసు లేని వేళల్లో మొక్కదగ్గరకు వెళ్ళటం, చుట్టూ ఉన్న పాతబోదిని చెడగొట్టి కొత్తబోదినిచేసి, నీటివాడకం హెచ్చుగా ఉండేవైపుకు బోదిని లాక్కొనివెళ్ళటం—చెట్టుకొమ్మలు, రెమ్మలు, లెక్కపెట్టడం— కోయకుండా వాసన చూడటం— రామచంద్రరావు పనియైంది.

ఆఫీసుకు వెళ్ళేముందు మొక్కను చూచి వెళ్ళేవాడు రామచంద్రరావు; ఆఫీసు నుంచి తిరిగి వచ్చేసరికి యేమాత్రం పెరిగిందో యేవిధమైన మార్పువచ్చిందో అని, సరాసరి— కాళ్ళయినా కడుక్కొనకుండా మొక్కను పరామర్శించి వచ్చేవాడు.

'సరసూ చూశావా?.... మన మొక్క అప్పుడే — రెండడుగుల యెత్తు పెరిగింది- అయిదారు కొమ్మలు పెట్టింది. ఏజంటుగారి చెట్లు అంత యేపుగా పెరగటంలేదట. భార్య చెయ్యి మంచిదేగాని బండ నేలట— అందువల్ల ఎన్ని నీళ్ళు పోసినా యింకదట— అందువల్ల సరిగా పెరగటంలేదన్నారాయన... మరచా...మొక్కను ఆలా కన్పించేలా ఉంచేకంటే, ఏమైనా బుట్ట అల్లించి దానిలో ఉంచేటట్లయితే బాగుంటుంది— ఎవళ్ళుచూసినా దిష్టి కొట్టూంటారు. ఏం యేమంటావ్?

ప్రథమంలో భర్తపనులు పిచ్చిగా కన్పించినా రానురాను—ఆమొక్కంటే ఆమెలో పిచ్చిప్రేమ పెంపొందింది— అత గాడికంటె చేదస్తం ఆమెలో హెచ్చిపోయింది. అందువల్ల అతడన్నదానికల్లా 'అవును. ఆలాగే కానియ్యండి— బాగుంటుందో' అనేదికాని ఒకదానికీ యెదిరించేది కాదు.

స్వశక్తితో కష్టపడి మొక్కనయితే పెంచుతున్నారుగాని— పలవలూ, చిలవలూ వేసి పొడుగవుతున్న మొక్కనుంచి— రెండు ఆకులు కోయటానికి యిరువుర్లోనే ఒక్కరూ యిష్టపడేవారు కాదు!

దొడ్లో మొక్క వేసినా— కానీ పెట్టి కరివేపాకు కొనటం—సరస్వతి మానేది కాదు— చెట్టుండగా—ఒకరొబ్బ కో[illegible] కోక— కానీ తగలేసి యెందుకు కొంటున్నావ్?' — రామచంద్రరావు గూడా కసురుకొనే వాడు కాదు; అతనికా విధంగా కోయటం యిష్టంలేదు కాబట్టి!

దొడ్లో చెట్టేసి పెంచటం యింటావిడకు యెంతో ఆనందాన్ని కల్గించింది. భార్యాభర్తలు— పిల్లలు లేనివారవటం వల్ల— మొక్కను పెంచుకొని—కన్నబిడ్డ విధంగా చూసుకొంటూన్నారనీ, ఆమె ఒకటి రెండు మార్లు యిరుగు పొరుగువాళ్ళతో కూడా అంది. ఆమాటలు విన్న సరస్వతి యేమీ తేల్చక మాట్లాడక వూరుకొంది; అయితే యింటావిడకు ఒకవిషయం మాత్రం కంటకంగా ఉండిపోయింది...ఆవిధంగా చెట్టు పెంచుతూన్నప్పుడు— ఒకర్తో యినా కోసుకొనకుండా యుండటం ఆ[illegible]కిష్టంలేక పోయింది— ఒకానొక పర్వదిన సమయంలో—మరి ఊరుకోలేక— 'కొంచెం...కరివేపాకు కోసి యియ్యండీ' అని సరస్వతిని అడిగిందావిడ.

సరస్వతి ఈ మాటకు జవాబు అప్పటికప్పుడే మరి తడుముకోకుండా జెప్పేసింది. 'చెట్టు ఆకు కొయ్యడానికి వీలులేదమ్మా.. ఎంత అవసరం వచ్చినా మేమయినా ముట్టుకొనటం లేదు. కానీ పారేస్తే... బోలెడాకు—అవసరం వస్తే నేనే— కొనుక్కొంటు న్నాను'—

ఇంటావిడకు యీమాట అనటంతోటే కోపం పుట్టుకువచ్చింది—తన దొడ్లో మొక్క వేసి పెంచుతున్నప్పుడు, తానడిగినప్పుడు యివ్వకపోవటంలోని కారణం కేవలం—తన్ను అవమానపర్చటమే అని ఆమె అర్థం చేసుకొంది—ఇంటి యజమానులుగా తాను అడిగి గౌరవం యిచ్చినప్పుడు—తన్నావిధంగా అగౌరవపర్చగూడదని ఆమె తలబోసింది. ఆమె గూడా అప్పటికప్పుడే జవాబిచ్చింది. 'పోనీ లేవమ్మా. ముష్టికరివేపాకు— కానీ పారేస్తే—బుట్టడు తెచ్చి పారేస్తాడు— ఈమాత్రం దానికోసం—సిగ్గు విడచి నోరు తెరచి లేదని—మొహమాటం చంపుకోనవసరం లేదులే ఎలాగయితే పెంచుతున్నారో మొక్కను'—

ఆమె అంతటితో ఊరుకొనకుండా, తన భర్తతోనూ, యిరుగు పొరుగు అమ్మలక్కలతోనూ.. యిష్టంవచ్చిన విధంగా చెప్పింది.. అంతా తలో మాటా అన్నారు.

కాని వారిలో యెవ్వరూ గూడా - కేవలం అది మొక్క మీద ఉండే ప్రేమచేతనే తప్ప - అవసరం అయినప్పుడు, సరస్వతి గూడా డబ్బు పెట్టి కొంటున్నదనీ ఊహించుకొనలేక పోయ్యారు.

ఈవిధంగా సంభాషణ జరిగిన సంగతి - సరస్వతి రామచంద్రరావుతో గూడా చెప్పింది. అతను విని 'మామంచి మాటన్నావు - కానీ పారేస్తే బోలెడు వచ్చి పడ్తున్నప్పుడు - ఆ కక్కుర్తి యెందుకు పడ్తారో కనుక్కొనలేకపోయ్యావూ? ఇక్కడ మొక్క పెంచుతున్నది.. వచ్చి కోరినవారందరికీ... ఆకు సంతర్పణ చేయటంకోసం కాదని యీసారి అడిగితే చెప్పు - అడిగిన వెంటనే యిస్తే మంచాళ్ళు. లేకపోతే చెడ్డాళ్ళు. చాలా బాగుంది' - అన్నాడు.

రామచంద్రరావు మాటలు విన్న యింటావిడ, మరి నోరు తెరచుకొని యేం అనలేకపోయింది గాని యిరుగు పొరుగు స్త్రీలతోమాత్రం - తనకు తోచిన విధంగా యిష్టమొచ్చినట్లుగా రామచంద్రరావును గురించీ, సరస్వతిని గురించీ చెప్పసాగింది. అదీ ఆమె చేసిన మహోఘనకార్యం!

రామచంద్రరావు, సరస్వతి మరి చెట్టు విషయంలో చాలా జాగర్తగా మసులుకోసాగారు.. మొక్కకు బుట్ట - చుట్టూ దరికి వెళ్లడానికి వీలులేకుండా ముళ్లకంచా యేర్పాటు చేయబడ్డాయ్.

ఇంటివాళ్లకు యిదంతా విడ్డూర్యంగానూ, విచిత్రంగానూ ఉండేది...

ఇరుగు పొరుగు వాళ్లుకూడా సరస్వతిని రెండు మూడు మార్లు... మంచితనంగా 'కొంచెం కరివేపాకు పెడ్తారా?' అని అడిగారు - ప్రత్యేకంగా ఒకరు బాలెంతరాలు కోసం... కొంచెం యివ్వవల్సిందని ప్రార్థించారు - ఎందరెన్ని విధాలుగా అడిగినా సరస్వతి ఒకేఒక విధంగా జవాబు యిచ్చేది. అదీ భార్యాభర్తలు యేకాభిప్రాయంమీద తయారు చేసుకొన్న జవాబే! అదేమంటే 'మీరు కొనదలమయితే బాగుంది. కాని యివ్వనందుకు మన్నించండి. దొడ్లో మొక్క ఉన్నా, దాని ఆకు కోయటం మాకే ఇష్టం - లేకపోవటంవల్ల - కొనుక్కొంటున్నాం. మీరంతగా బాధిస్తే బయట యెక్కడినుంచయినా...కొని తెచ్చి యిస్తాను' - అని..

'మీకు యివ్వటం యిష్టంలేనప్పుడు - మీ కెందుకమ్మ ఆ శ్రమ! - అంటూండేవారు వాళ్లు పైకి, లోలోపల తిట్టిపోసినా.

ఏది ఏవిధంగా జరిగిపోయినా, ఎవరే విధంగా తలబోసినా రామచంద్రరావుగాని, సరస్వతిగాని కష్టపడి—మొక్కను పెంచటంలో నిమగ్నులై పోయారేగాని—చివరకు—ఒక్క రొబ్బయినా కోయడానికి యిష్టపడేవారు కారు! కోసి ఒకరికిచ్చేవారు కాదు తాముపయోగించుకొనేవారు కాదు. సరస్వతి వేలి మహత్యం అనండి—మరేవిధంగా తలబోయండి" మొక్కమాత్రం నానాటికి అభివృద్ధి పొందుతూ పెరగసాగింది. మొక్క పెరుగుదల- రామచంద్రరావు, సరస్వతులలో ఆనందం కలిగిస్తూంటే—ఇరుగు పొరుగు వాళ్లలోనూ—చివరకు యింటివారిలోనూ ద్వేష భావాలు రగుల్కొలుసాగింది. అయితే కారణం లేకుండా కజ్జాకుమాత్రం రావటానికి వీలెక్కడుంది?

రామచంద్రరావు ఆ పట్టణం వచ్చిన వేళావిశేషమో యేమోగాని, మూడు సంవత్సరాల కాలం దొర్లిపోయిందిగాని— మరి బదలీమాత్రం అంతవరకూ రాలేదు... బదలీవిషయం — యోచనగాని - ప్రయత్నంగాని అంతవరకూ అతడు చేయలేదు- చేయ తలపెట్టలేదు—

ఒకరోజు సాయంకాలం వేళ—రామచంద్రరావు ఆఫీసునుంచి యేమిటో విచారంగా యింటికి వచ్చాడు. వచ్చి రావటంతోటే—మొక్కను ఒకమారు వెళ్లి చూసి రావటం అతని దినచర్యల్లో ఒకభాగం. కాని ఆనాడు మాత్రం ఆవిధంగా చెయ్యలేదు.

అతణ్ని చూడటంతోటే సరస్వతికి కొంచెం ఖంగారు... కలిగింది.

'ఏమండీ?'— అలా ఉన్నారని ప్రశ్నించింది ఆమె. రామచంద్రరావు జవాబు చెప్పలేక మౌనంగా ఊరుకొన్నాడు—ఏమిటో విషయం అని ఖంగారుపడుతూ — భర్తతో వచ్చిన బంట్రోతును ప్రశ్నించింది కారణాన్ని... వాడేమిటో డొంకతిరుగుడు కబుర్లు చెప్పి 'బ్యాంకు ఏజంటుగారి అమ్మాయి వివాహం యీవాళరాత్రి కదండి... కొంచెం కరివేపాకు దొడ్లోది కోసి యివ్వమన్నారండి - అయ్యగారితో చెప్పారండి... ఆకుకోసం వచ్చానండి. అంతకన్న విశేషం మరేం లేదండి' అన్నాడు— సరస్వతి కారణం ఊహించుకో కలిగింది. వెంటనే మరి ఆలోచించకుండా జవాబు చెప్పింది: 'ఏజంటు అవనీ మరి యెవరవనీ. దొడ్లో కరివేపాకు చెట్టునుంచి ఒక రొబ్బయినా కొయ్యడానికి వీల్లేదు. కావలసివస్తే కొనుక్కొనమను. డబ్బులు యిస్తాం' అని.

బంట్రోతు రెండాకులు యెక్కువ చదివినవాడు.. ఎక్కడ కబుర్లు అక్కడ చెప్పేవాడు. అందువల్ల మరి తడుముకోకుండా 'అవును. అది నిజమేనండి.. పావలాపారేస్తే బండెడాకిస్తారు—అన్నాడు.

రామచంద్రరావుకు గూడా ఒకయోచన తోచింది.. ఓపావలా పోతే పోయిరి...కరివేపాకు—కూరల మార్కెట్టులోది.. కొనుక్కొని వెళ్లి యిచ్చేస్తే! ఏజంటు ఎక్కడిది.. ఏమిటని ప్రశ్నించితే కద - ఈయోచనతో బంట్రోతుచేతిలో పావలా పెట్టి— ఆకు కొనుక్కొని వెళ్లవలసిందని-దొడ్లోదే యిచ్చారని చెప్పవలసిందని బంట్రోతుతో బతిమాలుతూ చెప్పాడు—రామచంద్రరావు.

'ఆ.. అలాగే' అంటూ నిష్క్రమించాడు బంట్రోతు. 'అమ్మయ్య'అని గుండెమీద చెయ్యివేసుకొన్నాడు రామచంద్రరావు—

'ప్రతీదానికే...మొక్క విషయం... మీ ఏజంటుతో చెప్పటం యెందుకు? అన్నిమార్లు మీరు చెప్పటంవల్ల ఆయన అడిగాడు. ప్రతీవాళ్లకూ...కరివేపాకుతో మంచి వేళాకోళమయిపోయింది. పేటంతా ఒకే రుసరుస. అన్నది సరస్వతి బాధ భరించలేక.

నిగనిగలాడుతూ... చెట్టు దినదినాభివృద్ధి పొందుతూ—అయిదారు అడుగుల యెత్తుపెరిగి.. గుబురుగా ఆకు వేసింది... వేస్తూంది. కాని యింతలో నెలాఖరవటం.. రామచంద్రరావుకు హటాత్తుగా బదిలీ అవటం జరిగింది.. ఆఫీసులో వాళ్లంతా.. ఏజంటు ఏదో కారణంచేత ట్రాన్స్ఫరు చేయించాడని అనుకొన్నారు.

ఏమయితేనేం—యిటు రామచంద్రరావుగాని అటు సరస్వతిగాని యిల్లు వదలి వెళ్ళేటప్పుడు—కరివేపాకుచెట్టు వదలి... వెళ్లడానికి మనస్కరించలేదు—మరి ఉద్యోగధర్మప్రకారం బయలుదేరుతూ—చెట్టు మీద ఉండే ప్రేమ వాత్సల్యాలచేత— మొదలంటా లాగి తీసుకొని వెళ్లటానికి సంసిద్ధులయ్యారు. కానయితే... వేళ్లు దిట్టంగా పాతుకొని ఉన్న మొక్క అవటంవల్ల, బలం కొద్దీ లాగేసరికి సగానికి విరిగి ఊరుకొంది...

రామచంద్రరావుకు—ఆ సగభాగంకూడా, అక్కడ వదలి వెళ్లటం యిష్టంలేకపోయింది.. మొదలంట త్రవ్వి—వేళ్లతోనున్న బోడి మొక్కను తీసుకొని...వెళ్లాడు మరియే ఉద్దేశాలో మనస్సులో పెట్టుకొని. ఈ సంఘటన చూచిన యింటావిడ తెల్లబోతూంటే- వీధివాళ్ళుమాత్రం— 'పిచ్చివాళ్ళు' అని నామకరణం చేశారు. ★

అదీ - ఇదీ

"అన్ అమెరికన్"

Lost Weekend, Fourteen Hours అనే చిత్రాల్లో నటించి బ్రిటిష్ ప్రేక్షకులకు బాగా పరిచితుడైన హోవర్డ్ డాసిల్వాను ప్రస్తుతం అమెరికన్ వ్యతిరేక చర్యల విచారణ సంఘంవారు విచారణ చేస్తున్నారు. ఇప్పుడు విచారింపబడుతున్న పలువురు నటులు, రచయితలు, ఇతరకళాకారుల్లో ఈయన ఒకడు. విచారణ సంఘం ఎదట ఈయన ఈ క్రింది ప్రకటన చేద్దామనుకున్నాడు.

"నేను 22 ఏళ్లనుంచీ నటుడుగా ఉంటున్నాను... అమెరికన్ ప్రజలతో నాకుగల సన్నిహిత సంబంధవల్లనే నాకు నటనా కౌశల్యం ఏర్పడింది.

ఈ సంబంధం బలంగా ఉన్నప్పుడు, ప్రజా సమస్యలను నేను పట్టించుకోకుండా ఉండలేను; వాటిపై నేను స్వంత అభిప్రాయాలు ఏర్పరుచుకోకుండా కూడా ఉండలేను. నా అభిప్రాయాలు ప్రజల్లో అధిక సంఖ్యాకుల అభిప్రాయాలతో అన్నివేళలా ఏకీభవించక పోవచ్చును. అయితే నేనుకూడా ఒక పౌరుణ్ణి; నా అభిప్రాయాలను నాకు తోచినప్పుడు, తోచినచోట వెల్లడించటం నావిధి; అంతేకాక నా అభిప్రాయాలను ఇంకెవరి బలవంతం లేకుండా ప్రకటించటం, వాటి నెవరన్నా మార్చుకోమని బెదిరిస్తే ఎదిరించటం కూడా నావిధి.

ఈరోజున నాకో అభిప్రాయం ఉన్నది. అమెరికన్ ప్రజల్లో అధిక సంఖ్యాకులు దాన్ని సమర్థిస్తున్నారు. ఆ అభిప్రాయం ఏమంటే, శాంతిని సాధించాలని; మరో యుద్ధాన్ని వారించాలని. నాకింకో అభిప్రాయం కూడా ఉన్నది. దీన్ని అధిక సంఖ్యాకులు ఒప్పుకోవటం లేదు. అది ఏమిటంటే, మన ప్రభుత్వం ఉన్నత స్థానాల్లో ఉన్న కొందరు శాంతినికాక యుద్ధాన్నే వాంఛిస్తున్నారని; ఈవాంఛను వ్యతిరేకించేవారిని, శాంతిని కోరేవారిని ద్రోహులుగా ఆ ఉన్నత వ్యక్తులు జమకడుతున్నారని. అలా జమకట్టే వారుండటంవల్లనే నేనీ విచారణసంఘం ఎదటకు తీసుకురాబడ్డాననుకుంటాను.

త్రికరణ శుద్ధిగా ఇదీ నా అభిప్రాయం. దీన్ని నేను మార్చుకోను. కొందరు నాకిలా సలహా ఇచ్చారు: "నీ పోర్షను నువ్వు బట్టీ పట్టి అప్పచెప్పు; నీజీవితం రాళ్లు నువ్వు తీసుకో; శుభ్రంగా కాలిఫోర్నియా పోయి సరదాగా గడుపు.'

కాని అలా గడపటం అనుకున్నంత తేలిక రాదు. ప్రపంచంలో ఏంజరిగినా అది నాకు జరగదనుకునేంత పసిపిల్లణ్ణి కాదు నేను. అటంబాంబులు పడితే నేను సరదాగా గడిపేచోటికి దూరంగా, నా సరదాను భంగం చెయ్యనంతటి దూరంలో పడతాయని నాకు నమ్మకం లేదు.

డా॥ ఐన్‌స్టీన్ అన్నమాటలు నేను మర్చిపోలేను: "తృతీయ ప్రపంచయుద్ధంలో ఏమేమి ఆయుధాలు ఉపయోగింపబడతాయో నాకు తెలియదు. కాని నాలుగో ప్రపంచయుద్ధం కర్రలతోనే జరుగుతుందని నాకు నిశ్చయంగా తెలుసు."

ఈ అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను. దాంతో ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు ఏకీభవించరు. వాళ్లకి వేరే అభిప్రాయం ఉన్నది. దానివార్తా ప్రతికలు ఒక పేరు పెట్టాయి: 'ఒత్తిడిచేసి ఒప్పించటం.' ఒక నమూనాని తయారుచేసి ప్రజల భావాలని ఆనమూనాలోకి సాగగొట్టటం; ఆనమూనాలోకి ఇరకని వాళ్లని ద్రోహులుగా జమకట్టటం.

ద్రోహులంటే కమ్యూనిస్టులేనని చెప్పే అర్థం అర్థవిహీనమైపోతున్నది. ఎందుకంటే అభ్యుదయ కాముకులందరూ పట్టేటంత ఎక్కువగా 'కమ్యూనిస్టు' అనే పదాన్ని విస్తృతం చేస్తున్నారు. అంతేగాక వాషింగ్టన్‌లో తయారైన నమూనాకు మనోవాక్కర్మలలో సరిపడని వారందరినీ కమ్యూనిస్టులుగా జమకడుతున్నారు......

అమెరికన్లమైన మనకి స్వంత ఆస్తి అనే దాన్లో నమ్మకం చాలా జాస్తి. మనకు ముఖ్యావసరాలైన వాటికంటే చాలా ఎక్కువ వస్తువులే స్వంత ఆస్తికిందకి వస్తాయి. మనగృహాలు మనకోటలు. మన భావాలు, మన ప్రవృత్తులుకూడా మన కోటలు. అవి మనవే. మరొకళ్ల ఒత్తిడితో అవసరం లేకుండా మనఇష్టమైతే మన మనస్సులను మార్చుకుంటాము; లేకపోతే మానివేస్తాం.

వాషింగ్టన్‌లోని ఉన్నత వ్యక్తులు కొంతవరకూ విజయంసాధించారు. ప్రజల్ని చాలమటుకు భయపెట్టగలిగారు. కాని వాళ్లనికూడా ఈభయం ఆవేశించింది. ప్రజల వాంఛలకి, ప్రభుత్వవైఖరులకి గల వైరభావాన్ని చూసి వారు భయపడిపోతున్నారు. ప్రజలు యుద్ధాన్ని కోరటం లేదు; ఒత్తిడిచేసి యుద్ధాన్ని కోరేట్టుగా చెయ్యటం అసంభవం.

నాపరిస్థితి కూడా ఇంతే. నా నటజీవితం నాకు ప్రేమ ప్రాత్రమైనది. కాని దానికి వచ్చిన తొందరేమీ లేదిప్పుడు. ద్రోహిగా పరిగణిస్తామన్నంతమాత్రాన నేను బెదిరిపోను. సంఘంలో నా మర్యాదని, గౌరవాన్ని మట్టిపాలు చేస్తామని బెదిరించినంతమాత్రాన లొంగిపోను. మన రాజ్యాంగాన్ని ధ్వంసంచేసేందుకు నేనెవ్వరికీ తోడ్పడను; అది నాకిచ్చే హక్కులను నేనెన్నటికి విసర్జించను.

నేను నటుణ్ణి. నాకున్నంత నటనాపుణ్యం కొందరికిలేదు; కాని చాలమందికి లేదు; కాని చాలామందికి ఇన్నంతనైపుణ్యం నాకులేదు. కాని ఈ విచారణ సంఘం సాగిస్తున్న దర్యాప్తుకు తోడ్పడగలిగినంత నైపుణ్యంగాని, సమాచారంగాని, అభూతకల్పనాశక్తిగాని నాకులేదు. గూఢచారిగా పనిచెయ్యాలనే కోరికగాని, నాస్నేహితుల్ని, అంతరాత్మనీ అమ్మి, నా వ్యక్తిత్వాన్ని ఛిద్రంచేసుకుని కుక్కకంటే కనాకష్టమైన బతుకుబతకాలని గాని నాకు లేదు.

ప్రజల వాంఛలకి, ప్రభుత్వ వైఖరులకి గల వైరుద్ధ్యాన్ని గుర్తుపట్టగలిగేటంత గాఢప్రేమ నాకీ దేశంపై ఉన్నది. అమెరికన్ ప్రజల వాంఛలే నావాంఛలు. ఆ ప్రజల వాంఛల్ని మన్నించే విధానాలని సమర్థిస్తాను; తృణీకరించే వాటిని తిరస్కరిస్తాను. ఇదీ నా పరిస్థితి; ఇదీ నా అభిప్రాయం."

అమెరికన్ వ్యతిరేక చర్యల విచారణ సంఘం ఈపై ప్రకటనను చెయ్యటానికి అనుమతి నిరాకరించింది. అంచేత దాన్ని ప్రకటించటానికి అమెరికాలో ఏ పత్రికా ఒప్పుకోలేదు.

(న్యూస్టేట్స్‌మన్ అండ్ నేషన్‌లో 'ఒక అమెరికన్' వ్రాసిన లేఖ-ఏప్రిల్ 7)

★

పెద్దపదవి

(18-వ పేజీ తరువాయి)

2

'ఒరే వెంకడూ యిలా రా!' అని రామస్వామి వెంకటేశంగారి బంట్రోతుని పిలిచాడు.

'చిత్తం బాబూ!' అంటూ వచ్చి నిలబడ్డాడు వెంకడు.

'బాబుగారు ఏర్రా!'

'కరణంగారి కాడికి పనుండి వెళ్లినారు బాబూ...'

'అవునుగాని మీ బాబుగోరు చాలా మంచివారిలా ఉన్నారు!'

'ఇంకా అన్నారు! సాలా మంచోరు బాబూ ఎంతమందికి యెన్నెన్ని యిచ్చినారో! బావుగోరు నిజంగా కల్పవృచ్ఛం [illegible]రంటే నమ్మండి బాబూ'

'అలాగా ఆయనకి మనం చేసినవన్నీ నచ్చినయో లేదో నీతో ఏమైనా అన్నారా! చెప్పు ఆయనంకేం కావాలో! ఆయనకేం అలవాట్లున్నాయో అలా చేద్దాం మరి మాకెలా తెలుస్తుంది!'

'యింకా నయ్యం బాబూ! ఎంత మాటనేసేరు మీ నాగ యింతవరకూ ఏడూ చేసుండనేదని పొద్దల్లా నాతో సెపుతూనే ఉంటేనే!'

'నిజంగానా వెంకడూ...'

'అవును బాబయ్యా నాయమ్మ మీదొట్టు!.... కాని... బాబయ్యా...'

'ఏఁ వింటిరా చెప్పు ఏమిటో!'

'ఏంనేదుగాని మీకూ తెలుసుంటాది- యీ కాడికే సాలా రోజులాయి యీలకి తిండి నిద్ర లేక అలసి పోయినారా! అందు కొళ్లంతా నొప్పులెట్టి పోతుండాదిట! అదలా వుంచండి బాబూ! రాత్రి సాగోరే ముందు కొంచెం సుక్కేసుకోడం అలవాటు అది నేక అదోలా వున్నారు!'

'అయితే ముందే చెప్పలేకపోయావురా! ఎంతపని చేశావు! పోనీలే యివాళ తెప్పిస్తానని చెప్పు! అంతేనా!'

'అంతేను బాబూ!... ఆఁ...అయితే బాబూ ఒక్కమాటడుగుతాను నిబద్దిగ సెపుతారా బాబూ!'

'ఏమిటి! చెప్పరా! అదేమిటలా అంటావు?'

'ఏం నేదు కాని బావూ మద్దేన్నం ఒడ్డించినారే ఆ యమ్మ ఎవరు బాబూ!'

'ఆఁ! అదేమిటి అలా అడిగేవు. అది నా భార్య! మరెవరూ కారు!'

'అమ్మబాబూ! ఎంత పని! అమ్మగోరేనా!'

'ఏం అలా అడిగావు!'

'అహఁ...యింతాక మాటోరసని బాబుగోరు అడగమంటే అడిగాను...అంతేను బాబూ.....'

'బాబుగారు అడగమన్నారా?'

'...............'

3

ఆఖర్ని తను అడిగినదానికి వెంకడు జబాబు యివ్వకపోవడంవల్ల రామస్వామి ఆలోచనలో పడ్డాడు. ప్రక్కనున్న కుర్చీలో చతికిలపడ్డాడు! నిజంగా వెంకటేశం యిలా అడిగించాడా! అంత పెద్ద మనిషి యిలా ప్రవర్తిస్తాడా! యిందాక తాంబూలం వేసుకొనేటప్పుడుకూడా లక్ష్మిని అదోలా చూసేడు. ఆ వాటం చూస్తే లక్ష్మిని చూస్తే యీయనకేదో పుట్టినట్టుంది! నిజంగా అలాగే కొంపదీసి దాని మీద మనసు పోలేదుకద! బుడ్డీ అలవాటుందని చల్లగా చెప్పించాడు. ఏమో యీ బుద్ధికూడా పుట్టిందేమో! యింతకు పూర్వం తను ఎంతమందికి సత్కరించినా యిలా ఎవ్వరూ అడగలేదు! అయినా ఒకరి భార్యని కావాలని అంత సులువుగా అడిగేయటానికి ఎంత గుండెధైర్యం కావాలి? ఎంత పెద్ద పదవిలో ఉన్నా యిదెంత సబబైన పని? ఎంత వీళ్ల వెనకాల తిరిగినా ఎంత పదవికోసం ప్రాకులాడినా భార్యని దానికోసం యిచ్చేస్తాడా? ఛీ! ఎంత నీచం! ఎంత పరువు తక్కువ పని!! యింత సులువుగా భయమైనా లేకండా ఎలా అడగగలిగాడా వెంకటేశం! ఛీఛీ వీడిని నమ్మకూడదు!...కాని...యీయనక్రింద ఖర్చు చేసిన ఇంత సొమ్ము వృథా అయిపోవలసిందేనా? అదీకాక ఆయన అంతలా తప్పకండా పదవి యిప్పిస్తానని చెప్పేడు? నిజమే. ఆయన తలచుకొంటే ఏదైనా చేయగలడు...కాని అసభ్యమైన కోరిక కోరేడే! యిదెలా అవుతుంది? ఒకవేళ ఒప్పుకొంటే! నిజమే, తనే ఒప్పుకుండే తప్పు ఏమిటి? భర్త ఒప్పుకున్నపుడు భార్య ఏ పనిచేసినా దోషంలేదు...ఒక్క రాత్రి! పెద్దపదవి!! ఆ తర్వాత ఎంత గౌరవం! ఎంత హాయి!! ఈ సంగతి మరో కంటివాడికెవడికీ తెలీదు - అంచేత పరవాలేదు! ఒక్కరాత్రి కళ్లు మూసుకుంటే - స్వర్గం! పెద్ద పదవి!! అదీకాక దీనివలన మరో కోర్కె కూడా నెరవేరుతుంది! అది తన భార్యకు మరీ సంతోషం కలుగజేస్తుంది! పిల్లలు లేరన్న కొరత తీరుతుంది!! యీ విధంగానే పిల్లలకోసం సూరి నాయుడు చేసిన పని జ్ఞాపకానికి వచ్చింది! తన అదృష్టం కూడా పండితే చక్కని కొడుకు పుడతాడేమో! యీ విధంగా ఆలోచిస్తే తప్పేం కనపడలేదు! అదీకాక తన ఆస్తి! ఎంత ఆస్తి!! పిల్లలు లేకపోతే ఏమౌతుంది! యీ విషయం రామస్వామిని భయపెట్టింది. నిజమే! తనకి పిల్లలు లేకపోతే నిష్కారణంగా ఇంత ఆస్తీ ఊరువాళ్ల పాలవుతుంది! ఇప్పుడు కాకపోతే ఎప్పుడయినా యిందుకోసం తను అధమం దత్తతయినా చేసుకోవాలి! దత్తతచేసుకొనేకన్న యీ విధమే బావుంది! తన పిల్లడు అని చెప్పుకొందికి వీలుంటుంది! తప్పదు! యీ విధం చాలా బావుంది! ఒక్క దెబ్బకి రెండు కోర్కెలూ నెరవేరుతై! సరే! ఒప్పుకుందాం! అని కుర్చీలోంచి లేచాడు!- కాని-మరో విషయం అతడిని యింతకన్నా ఎక్కువగా బాధించింది! ఇంతకీ తన భార్య ఒప్పుకోవద్దూ! ఆమె సంగతి తనకు బాగా తెలుసు. యీ విషయం చెబుతే తననే కాకండా వెంకటేశాన్ని కూడా వీధికీడ్చేస్తుంది! ప్రాణం వదలడానికైనా యిష్టపడుతుంది కాని యిందుకు ఒప్పుకోదు - ఇది నిజం. తను వెళ్లి నచ్చచెప్పడం అన్నది కలలో వార్త! అయితే ఎలా! ఆమె లేనిదే అసలు కాదు!

రామస్వామి సంధిగ్ధంలో పడిపోయి కొట్టుకుంటున్నాడు. తనకి బుర్ర ఏం పనిచేయడంలేదు. ఒళ్లంతా చమట్లుపోసినై. ఏలాగైనా సరే వెంకటేశం కోర్కెచెల్లించి తన రెండు కోర్కెలూ నెరవేర్చుకోడానికి రామస్వామి నిశ్చయించుకున్నాడు! అలా చెయ్యాలంటే రెండే రెండు పద్ధతులు— ఒకటి— తన భార్యని ఒప్పించాలి. యిది బ్రహ్మ విష్ణువులు దిగి చెప్పినా కుదరదు... అందుకని ఆ ఆలోచనే వదులుకున్నాడు- రెండోది రాత్రికి తనే వస్తానని చెప్పి ఆమె గదిలోనున్న తర్వాత వెంకటేశాన్ని పంపించాలి యిది బావుందనుకున్నాడు. కాని యిలాచేసిన లోపల జట్టే ఆడితే! ఆమె ఏం చేసినా ఒప్పించి, లోబరుచుకోవడం మీలోనే వుంటుందని చెప్పేయాలి' అనుకొన్నాడు. యీ ఆలోచన తనకి బాగా

వచ్చింది. పదవీవ్యామోహంలో పడిన రామస్వామికి యిది ఎంతో మంచి పనిగా తోచింది. కాని అదెంత నీచమైన పనో తెలుసుకోలేకపోయాడు! ఒక్క రాత్రి పూరుకొంటే పెద్ద పదవి వస్తుందనే భావించేడు. తన యీ కార్యం జరిపేటందుకు ప్రయత్నాలు చేయడానికి బయలుదేరాడు.

4

'లక్ష్మీ యివాళ ఎంత బావున్నావు!'

'పోదురూ! మీకు బాగు లేనిదాడు ఎప్పుడు? ఎన్ని రోజులు గడిచినా మీ బుద్ధి మారలేదు'

'అదిగో అలా అనే మరిపింతలు పెట్టేస్తున్నావు - ఇవాళ ఏమిటో అదోలా వున్నావు...యింకా చక్కని చీర నగలు అవీ పెట్టుకొంటే ఎంత బావుంటావో!'

'ఇంకా నయం! గౌనూ జోళ్ళూ తొడుక్కోమన్నారు కాదు దొరసానిలా!'

'నీ హాస్యానికేం కాని చెబుదూ'

'ఏమిటి -'

'అదే...బాగా ముస్తాబవాలి!'

'బావుంది సరి!'

'పోనీ వ్రతమేలే యివాళ తప్పదు!'

'రాను రాను మరీ చిన్నవాళ్లైపోతున్నారు!'

'యిదిగో నా మాట వినవుకదూ! ఎలా ఉండాలంటే అలా ఉండాలి చూసేవాళ్ళకి ఏ జగన్మోహినో అన్నట్టు......'

'చాలండీ! చాలు. యింక ఊరుకొంటే కృతిమించేట్టుంది! యివాళేం యీ సట్టించారు'

'ఏమీ లేదు! నా మాట వింటావా వినవా?'

'...........'

'అదీ. అలా ఉండాలి! - ఏదీ -'

'ఇస్. ఊరుకుందురూ -'

5

'ఒరే వెంకడూ రామస్వామిగారు వున్నారా!' అన్నాడు వెంకటేశం బంగ్లోతుతో -

'చిత్తం బాబూ, ఆయ నూరికెల్తానని సెప్పమన్నారు!'

'ఏవూర్రా! నాతో చెప్పలేదే. చెప్పకండా వెళ్లిపోయినాడా!'

'ఏమో బావూ. మరేం మొగమాటం పడ్డన్నారు'

ఏదో అరిజంటు పనుండి యెల్లినారు సీకటి పడకండానే పెందలి కాడే వస్తామన్నారు!'

'సరే యింట్లో మరె వరున్నట్టు!'

'అమ్మగోరున్నారు బావూ అంతే మరెవ్వరూ నేరు!'

'అమ్మగారు ఒక్కరే ఉన్నారా?'

'అవును బాబూ'

ఆ తరువాత వెంకటేశంగారు ఆలోచన్లో పడ్డారు. వెంకడిని తీసుకొని ఎటో వెళ్ళిపోయారు.

6

'ఆయనెవరో చూస్తే బావుండదు. మరీ చిన్నవాళ్లయి పోతారేం యీ ఒక్కనాడుకే...' అని లక్ష్మి తలుపు వేసిన చప్పుడు విని ఎవరు వచ్చేరో చూడకండానే అనేసింది.

"..............."

"యీ చీర బావుంది కదండీ...అని చూస్తూ ఆగిపోయింది! లేచి భయంతో మంచం వెనకాల నిలుచుంది!"

"మీ...రా...!"

'అవును— నేనే....ఏం...లక్ష్మీ—'

"ఆఁ! లక్ష్మి!!...ఎందుకండి?"

నవ్వుతూ వెంకటేశం కొంచం ముందుకి వచ్చేడు. లక్ష్మి కొంచం వెనక్కు జరిగింది.

'దేనికి చెప్పండి?" అని కొంచం గట్టిగా వణుకుతూ అంది.

'ఆఁ! దేనికా... దేనికీ లేదు!...' అంటూ లక్ష్మి పక్కకు వచ్చేడు...

లక్ష్మి దూరంగా పోయి

'అలా ఉండండి!... ఏమిటిదంతా అర్థం కాలేదు'

'అర్థం అవుతుందిలే చెబుతాను రెండు మాటలాడు!'

'ఏమిటి మాటలాడ్డం! ఆయనతో వెళ్లి మాటాడండి నాతో ఏముందీ!' అని గబగబా తలుపు తీసుకొని వెళ్లబోయింది కాని వెంకటేశం ఆమె చెయ్యిపట్టుకుని ఆపేశాడు. దీనితో ఆమెకు మరీ కోపం ఎక్కువయింది. యితనేదో అన్యాయం చెయ్యడానికి వచ్చేడని గ్రహించి చెయ్యి విదుల్చుకొని—

'ఏమండీ! మీ ఉద్దేశ్యం ఏమిటో అర్థం కాలేదు మర్యాదగా వెడతారా? ఆయన్ని పిలవమన్నారా?'

మర్యాద కేంలే! మీ ఆయన పిల్చినా పలుకరు...'

యీ మాట వినగానే లక్ష్మి కంపించిపోయింది.

"ఆఁ ఏమిటీ! మా ఆయన్ని ఏంచేశారు? ఆయన ఏరీ..."అని భయపడి పోతూ అంది. వెంకటేశం వచ్చి ఆమెను పట్టుకోనబోయాడు గాని లక్ష్మి ఆయన్ని ఒక్కతోపు తోసేసింది.

'రామస్వామి ఊళ్లో లేరు. ఆయనే నాతో చెప్పేరు...రా...'

'ఆఁ! ఏమిటీ! ఆయన చెప్పారా... మిమ్మల్ని నాదగ్గరకు వెళ్లమని చెప్పారా! ఛీ, ఎంత నీచం.... ఎంత పాపం...యిలా ఎందర్ని మోసంచేసి ఎంతమందిని అవమానించేరు చెప్పండి! ఆయన్ని ఏం చేశారు... ఏంచేసి నాదగ్గరికి వచ్చేరు!'

"దాని కేంలే. నిన్ను చూస్తే అదోలా అనిపిస్తూంది! యీ ఒక్క రాత్రికీ ఏంకొంప మునిగిపోయింది?'

'మతిపోయి మాటాడుతున్నారు...మీకు పిల్లలు లేరూ? మీకు భార్య లేమా? ఇదేనా మీ దేశసేవ? యిదేనా మీ పదవి? ఆయన్ని ఏం చేశారు?'

'ఆయన్నేం చెయ్యలేదు! ప్రక్క ఊరికి వెళ్లారు పనుండి'

'ఆఁ, ఆయన లేని సమయం చూసి యింత పనికి పూనుకుంటారా? ఇంకా ఎంత మంచివారో అనుకున్నాను - ఛీఛీ, ఇంత నీచం మనసులో ఉందా? మీ పదవులు - మీ తెలివితేటలు - మీ పెత్తనం కొల్పడానికా? మీ కంటికి నేనెలా కనబడుతున్నానని? నన్నింత చులకనగా చూస్తారా? నయాన్ని విషమైనా తాగించవచ్చు గాని భయాన్ని అమృతమైనా తాగించలేరు! తెలుసునా? యింక మర్యాదగా నడవండి. లేదా మీ పరువు మంటలో కలుపుతాను -' అని రోషంతో ఒళ్లు తెలియక అనేసింది. కాని వెంకటేశం చలించలేదు!

'ఇదుగో చూడూ, యీపాటిదానికి అంత ఇదైతే ఎలా చెప్పు! నీ భర్తకి పెద్ద పదవి యిప్పిస్తాను!! ఆతర్వాత ఎంతో సుఖంగా ఉండండి! ఎవరికీ తెలీదుగా!!'

'ఏమిటీ! పదవి యిప్పిస్తానని పన్నిన మోసమా యిది! మీ పదవి మీరే వుంచుకొండి - యింకా లక్షలకొద్దీ ధనం, పదవి పేరున, సంస్థపేరున, దోచుకొండి. ఆ అన్యాయం బ్రతుకు మీరే బతకండి. మాకవసరం లేదు. ఎంత నీచం అయిన కోరిక కోరుతున్నారో అర్థం కాలేదూ? ఆలోచించండి!- మీ భార్యని మీకన్నా ఎక్కువ అధికారి వచ్చి అడిగితే ఇచ్చేస్తారా? ఆపాటి తెలివి ఉండొద్దూ? యిది మీకోసం కాకపోయినా మీ పదవికోసమైనా మీ కీర్తికోసమైనా తగిన పనేనా?'

'అవన్నీ తెలుసులే నా యీ ఒక్క కోర్కె తీర్చు. ఆతర్వాత నీయిష్టం-నీభర్తకే యిష్టమయినపుడు నీకేం? - ఆతర్వాత ఎంత హాయిగా బ్రతుకుతావో ఆలోచించు!'

'హోదా! ఆ హోదా నాకక్కరలేదు. నం యిచ్చుకొని మణిహారాలు పెట్టుకొనేకంటె నీతిగా బ్రతికి నల్లపూసలు కట్టుగుంటే మంచిది! యింక నన్ను విడిచి వెళతారా? వెళ్లారా!

'ఇదుగో నిన్ను వదిలి వెళ్లిపోడానికి లేదు! నెమ్మదిగా విను. లేకపోతే ఎలాగైనాను వీళ్లనాడు నాదానివి కాకతప్పదు!'

'ఆఁ! బలవంతాన్నా—ఛీ—అన్నం తింటున్నావా? గడ్డి తింటున్నావా? నీతో మాటాడ్డం పాపం! అడివిలో మృగాలూ పక్షులూ నీకన్నా నయం. ఎవరినో ఒకరిని ఎంచుకొని చచ్చేవరకూ విడిపోకండా సంసారం చేస్తాయి. నీతిగా బ్రతుకుతాయి యీ నీ తుచ్ఛబుద్ధి మంచిది కాదు!'

'లక్ష్మీ! నువ్వంటూన్న మాటలన్నీ నాకో ఆనందాన్నిస్తున్నాయి! యీ కోపంలో నీలో అందం ముందడుగు వేస్తోంది!! యిక లాభంలేదు...రా...'

విడువు...విడూ...ఎంత దుర్మార్గం! నవ్వు నన్ను కాదు! ఒక్క హిందూసోదరిని బలవంతం చేస్తున్నావు... దీనివలన ఎంత ముప్పుందో ఆలోచించావా?...లే.. వదులు.'

'ఏమిటా ముప్పు?'

'రెండురక్తాలుకలిసినచోట బలవంతాన్ని మరో రక్తాన్ని ప్రవేశపెట్టబోతున్నావు-దానితోపాటు—వంశం! రూపు!! తెలివితేటలు! మారిపోతాయి పేలవంగా అయిపోయి నిర్వీర్యం అయిపోతాయి.... భారత భావిబాలకులు యిలా తయారవుతూంటే-దేశానికి యింక వాళ్లు సేవ చేసేది ఏమిటి! ఛో నన్ను ముట్టకు - యింత పరస్పర వైరుధ్యంలో నువ్వు బావుకొనే సౌఖ్యం ఏమిటి? నామాట విని పోతావా పోవా! లేకపోతే నేనేం చెయ్యవలసి వస్తుందో నాకే భయంగా ఉంది!'

'లక్ష్మీ! ఆ మాత్రం ఒప్పుగుంటే ఏమయింది? యీ అవస్థలో నువ్వేం చెప్పినా నేను వినలేను!—వినను!! నాకు కావలిసింది నువ్వు. యింకా ఆలస్యం చేస్తే మాట దక్కనివ్వను—'

మీద మీద పడుతూ కదలనివ్వకండా బలవంతం చేస్తూన్న వెంకటేశాన్ని యింకేమన్నా వదలడని లక్ష్మి మరో ఉపాయం కోసం ఆలోచించింది. వెంటనే సొమ్మసిల్లి పడిపోయినట్టు నటించింది. వెంకటేశం ఆమెకుసేవచేయడం మొదలెట్టేడు కానిపోవడం లేదు...యింక లాభంలేదని లక్ష్మి కళ్లు తెరిచి—'ఏమండీ! నామీద మీ కెందుకింత అభిమానం?' అంది. వెంకటేశం అది విని పూరిపోయాడు.

'ఆఁ! ఆఁ!...ఏమిటి...లక్ష్మీ! అభిమానం! యిప్పటికైనా నువ్వు నామీద అభిమానం చూపుతున్నావా?'

'అవును గాని నిజంగా ఆయన ఒప్పుగున్నారా?'

'నిజంగాను లక్ష్మీ...'

'...........'

'లక్ష్మీ'

'నీరసంగా వుంది...'

'అయితే కొంతసేపు పడుకో్క'

'మీరూ పడుకోండి వెళ్తేపుతా—'

'సరే పడుకోనా?'

7

రామస్వామి వెంకడు చెప్పిన కబురు విని రోజుకుంటూ యింటికి పరుగెట్టి వచ్చేడు - కాని లాభం లేకపోయింది—ఇరుగూ పొరుగూ అతని చుట్టూ మూగేరు.

'రామస్వామీ, ఎక్కడికి పోయావు యింట్లో వుండక!'

'పనుండి పైవూరు వెళ్ళేను'

'మంచిపనే చేశావు! ఎవడో ముక్కూమొహం తెలియనివాడిని నమ్మి యింట్లో వుంచి వెళ్ళిపోతే ఏమౌతుంది. పాపం ఆ యిల్లాలు ఎంత బాధపడిందో లేకపోతే ఎందుకలా చేస్తుంది!'

'వళ్లు చూస్తావేమిటి! స్టేషనుకి!'

'ఆఁ! స్టేషన్‌కా?'

'అవును. నీ భార్యని పోలీసులు తీసుకుపోయారు'

'ఆఁ! పోలీసులు! లక్ష్మిని?..లక్ష్మిని..' అని అరుస్తూ పోలీసుస్టేషనుకి వెళ్లేడు.

'లక్ష్మీ...లక్ష్మీ...ఏమిటిది...ఆఁ!'

'ఏమిటా, తెలియదు పాపం! కదండీ!'

'ఏఁవిటి లక్ష్మీ...'

'అదే...పాపానికి ఫలం....ఏ మొహం పెట్టుకువచ్చేరిక్కడికి? వెళ్లిపొండి...... పదవి! పెద్ద పదవి సంపాదించుకోండి!'

'ఏమిటి?'

'ఎలాగో అప్పచెప్పేరుగా వెళ్లండి—పదవి సంపాదించుకొని దేశాన్ని ఉద్ధరించండి!'

'లక్ష్మీ—'

'నా వూసు ఎత్తవద్దు! పదవికోసం పరువుని పోగొట్టుకున్నాడు - చేతులారా తాళి కట్టి మరొకడికి మీయిష్టం నెరవేరడానికోసం నన్ను ఉపయోగిద్దాం అనుకున్నారు! చేతులారా అప్పచెప్పుకున్నారు...ఎంత నీచం! మీలో ఏది ప్రవేశించి మిమ్మల్ని నీచానికి చేయి చాచమంది! మీరు నిజంగా మొగవారేనా? భర్త ఆచరించవలసిన విధి యిదేనా? ఎంత సిగ్గులేదూ? ఇంక మీదగ్గర సంసారం చేసేకన్న నాకీ జైలు జీవితమే బావుంది! వెళ్లిపొండి...వెళ్ళిపొండి...'

'ఏమిటి దంతా లక్ష్మీ...ఏమిటయింది?'

'ఏమిటయిందా? ఇదిగో యీ చేతులారా మీ కళ్లకి వరాలిచ్చే దేవుడులా కనబడే మీ పెన్నిధిని-మీ యిష్టదేవతని—పరోపకారంకోసం తుచ్ఛమైన ప్రతిఫలం కోరిన పెద్ద మనిషిని...మీ రింట్లోలేని సమయంలో మీచేతనే ప్రోత్సహింపబడి నన్ను బాధించిన నీచుణ్ణి—ఆ వెంకటేశాన్ని యీ చేతుల్తో విషం యిచ్చి చంపాను! అందుకే నాకీ శిక్ష-వెళ్లండి నాగురించి మీరేమీ చేయనక్కరలేదు - విచారించనక్కరలేదు వెళ్లండి - నాకింకా కోపం తెప్పించకండి—'

'లక్ష్మీ...లక్ష్మీ...' అని రామస్వామి గట్టిగా అరిచాడు. సర్కిల్ యిన్స్పెక్టర్ దగ్గిరికి వెళ్ళాడు—

'ఇన్స్పెక్టర్ గారూ, ఆమె దేం తప్పులేదు - తప్పంతా నాది. నన్ను బంధించండి!'

'అదేమిటి రామస్వామిగారూ, విషం తనే యిచ్చినట్టు ఒప్పుగుంటున్నారే- విషం యిచ్చినట్టు రుజువు అవుతూందే - యిదేమిటి?'

'అవును. దీని కంతా కారణం నేను—పదవీవ్యామోహంలో పడిన నాకు కళ్లు కన్పించలేదు - పరువు, ప్రతిష్ఠ, నీతి - ఆఖరికి నా భార్య మానంకూడా కన్పించలేదు. పదవి యిప్పిస్తానంటే నా భార్యని ఆయనకు యిచ్చి ఆయనకోర్క తీర్చడానికి ఒప్పుగున్నాను. నేనుంటే వీలుండదని ఏదో నెపంమీద పైవూరు పోయాను... కాని లక్ష్మి—హింసూస్త్రీ విధిని నిర్వర్తించింది. ఆయన బలవంతంచేస్తే విషం యిచ్చి ఆమె చంపవచ్చు. కాని దీనికి మూలకారణం నేను...నాకా శిక్ష విధి—'

'రామస్వామిగారూ క్షమించాలి! విచారణకి ప్రత్యక్షమైన రుజువులతోనే, సాక్ష్యాలతోనే పనిగాని లోపలి విషయాలు అక్కరలేదు—పోలీసులకి చెవులేగాని కళ్లు ప్రధానంకాదు!—అదీ కాక మీరు యీ హత్యజరిగినపుడు పైవూళ్లో ఉన్నారని మీరే అంటున్నారు—మాకంతకన్నా కావలసిన విషయం లేదు—మీ భార్యయే స్వయంగా చంపేనని ఒప్పుగుంటున్నారు—అదికాక ఆ స్థలంలో వారిద్దరూ తప్ప మరొకరు లేరు—అంత పెద్ద మనిషిని చంపడానికి మరెవరికీ—మరే కారణంకూడా కనపడదు—అందుచేత క్షమించండి'

★ సాహిత్య సింహావలోకనం ★

గత సంవత్సర తెలుగు సాహిత్యాన్ని సింహావలోకనం చేస్తుంటే అనేక ఉత్తమ రచనలు పొడసూపకపోవు. అందులో కొద్ది మంది రచయితలే యధార్థాలని చిత్రిస్తూ జీవితాలను ప్రతిబింబింపచేస్తూ పాఠకుల హృదయాలను హత్తుకోగలుగుతారు. అలాంటి రచయితలలో శ్రీ "శార్వరి", "హితశ్రీ" భరద్వాజులు ముఖ్యులుగా తోస్తుంది.

ప్రత్యేకించి శ్రీ శార్వరిగారి రచనలు హృదయంగమంగా ఆకర్షణీయంగా యధార్థానికి అతి సాన్నిహిత్యంగా ఉండి జీవితాలనే ప్రతిబింబించటం చూడగలుగుతాం. ఉదాహరణకు "విజయప్రభ"లో సీరియల్‌గా ప్రచురితమైన "ఎండమావులు" నవల. ఈ నవలలోని కథానాయకుడు భగవాన్ చాలామంది యువకులకు ప్రతిబింబం. ప్రేమించి, ఆశించి, కోల్పోయిన జీవితం భగవాన్‌ది. ఇందులో ఒక భగవాన్ జీవితమే కాక మనకు పరిచయమయ్యే ప్రతివ్యక్తి—ప్రతి కుటుంబంలోని ఒక వ్యక్తిలో అణగారిన ఆశలని, కోరికలని, చివరకు రూపాన్ని రూపించి, నిరూపించి, నేనేనా ఈ నవలలోని పాత్ర అని అనిపిస్తుంది. ఇంత సమ్మోహకజనకంగా సామాన్యమానవ మనస్తత్వాన్ని కథకరించటం, పోషించటం శార్వరి గారి ప్రత్యేక నిపుణతను తెలియచేస్తుంది.

వీరి ఇతర కథలలో గత సంవత్సరంలో "తెలుగు స్వతంత్ర"లో ప్రచురితమైన "రావలసిన భావవిప్లవం" అభ్యుదయ నిరోధక రచయితలపాలిటి సమ్మెట పెట్టు. ఈనాడు సంఘంలో అణగారిపోయిన శ్రామికజీవితాన్ని, విప్లవశక్తుల్ని ఉత్సహించి, శ్రామికలోకంలో క్రొత్తరక్తాన్ని పులజింపచేసింది. పాఠకలోకాన్ని పులకరింపచేసింది. వీరి "చర్విత చర్వణం"లాంటి ధక ఒక్క ఆంధ్రదేశంలోనే కాదు. ఇంతవరకు విశ్వసాహిత్యంలోనే లేదని చెప్పక తప్పదు. దాని కదే సాటి. అందులో కిష్టుడు నిరుద్యోగిగా ఉండి అనేక కష్టాలకు నష్టాలకులోనై మధ్యతరగతి మనస్తత్వాల్ని సామాన్య నిరుద్యోగుల ఆశయాలను, అనుభూతుల్ని రెచ్చగొట్టి, తనకు తానే ప్రతిబింబమయినాడు. ఈనాడు దేశంలో కిష్టుడులాంటి వ్యక్తులు ఒకరు కాదు ఇద్దరు కాదు. వేల లక్షలసంఖ్యలో ఉన్నారని మనందరికీ తెలిసిన విషయమే. అందరిలోని ఆవేదనలకు ప్రతిబింబమే "చర్విత చరణం".

గొంది విజయరామయ్య
తెనాలి.

1950 వ సంవత్సరంలో నేను చదివిన కథలు, వ్యాసాలలో, "భారతి"లో ప్రచురించబడిన "రాగమయిం" "అన్నపూర్ణ." ఇవి నాకునచ్చినవి.

కాళీపట్నపు రామారావుగారి "రాగమయి" బలివాడ కాంతారావు గారి "అన్నపూర్ణ" ఇవి రెండూ ఒక్క పోలిక నే నడిచాయి. ఈ రెంటిలోనూ ప్రధాన ఇతివృత్తం ఒకటే, సామాన్య మధ్య తరగతి కుటుంబాలలో గలిగే అంతఃకలహాలూ, దాని నివారణాను. ఈ రెండు కథానికలలోనూ ఇంటికి వచ్చిన పెద్దదోడలిపాత్రే అతి ముఖ్యమయింది. రాగమయిలోని "ఉమా" అన్నపూర్ణలోని "లన్నపూర్ణా" పాత్రలు ఒకదానికొకటి తీసిపోవు. ఈ రెండు కథలు చదువుతున్నంతసేపు మనంకూడా ఆకథల్లోని పాత్రలలో ఒకరనీ మనకుకూడాఅసంఘటనలో ప్రధానపాత్ర ఉన్నదనిఅనిపిస్తుంది.

ఈ కథానికలను తెలుగుపాఠక లోకానికి అర్పించి సాహిత్యసేవ చేసిన రచయిత లెంతయినా అభినంద నీయులు.

కె. వి. సత్యం, పాతపాళ్యం.

'ఆఁ! ఏమన్నారూ?...లాభం లేదూ—నాలక్ష్మి నాకు రాదూ?...అవును రాదు! రాదు!! నా పాపానికి తగినశిక్ష యిదే. యింతకు వేరే యినపగజాల్లో ఉండనక్కర లేదు. యిలా కృశించి—కుళ్ళి చస్తాను... చాలు—చాలు—

'లక్ష్మీ...లక్ష్మీ...అంటూ రామస్వామి ఒళ్లు తెలియకండా అరుచుగుంటూ ఎటో వెళ్లిపోయాడు...

'లక్ష్మీ...అన్న కేకకి లక్ష్మి అటువైపు చూసింది! గుండె తరుక్కుపోయింది. వస్తూన్న దుఃఖాన్ని ఆపుగోలేక వెక్కి వెక్కి ఏడ్చింది యినపగజాల్ని పట్టుగొని. కంటికి కనుపడేవరకూ భర్తని చూస్తూ ఉండిపోయింది!

8

మరి కొంతకాలానికి పిచ్చాసుపత్రి ఆవరణలో యీ మాటలు తరుచూ వినపడుతున్నాయి—'పదవి! పదవి!! బలే! ఎటువంటి పదవి...నాకు తగిన పదవి దొరికింది—నీ శాపం నాకీ శిక్ష విధించిందేమో! అవును... నా దురాశకి నాకీ శిక్ష యింకా చాలదు!...లక్ష్మీ...వెంకటేశం, బూర్జువా! నిన్ను నమ్మి నా గొంతుక కోసుకున్నాను...నీలో ఏంతకుట్లుంది! నీలాటివాళ్లింకా ఎంతమందున్నారో! అహ్హహా...నీకూ నాకూ తగిన ప్రాయశ్చిత్తం అయింది...ఛస్తాను చస్తాను...పోండి... యింతమంది పిచ్చివాళ్లలో నే నొకణ్ణి... అహాహా...పిచ్చివాణ్ణి...ఒరే...పిచ్చీ... వెళ్లి కారు తీసుకురా...ఒరే వెంకన్నా... నువ్వెళ్లి టీ పార్టీకి ఎరేంజి చెయ్యి...ఊఁ... వెళ్లండి నేను పెద్దపదవిలో వున్నాను... నామాట వినకపోతే చూడండి—మీ కందరికీ నేను మంత్రిని...అహాహా...మంత్రిని.. నేను...మంత్రిని!...

★

గ్రంథస్వీకారం

"తెలంగాణా తీరుతెన్నులు"


రచన : "భవదీయుడు."

ప్రచురణ : జనపదప్రచురణలు, ఎ-9. 349 నారాయణగూడ, హైదరాబాద్.

వెల : రూపాయి.

"ఆధునిక విజ్ఞానం"

ప్రచురణ: సయన్స్‌సర్వీసు (ఇండియా) మద్రాసు 6.



ముసలిదాని కథ

శ్రీ ఎమ్. వజీరుర్ రహ్మాన్

రోడ్డు పక్క ముసల్దొకతె
రాళ్ళమీద పరుంటోంది;
రోడ్డుమీద ప్రజను చూసి
రాగి డబ్బు లడుగుతోంది.

ముసలిదాని మనసులోని
బాధ లొలుకు గాధ వినక,
ఉన్న జనం చెవి యొగ్గను;
లేని జనం తరలిపోను.

ముసలిదాని గాధవిన్న
జనం జేబు తడుముతోంది;
గుండె రాయి చేసుకొంటు
ముసుముందుకు సాగుతోంది.

జనంకాలి ధూళిలోన
ముసలి బ్రతుకు మెదుల్తోంది
వారి వీరి కరుణతోనె
కాలమెట్లో గడుపుతోంది.


ముసలిదాని గొంతు కెండి
మొహం రంగు మారుతోంది;
ఒళ్లు బడలి కీళ్లు సడలి
రాళ్లమీద పరుంటోంది.

నెలలు గడచి, ఏళ్లు గడచి,
కాలమెంతో మారుతోంది;
చివరి ఘడియ ముసలిదాని
చెంగు పట్టి లాగుతోంది.

ధనవంతుని ఇనప్పెట్టె
మూల్గుతోంది, పిల్ల లెట్టి;
తిండిలేక ఎండిపోయి,
పండిపోయె ముసలి బ్రతుకు.

కరుణ చూపు చెల్లాయీ!
కనికరించు సోదరుడా!
మన వూరిలో, మన వీధిలో
చెట్టు కింద రాళ్లమీద

పరుంటోన్న ముసలిదాన్ని
కనికరించు, పలకరించు!



గుఱ్ఱంపుట్టుక

మూలం టాగూర్

బ్రహ్మదేవుడు ఈసారి క్రొత్త జంతువును సృష్టించాలనుకున్నాడు. సృష్టికి కావలసిన పరికరాల్ని జాగ్రత్త చేసే సేవకుడిని పిలిచాడు. 'నే నొక నూతన మృగాన్ని సృష్టించ దలిచాను. వెంటనే నాకు పంచభూతాల నుంచి కొద్ది కొద్దిగా సామాన్లు తీసుకురా' అన్నాడు.

'మహా ప్రభూ! తమరు ఇంత కాలం జంతువులను సృష్టించడంలో నిమగ్నులై పోయి వస్తు సామగ్రిని జాగ్రత్తచేయడంలో అశ్రద్ధ చూపించారు. అందుచేత ముఖ్యమయిన పరికరాలన్ని అయిపోయాయి.

ఇక ఎక్కువగా మిగిలిఉన్నవి ఈథరు, గాలి", అన్నాడు వాడు.

బ్రహ్మదేవుడు ఇది విని విసుక్కున్నాడు. 'సరే ఆ ఉన్నవాటినే తీసుకురా. ఇదీ ఒకందుకు మంచిదే' అన్నాడు.

బ్రహ్మదేవుడు కొత్త జంతువును సృష్టించాడు. అయితే ఈ జంతువుకు కొమ్ములు లేవు. పళ్ళున్నాయి గాని అవి తినడానికే గాని శతువులను కరవడానికి ఉపయోగిం దీని నిర్మాణంలో ఈథరు, గాలి ఉపయోగింపబడ్డాయి కాబట్టి ఈ జంతువు అతివేగంగా దాడు తీస్తుంది. ఆజంతువు గుఱ్ఱము.

బ్రహ్మదేవుడు పులులకు అడవి, సింహాలకు గుహ, ఇలాగ అన్ని జంతువులకు అన్ని నివాసస్థానాలు ఇచ్చాడు. అలాగే ఈ గుఱ్ఱానికి ఏది యివ్వటం అని ఆలోచించాడు. చివరికి గుఱ్ఱానికి నివాసస్థానంగా పచ్చిక మొలిచిన మైదానాన్ని ఇచ్చాడు. గుఱ్ఱం పచ్చిక తింటూ ఇష్టం వచ్చినట్లు మైదానంలో తిరుగ సాగింది.

ఆ మైదానంలో ఒక మానవుడు నివసిస్తున్నాడు. అతనొకనాడు స్వేచ్ఛగా, తిరుగుతున్న ఈ గుఱ్ఱాన్నిచూచి అది తనదగ్గరుంటే తనకు స్వారిచేయడానికి, సరకులు మోయడానికి బాగా ఉపకరిస్తుందని దానిని పట్టుకుని కట్టివేశాడు. దానికని ప్రత్యేకంగా ఒక శాల కట్టించాడు. అదే గుఱ్ఱపుశాల.

స్వేచ్ఛగా తిరిగే ఈ గుఱ్ఱానికి ఇలాగ బంధింపబడటం రుచింప లేదు. బయటికి ఎలాగయినా తప్పించుకుపోవాలన్న ఆరాటం ఎక్కువయింది. బలంగా గోడని తన్నింది. అయితే దాని కాలికి దెబ్బలు తగిలాయికాని గోడమాత్రం పడలేదు. ఇది చూచేసరికి గుఱ్ఱం యజమానికి కోపం వచ్చింది.

"ఎంతటి కృతఘ్నత కనబరుస్తూం దీ గుఱ్ఱం, దీనికోసం ఎన్ని పాట్లు పడుతున్నా. దీని సౌఖ్యాలు చూడటంకోసం ప్రత్యేకంగా కొందరిని అధిక వేతనంమీద నియమించానుకూడా. దీని కెందు కింత పొగరు?" అన్నాడు మానవుడు.

ఆ కాపలావాళ్ళంతా కలిసి గుఱ్ఱాన్ని వశం చేసుకోవడానికి యత్నించి కృతకృత్యు లయ్యారు. ఇక గుఱ్ఱం గోడలను తన్నడానికి వీలులేకపోయింది. ఇక తన విచారాన్ని తెలియబర్చడానికి నోరొకటే మిగిలింది. సకిలించడం మొదలు పెట్టింది.

ఇది యజమానికి పెద్ద రోదన అయింది. అతని నిద్రంతా రోజూ చెడిపోసాగింది. ఇక దీని నెలాగయినా అరికట్టడానికి మార్గాలు వెతికి చివరకు మూతి కట్టేశాడు. ఇక గుఱ్ఱానికి తనబాధను నోటితో కూడా తెలియజేయడానికి వీలు లేక పోయింది. అయినా అతికష్టంమీద అరిచేది. ఈ ధ్వని గుఱ్ఱం సకిలింపులాగ లేక మరొక వింతధ్వనిగా వినపడసాగింది.

ఈ వింతధ్వనిని విని బ్రహ్మదేవు డొకమాటు నిద్రలోంచి మేల్కొన్నాడు. క్రిందికి చూచాడు. కాని తాను సృష్టించిన గుఱ్ఱం ఆ మైదానంలో లేదు. బ్రహ్మదేవుడికి భలే కోపం వచ్చింది. 'ఇదంతా నువ్వు చేస్తున్న పనేయమా! నువ్వు నా గుఱ్ఱాన్ని తీసుకుపోయావు' అని అరిచాడు బ్రహ్మ.

'ప్రభూ! మీా కన్ని సందేహాలు నామీాదనే కలుగుతాయి. దయయుంచి మానవులకేసి తిరిగి ఒకమాటు చూడండి. మీా కన్నీ అర్థమవుతాయి' అన్నాడు యముడు. బ్రహ్మదేవుడు భూమి నంతా చూచాడు. ఒకచోట తన గుఱ్ఱం నాలుగుగోడలమధ్య బంధింపబడియుండటం చూచాడు. బ్రహ్మదేవుడు ఉగ్రుడై పోయాడు. 'నా గుఱ్ఱాన్ని మర్యాదగా వదిలేయి. లేకపోతే దానికి పళ్ళు, పంజాలు వచ్చేటట్టు చేసి దాని నొక పెద్ద పులిగా మారుస్తా' నన్నాడు బ్రహ్మ.

మానవు డిది విని 'మహాప్రభూ! ఇది వదిలివేయవలసిన జంతువు కాదు. మీారు కావాలంటే చూడండి. దీనిని వదిలివేస్తాను. ఆ పైన ఏం జరుగుతుందో' అన్నాడు.

గుఱ్ఱాన్ని వదిలేశాడు. అయితే మానవు డొక చిన్న గమ్మత్తు చేశాడు. దాని ముందరి కాళ్ళను త్రాటితో కట్టేశాడు. గుఱ్ఱం మైదానంలో అతి కష్టంమీాద నడుస్తోంది. అన్ని జంతువులు గుఱ్ఱంపాట్లను చూచి నవ్వసాగాయి. కప్పలు చప్పట్లు చరచి హేళన చేశాయి. బ్రహ్మదేవు డిదంతా పైనుంచి చూచాడు. పాపం! ఆయన చాలా ఎత్తునుంచి చూడటంవలన గుఱ్ఱం కాళ్ళకు కట్టబడిన త్రాడు కనిపించ లేదు.

'ఇదేమిటి! నేను క్రొత్తగా సృష్టించిన ఈ జంతువు ఇలాగ అవమానింపబడుతోంది' అన్నాడు బ్రహ్మ.

'నేనేం చేస్తాను దేవా. స్వర్గంలో ఏదైనా మైదానముంటే చెప్పండి. గుఱ్ఱా న్నక్కడికి పంపించేస్తాను' అన్నాడు మానవుడు.

'అలాగకాదోయ్. నువ్వు తిరిగి దానిని నీశాలకు తీసుకుపో. ఇది అక్కడే ఉండాలి' అన్నాడు బ్రహ్మ.


'అబ్బ! ఎంతటి బరువును మానవుల నెత్తిమీాద పెడుతున్నారు?' అన్నాడు మానవుడు.

'అవును. తప్పకుండా మానవ కోటికి ఇది బరువే' అన్నాడు బ్రహ్మ. ★

[అనువాదం: ఆర్. యం. చిదంబరం]

యుక్తితో పెళ్లి

శ్రీ మల్లెల వెంకటేశ్వరశర్మ



రామయ్య ఆ ఊళ్లోకల్లా బీదవాడు. తనకున్న యకరం పొలంలో వచ్చేదాన్నుంచి తన సంసారాన్ని పోషించుకుంటున్నాడు.

రామయ్యకు పెళ్ళీడు వచ్చిన ఒకకూతురు ఉన్నది. "ఏమోయ్ రామయ్యా! పిల్లకు పెళ్ళెప్పుడు" అని నలుగురు అడుగుతున్నారు. ఎంతసేపటికి తనకు వచ్చే ఆదాయం ఖర్చయిపోతున్నది కాని, దమ్మిడీ నిలువ చేయలేకపోతున్నాడు. కాని రామయ్య పిల్లకు పెళ్లిచేయాలి. చేతిలోదమ్మిడీలేదు. ఇంక నాలుగు రోజుల్లో పిల్ల పెళ్లిచేయకపోతే ఊళ్లో తలయెత్తుకుని తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని రామయ్యకు తెలుసు. అందుకనే పిల్లకు తొందరగా పెళ్లి చేయాలనుకున్నాడు.

కాని అనుకొన్నది, అనుకొన్నట్లుగాజరిగితే యీప్రపంచం యిలా ఉంటుందా? చూస్తుండగా సంవత్సరం గడచింది. కాని రామయ్య కూతురుపెళ్లి మాత్రం కాలేదు. ఆసంవత్సరం రామయ్య ఒక పూట తిని, ఒక పూట పస్తుండి, యెలాగైతేనేం మూడువందల రూపాయలు సంపాదించాడు.

ఎన్ని పెళ్లి సంబంధాలు గాలించినా వెయ్యిరూపాయల కట్నంకి తక్కువ ఎవరూ ఒప్పుకోలేదు. కాళ్లు కాయలు కాచేలాగు తిరుగుతాడు కాని తనకు తగ్గ వరుడు లభించలేదు. రామయ్యకు కోపం వచ్చి తన కూతురికి పెళ్లి అసలు చేయనే చేయను అని మొండికేశాడు. రామయ్య మగవాడు కాబట్టి ఊళ్లో యేదో తిరుగుతున్నాడు కాని రామయ్యభార్య మటుకు ఊళ్లో తిరగలేక పోయేది. చెరువుకు వెళ్తే అక్కడ "మాకు పెళ్లిపప్పన్నం ఎప్పుడమ్మా" అని అడిగేవారు అమ్మలక్కలు. యెక్కడయినా నలుగురు ఆడవాళ్లు చేరితే "అదేమి విడ్డూరమమ్మా. పెళ్లి చేస్తే యీపాటికి

(43-వ పేజీ చూడండి)

అం

రచన శ్రీ రాఘవేంద్ర



పూర్వకాలం క్రిందట హిందూ దేశాన్ని బాబరు అను చక్రవర్తి పాలిస్తుండేవాడు. ఆయన మహమ్మదీయ చక్రవర్తి అయినప్పటికీ అన్యజాతులయందుగూడా ఆదరము గల్గి, ప్రజలచే ఎంతో పొగడబడుతుండేవాడు.

ఆయన సిబ్బందిలో రహిమాన్ అనే ఒక సిపాయి వుండేవాడు. అతను ఎప్పుడూ గేటుదగ్గర కాపలా కాస్తుండేవాడు.

ఒకనాడు ఒక పేదబ్రాహ్మణుడు గేటుదగ్గరకు వచ్చి రహిమాన్‌తో "అయ్యా! నేను చాలా పేదవాడిని. ఐదు రోజులనుంచి అన్నం లేక ఆలు బిడ్డలు అల్లాడుచున్నారు. కనుక లోపలికెళ్ళి చక్రవర్తిగారితో నా పేదతనాన్ని గూర్చి చెప్పుకుంటే ఏమైనా సహాయం చేయకపోతారా అని వచ్చాను. మరి మీరు లోనికి పోనివ్వాలి......" అని యెంతో ప్రాధేయపూర్వకంగా అడిగాడు. అందుకు లంచగొండి అయిన ఆ సిపాయి "పోవయ్యా! మాకు ఇక్కడ మామూలు ఇస్తేనేగాని పోనియ్యం ......"అన్నాడు.

అప్పుడు ఆ నిరుపేద బ్రాహ్మణుడు ఎంతో వినయంగా సిపాయితో ఇలా అన్నాడు.

"అయ్యా, నవాబుగారిదగ్గర కెళ్ళి, వచ్చేప్పుడు నాదగ్గర ఏమైనా సొమ్ము వుండొచ్చు. కాని ఇప్పుడేమియును లేదు. వచ్చేప్పుడు మిమ్మల్ని తృప్తి పరుస్తాను......"

రహిమాన్ అందుకు సరేనన్నాడు. బ్రాహ్మణుడు చక్రవర్తి దగ్గర కెళ్ళి తన నిరుపేద తనాన్ని గురించి చెప్పుకున్నాడు. వెంటనే ఒక చీటీ వ్రాసి ఇచ్చి ఇలా అన్నాడు.

"పంతులుగారూ! ఈ చీటీని షరాబుదగ్గర కెళ్ళి చూపితే ఐదు వరహాల సొమ్ము ఇస్తాడు. (వరహా అంటే నాలుగు రూపాయలు) ఈ రోజుకవి తీసుకెళ్ళి వీలుగా వుంటే మళ్ళీ రేపు రండి."

శాస్త్రిగారు నవాబుకి ఒక దణ్ణం పెట్టి షరాబుదగ్గర కెళ్ళి సొమ్ముతీసుకొని, కాపలా కాస్తున్న రహిమాన్ సంగతి మరచిపోయాడు. లంచగొండి అయిన రహిమాన్‌గూడా "ఏమయ్యా సా

లంచ మేది? అని అడగలేక పోయాడు. తనకుఏమీ ఇవ్వకుండా పోయిన ఆ బ్రాహ్మడ్ని ఎలాగైనా చక్రవర్తిగారితో చెప్పి శిక్షవేయించాలనుకున్నాడు. అందుకు ఉపాయ మాలోచించాడు. కుట్ర దారుల కుపాయాలేం తక్కువ? వెంటనే అతనికో ఉపాయంతట్టింది. అప్పుడే చక్రవర్తిదగ్గర కెళ్ళి ఆయనతో ఇలా అన్నాడు.

"అయ్యా! ఇంతకుముందు మీ దగ్గర కొచ్చి పోయిన బ్రాహ్మడికి డబ్బు కొద్దిగానే ఇచ్చారట. అందుచేత అతను మిమ్మల్ని బండబూతులు కూస్తూ వెళ్ళిపోయాడు. ఎందుకయ్యా చక్రవర్తిగారి నలా తిడతావ్ అంటే పోపోవోయ్ అంటూ వెళ్ళిపోయాడు......"

ఇదంతా విన్న బాబర్ చక్రవర్తి ఆవేశానికి అంతే లేదంటే అందరూ ఆశ్చర్య పోతారు. ఎలాగైనా మరుసటిరోజు అతనినిశిక్షించాలనుకున్నాడు.

మరుసటి రోజు ఆ బ్రాహ్మణుడు చక్రవర్తిగారి సన్నిధికి బయలుదేరాడు. ద్వారందగ్గర సిపాయి ఆ రోజేమీ అనకపోయేసరికి అతని కాశ్చర్యమేసింది. వెంటనే నిన్న సిపాయిసంగతి మరచి వెళ్ళినట్లు గుర్తుకొచ్చి అతనితో "ఏమండీ! నిన్న తమసంగతి మరచివెళ్ళాను. ఈరోజుతప్పకుండా......" అంటూ లోపలి కెళ్ళాడేగాని, దానిని రహిమాన్ విన్పించుకోలేదు.

శాస్త్రిగారు నవాబుదగ్గర కెళ్ళగానే ఆయన క్రిందటి రోజు మాదిరి ఒక చీటీ వ్రాసిఇచ్చి వెళ్ళమన్నాడు. అందులో ఇలా వ్రాసి ఇచ్చాడు.

"ఈ చీటి తెచ్చినవానికి కొరడాతో పది దెబ్బలు బలంకొద్దీ కొట్టవలయును,

ఇట్లు
చక్రవర్తి.

అమాయకుడైన బ్రాహ్మణుడు అదేమీ తెలుసుకోలేక పోయాడు. కాని ముందుగా రహిమాన్‌దగ్గర కొచ్చి ఆచీటీ అతని కిచ్చి "నిన్న మీవిషయమై మరచి వెళ్ళితిని. గనుక క్షమించవలయును. ఈరోజు ఎంత సొమ్ము ఇస్తే అంత మీరే తీసుకొండి." అని వెళ్ళిపోయాడు. అప్పుడు రహిమాన్ ఎక్కడ లేని సంతోషంతో షరాబుదగ్గర కెళ్ళి ఆచీటీ అతనికిచ్చి "నాకివ్వవలసినవి త్వరగా ఇవ్వండి. గేటుదగ్గరఎవ్వరూ లేరు నేనెళ్ళాలి" అన్నాడు. షరాబు ఆ చీటీ చూచి అతని మాటలకు ఆశ్చర్యపోయాడు. అది రాజాజ్ఞ కావటంచేత వెంటనే బలంకొద్ది అతనిని పది కొరడా దెబ్బలు కొట్టాడు. అటువంటి నీచుణ్ణి మరి పది దెబ్బలుకొట్టినా పాపంలేదంటే మీరంతా ఒప్పుకుంటారు. ఆ దెబ్బలకు రహిమాన్ వీపు పెట్లిపోయింది. వెంటనే చక్రవర్తిగారి దగ్గరకెళ్ళి, అతనికి జరిగిన అన్యాయాన్ని గురించి మొరపెట్టుకున్నాడు.

అప్పుడు చక్రవర్తి అతనిని "ఈ చీటీ నీకేలా వచ్చింది?" అని గద్దించి ప్రశ్నించాడు. అందుకు సిపాయి ఇలా అన్నాడు.

"ప్రభూ! ఆ బ్రాహ్మడు చీటీ నాకిచ్చి 'నీవే ఆ డబ్బు తెచ్చుకో' అన్నాడు. షరాబుగారిదగ్గర కెళ్ళి ఆ చీటీ చూపితే కొరడాతో పది దెబ్బలు బలంకొద్దీ కొట్టి వీపు పచ్చడి చేశారు...."

బాబరు చక్రవర్తి మొదట ఆ బ్రాహ్మణుడు చీటీలోని విషయం చదువుకొని, అతనికిచ్చి వెళ్లాడేమో అని అపోహపడ్డాడు. పిలిపిస్తే సర్వ విషయాలు తెలిసిపోతాయని ఆ బ్రాహ్మడ్ని వెంటనే తీసుకురండి అని భటులను పంపించాడు. చక్రవర్తిఆజ్ఞప్రకారం వారు అతనిని తీసుకొచ్చారు.

అప్పుడు చక్రవర్తి బ్రాహ్మణ్ని "ఏమయ్యా ఆచీటీ నీకు ఇస్తే మళ్ళీ దానిని ద్వారపాలకునకు దేని కిచ్చావ్ ?" అని ప్రశ్నించాడు. ఆ బ్రాహ్మడు ముందు రహిమాన్ అతనిని లంచమడగటం మొదటినాడు తను మరచి వెళ్ళటం...ఇంకా జరిగిందంతానట్టు పోకుండా గట్టిగా చెప్పాడు.

ఇందుమూలంగా బాబరుచక్రవర్తికి రహిమాన్ 'లంచగొండి' అని తెలిసిపోయింది. అప్పుడా' లంచగొండిని' ఉద్యోగమునుండి తొలగించాడు. బ్రాహ్మడికి ఒక గొప్ప బహుమాన మిచ్చి పంపివేశాడు. దానితో ఆ బ్రాహ్మడు భార్యా బిడ్డలతో హాయిగా వుంటున్నాడు.

★

యుక్తితో పెళ్లి

(40-వ పేజీ తరువాయి)

యిద్దరు బిడ్డల తల్లయేది. ఇంత వరకు రామయ్య తన కూతురు పెళ్లి చేయడేమిటి" అని అనుకొనే వారు. ఈ ముక్కలు అప్పుడప్పుడు రామయ్యభార్య చెవిన పడక పోలేదు. అందుకని రామయ్యభార్య తన కూతురు పెళ్లి చేయాల్సిందే నని పంతం పట్టింది.

ఇక రామయ్యకు ఏం తోచటం లేదు. చివరకి ఉన్న యకరం మ్ముదామనుకొన్నాడు. కాని అదీ పోతే యిక తనకు తినటానికి ఆ నాలుగు గింజలు కూడా ఉండవు.

ఒకరోజున రామయ్యతో అతని భార్య "ఏమండి రామపురంలో ఒకసంబంధం ఉందిట. కాస్త దానిసంగతి తెలుసుకొండి. అవసరమయితే పొలం కూడా అమ్మేద్దాం" అంది. రామయ్య తనభార్యకు ఎంత కష్టంగా తోచి యీమాట లందో గ్రహించాడు.

రామయ్య రామపురం పెళ్లి సంబంధంమాట్లాడి "ఏమండీ. నేను బీదవాణ్ని. ఏదో కరుణించాలి. నూట పదహార్లుకట్నం యిచ్చుకొని పెళ్లి సలక్షణంగా చేస్తాను" అన్నాడు. కానిపెళ్లికొడుకు తండ్రి కృష్ణయ్య "పాతిక నూటపదహార్లు కట్నం యిచ్చినా నేను ఒప్పుకోలేదు. నీవు ఒక్క నూటపదార్లిస్తావా. నీసంబంధం మేము చేసుకోం" అన్నాడు. రామయ్యకు వెంటనే ఉపాయం తోచింది. "అయ్యా! పోనీ పాతిక నూటపదహారు కట్నం ఇచ్చుకొంటాను. మాపిల్లను చేసుకొండి" అని బ్రతిమాలాడు. చివరికి ఎలా గయితే నేం పాతిక నూటపదహార్లకి కృష్ణయ్య తన కొడుక్కి రామయ్య కూతుర్ని చేసుకోటానికి వప్పుకొన్నాడు. సరే ఊరిపెద్దల సమక్షంలో రామయ్య కృష్ణయ్యకి పాతిక నూటపదహార్లు కట్నం యిచ్చేటట్లు, కృష్ణయ్య తన కొడుక్కి రామయ్య కూతుర్ని చేసుకొనేట్టు ఒప్పుకొని తాంబూలాలు పుచ్చుకొన్నారు.

కృష్ణయ్య పాతిక నూటపదహార్లు కట్నం వస్తుందిగదా అని పిల్లకి ఒక వెయ్యిరూపాయుల, చీరలు, నగలు కొని పెళ్లికి హాజరయినాడు. పెళ్లి హడావిడిగా సాగుతున్నది. ఊరి పెద్దలుంతాఉండి పెళ్లి జరిపిస్తున్నారు. యింతలో కట్నం యివ్వవలసిన టైము వచ్చేటప్పటికి రామయ్య 29 రూపాయలు మాత్రమే కట్నం ఇచ్చాడు. కృష్ణయ్యకి కోపంవచ్చింది. "పాతిక నూటపదహార్ల కట్నంఅంటే రెండు వేల తొమ్మిది వంద లిస్తానన్న వాడివి యిరవది తొమ్మిది రూపాయలిచ్చేవేమిటి" అని అరచాడు. ఊరిపెద్దలు ఏం మాట్లాడలేదు. అంతా హడావిడిగా ఉంది. వెంటనే రామయ్య ఊరిపెద్దలతో "అయ్యా! నేను పాతిక నూటపద హార్లు కట్నం యివ్వటానికి మీ అందరి యెదుట వప్పుకొన్నాడు. పాతిక అనగా నాల్గోవంతని అందరికీ తెలుసు. నూట పదహార్లలోనాల్గోవంతు యిరువది తొమ్మిది రూపాయలు. నేను వప్పుకున్న కట్నం యిచ్చేశాను. నామాట చెల్లింది. ఇక కృష్ణయ్యగారు తమ మాట చెల్లించుకోవాల్సి ఉంది" అని అన్నాడు.

ఇతని తెలివికి అందరూ ఆశ్చర్యపోయారు. కృష్ణయ్య తన మాట నెరవేర్చుకోకపోతే తన పరువు దక్కదని చచ్చినట్లు రామయ్య కూతుర్ని తనకొడుక్కి పెళ్లి చేసుకొన్నాడు.

చూచారా రామయ్య ఎంత యుక్తిగా తన కూతురు పెళ్లి చేశాడో ! ★

"ఇది మా ముత్తాతగారి తండ్రి చిత్రం."
"నిజం? మీకన్నా చిన్నగా కనిపిస్తారే?"

మల్లెలమహాదేవి

శ్రీ వెంపలజయలక్ష్మీదేవి



మణిపురమనే పట్టణమును చంద్రసేనుడనురాజు పాలించుచుండెను. అతడు తన ప్రజలను న్యాయముగ పాలించుచుండెను. ఆతని కెంత సంపదయున్నను సంతానము లేకుండెను. మ్రొక్కవలసిన దేవుళ్లకు మ్రొక్కెను. ఎన్నో తీర్థ యాత్రలు గావించెను. లెక్కకు లేని దానధర్మములు చేసెను. కాని సంతానము లేనికొరత తీరలేదు.

మణిపురమునకు ప్రాంతమున గల ఒకఅడవియందు మల్లెలమహాముని యనబడు ఒకముని తపస్సు చేయుచుండెను. అతడు సంవత్సరమున కొకపర్యాయము తనకన్నులను తెరచి తాను ప్రథమవీక్షణమున ఎవ్వరిని చూచెనో వారికి కోరిన వరములు ప్రసాదించుచుండెను. ఒకదినమున చంద్రసేనుడు అడవికి వేటకైపోయి ముని కన్నులు తెరచు దినమగుటచే అదృష్టవశాత్తు అతని ప్రథమ వీక్షణమున పడెను. ముని చంద్రసేనునిపిలిచి తనవాడుక ప్రకారము వరము కోరుకొమ్మనగా రాజు తనకి సంతానము లేని కొరత తీర్చుమనెను. ముని అట్లే యని అతని కొక మామిడిపండు నిచ్చి దాని నింటికి తీసుకొనిపోయి రాణికిచ్చిన ఆమెకు ఒక కుమార్తె కలుగునని చెప్పెను. ఆమెకు తన వరప్రసాదమగుటచే మల్లెల మహాదేవియని పేరు పెట్టవలెనని దగ్గర నున్న ఒక చిత్రమైన పెట్టెను కూడ యిచ్చి అది మల్లెలమహాదేవి కివ్వవలెనని ఆమె 'నాపేరు మల్లెల మహాదేవియే యైన ఈపెట్టె తెరువబడునుగాక' అనిన అది తెరువబడునని చెప్పెను.

ముని చెప్పిన ప్రకారము రాజు పండును, పెట్టెని ఇంటికి తీసుకొనివెళ్లెను. రాణి ఆ మామిడిపండు

రసమును త్రాగి దాని తోలును పారవైచెను. రాణి పనికత్తె సుబ్బులుకు కూడ సంతానము లేకపోవుటచే ఆ తోలును తినివేసెను. రాణికి, సుబ్బులుకి ఒకే సమయమందు కుమార్తెలు కలిగిరి. ఇరువురు మునివరప్రసాదమగుటచే ఒకే పోలిక నుండిరి. ఒకే ఈడువారగుటచే వారికి స్నేహము బాగా కుదిరెను.

మల్లెలమహాదేవి ప్రతిదినము ముని ఇచ్చిన పెట్టెను తెరచి దానిలో నుండు విచిత్రమైన బొమ్మలతో ఆడుకొనుచుండెను. మల్లెల మహాదేవికి పెండ్లి ఈడు రాగానే రాజామెకు పెండ్లిచేయ సంకల్పించెను. విదేహరాజ్యము నేలుచున్న విక్రమసేనుని కుమారుడైన విజయపాలుడు తన కుమార్తెకు తగిన వరుడని తలచి చంద్రసేనుడు వివాహమునకు ముహూర్తము నేర్పరచెను.

పెండ్లికిముందురోజున విజయపాలుడు చంద్రసేనుని కచేరీగదిలో కూర్చొని యుండెను. మల్లెలమహాదేవి విజయపాలుని చూడవలెనని కుతూహలపడి తనచెంతనే యున్న సుబ్బులు కుమార్తెయగు సీతాయితో తన దుస్తులు వేసుకొని తనస్థానములో కూర్చుండిన తాను సీతాయిదుస్తులతో వెళ్ళి రాకుమారుని చూచి వచ్చెదనని చెప్పెను. సీతాయి సరేనని రాకుమారిదుస్తులు వేసుకొని తిన దుస్తుల నామెకిచ్చెను. ఈర్ష్యబుద్ధి గల సీతాయి తన సొగసును చూచుకొని, రాకుమార్తెకు గల సౌందర్యము తన కుండి కూడ తాను దాసీదాననే యని చింతించి, రాకుమారియెడల అసూయచెంది తమ స్నేహమును మరచి రాకుమారికి ద్రోహముచేయ తలపెట్టెను.

విజయపాలుని చూచి తిరిగివచ్చిన రాకుమారి సీతాయిని తనదుస్తులను తనకిమ్మనెను. సీతాయి రాకుమారివలె నటించుచు, తానుమల్లెలమహాదేవిననియు తన కేమియు తెలియదనియు చెప్పెను. మల్లెలమహాదేవి కొంతసేపు సీతాయి హాస్యమాడుచున్నదనితలంచెను. కాని తరువాత తనదుస్తులను తనకిమ్మని ఏడ్చుచుండగా సీతాయి యింకను ఇంటికి రాలేదని సుబ్బి అచ్చటకు వచ్చి ఏడ్చుచున్న రాకుమారి సీతాయియే యని భ్రమించి తీసుకొని వెళ్ళిపోయెను. మల్లెలమహాదేవి ఏడ్చుచు ఎంతసేపు నిజము చెప్పినను ఎవరూ వినలేదు. సీతాయిని రాకుమారి యని భ్రమించి విజయపాలునకిచ్చి వివాహము గావించిరి.

విజయపాలునితో రాకుమారిని పంపునపుడు సీతాయిని కూడ పంపిరి. అచ్చట విజయపాలుడు సీతాయిని మల్లెలమహాదేవియే యని భ్రమించి కాలము గడుపుచుండెను. మల్లెలమహాదేవి తన కీవిధముగా జరిగినందులకు ఎల్లప్పుడూ విచారము నందుచు దుఃఖించుచుండుట విజయపాలుడు కనిపెట్టెను. ఆమె ప్రతిదినము రాత్రి అందరు నిద్రించు సమయమున తన పెట్టెను తెరచి ఆ బొమ్మలతో తన చరిత్రను చెప్పుచుండెను. విజయపాలుడు ఆమె దుఃఖకారణమును తెలుసుకొనగోరి ఆమె వెనువెంటనే తిరుగుచుండెను ఒకనాడామె తన చిత్రపెట్టెను మామూలు ప్రకారంగా 'నా పేరు మల్లెల మహాదేవియే యైనయెడల ఈ పెట్టె తెరువబడునుగాక' అని పలుకుచు తెరచుసమయమున విజయపాలుడామెను చూచి చెయ్యి పట్టుకుని 'నీవు మల్లెల మహాదేవివా సీతాయివికావా' అని ప్రశ్నించెను. అప్పుడామె ఏడ్చుచు సీతాయితనకి చేసిన ద్రోహముగూర్చి చెప్పెను. విజయపాలుడు కోపముతో సీతాయివద్దకి పెట్టెను తీసుకొని వెళ్ళి 'నీవు నిజముగా మల్లెల మహాదేవివే యైనయెడల దీనిని తెరువుము. లేనియెడల నీవుచేసిన ద్రోహమునకు తగిన శిక్ష విధించెదను' అని చెప్పెను. సీతాయి ఆ పెట్టెను ఎంత ప్రయత్నించినను తెరువలేక దాని మూత బిగుసుకుపోయి తెరువబడుటలేదని చెప్పెను. ఎంతోమంది కంసాలులను పిలిపించి తీయించినను ఆ పెట్టె తెరువబడలేదు. తుదకు మల్లెల మహాదేవిని పిలువగా ఆమె వచ్చి ఆ పెట్టెను అవలీలగా మామూలు ప్రకారము తెరచెను. ఇది చూచి మెల్లగా తప్పించుకొని పారిపోవుచున్న సీతాయిని విజయపాలుడు పట్టుకొని మరణశిక్ష విధించబోవుచుండగా మల్లెలమహాదేవి అడ్డువచ్చి సీతాయిని క్షమించుమని కోరెను. విజయపాలుడామె ఉదారబుద్ధికి ఆశ్చర్యపడి సీతాయిని క్షమించెను. సీతాయి తాను చేసిన ద్రోహమునకు పశ్చాత్తాపపడి సిగ్గుచెంది తన జీవితాంతము వారిరువురకు సేవచేయుచు గడుపుదు నని ప్రమాణము చేసెను.

విజయపాలుడు మల్లెల మహాదేవిని అతివైభవముగా వివాహమాడి సుఖముగా రాజ్య మేలుచుండెను. ★

కౌంట్ ఆఫ్ మాంట్‌క్రిస్టో

(8-వ పేజీ తరువాయి)

అన్న పర్సు ఒకటి నా కాళ్లముందు పడింది. తలెత్తి చూడగానే మర్నిదా కిటికీతలుపులు మూసివేసుకుంది."

"విల్‌ఫర్ట్ ఏమైనారు?"

"డాంగ్లే అరెస్టయిన కొన్ని రోజులికి సెంట్‌మిరాన్ కూతుర్ని పెళ్లిచేసుకున్నాడనీ, మార్సెల్స్‌నించి వెళ్లిపోయినాడనీ విన్నాను. అతన్నికూడా అదృష్టదేవత ఆశీర్వదించే ఉంటుంది. డాంగ్లర్ మాదిరిగా ధనం సంపాదించిఉంటాడు. ఫెర్నాండో మాదిరిగా పరపతి సంపాదించుకుని ఉంటాడు. నేనొక్కణ్నే మనుష్యులవల్లా భగవంతుడివల్లాకూడా వంచితుణ్నై, పడి దారిద్ర్యంలో నీచంగా కొట్టుమిట్టాడుతున్నాను."

"లేదు." అన్నాడు ఫాదరీ. "మీరు మోసపోతున్నారు. భగవంతుడు వంచించినట్లు కనపడుతుంది, న్యాయం జరగడానికి కొద్దిగా జాప్యమైనప్పుడు. కాని భగవంతు డెన్నడూ మరిచిపోడు. ఆ క్షణం ఎప్పుడో రాకపోదు. దీనికి తార్కాణం ఇదుగో." ఈ మాటలు చెప్తూ ఫాదరీ జేబులోనించి వజ్రాన్ని తీసి కొడరూస్ చేతికిచ్చాడు: "ఇదిగో దీన్ని తీసుకోండి. ఇది మీదే."

"ఏమిటి? నాదా?" అన్నాడు కొడరూస్ బిగ్గరగా. "మీరు పరిహాసం చేస్తున్నారు!"

"లేదు. ఈ వజ్రాన్ని అతని మిత్రుల కివ్వవలసింది. కాని ఎడ్మండ్‌కి ఒక్కడే మిత్రు డున్నాడని తెలుస్తోంది. అందువల్ల పంపకం అనేది ఉండదు. ఈ వజ్రం తీసుకుని అమ్ముకోండి. దీని విలువ ఏభైవేల ఫ్రాంకులు. దీనితో మీ దారిద్ర్యం తీరిపోతుం దనుకుంటాను."

"అయ్యా!" అన్నాడు కొడరూస్. "దరిద్రుడి కష్టాలు చూసి గాని సుఖాలు చూసిగాని అవహేళన చెయ్యడం న్యాయం కాదు."

"కష్టాలు, సుఖాలు అంటే ఎటువంటివో నాకుచక్కగా తెలుసును. ఇతరుల సుఖదుఃఖాల్ని చూసి పరిహసించను. ఇది తీసుకోండి. తీసుకుని దీనికి ప్రతిగా వృద్ధునిగది కిటికీలో మారెల్ వొదిలిన పర్సు ఇవ్వండి. అదింకా మీదగ్గరే ఉందని మీరు చెప్పారు."

కొడరూస్ లోపలికి వెళ్లివచ్చి పొడుగాటి పెద్ద పర్సు ఒకటి తెచ్చి ఇచ్చాడు. గిల్టు ఉంగరాలతో ఎర్రనిఊలుతో తయారు చెయ్యబడిన పర్సుని ఫాదరీతీసుకున్నాడు. వజ్రాన్ని కొడరూస్‌కి ఇచ్చాడు.

"నిజంగా మీరు దేవదూతలు!" అన్నాడు కొడరూస్. "ఎడ్మండ్ దీన్ని మీచేతి కిచ్చాడని ఎవరికీ తెలియదుకదా? మీరే తీసుకుని ఎవ్వరితోనూ చెప్పకుండా ఉంటే ఎవరికి తెలుస్తుంది? ఏమౌతుంది?"

ఫాదరీ లేచి టోపీ అందుకున్నాడు. "మీరు చెప్పినదంతా నిజమేనని నేను నమ్మవచ్చునా?"

"ఇటు వినండి" అన్నాడు కొడరూస్. "ఇదిగో ఈగూలనే క్రీస్తు సిలువ ఉంది. ఆ పెట్టెమీద బైబిల్ ఉంది. అది తియ్యండి. నేను వీటిపైన చెయ్యుంచి ప్రమాణంచేసి చెప్తాను. జరిగిందేదో అదే చెప్పాను. నిజానిజాలు అఖర్ని భగవంతుని సమక్షంలోనే తెలుస్తాయి."

"మంచిది." అన్నాడు ఫాదరీ. కొడరూస్ నిజమే చెప్పాడని ఇప్పు డతనికి విశ్వాసం కలిగింది "మంచిది. ఈ వజ్రం మీకు అదృష్టం తెచ్చిపెడుతుంది. ఒకరికొకరు హానిచేసుకునే మానవులకి దూరంగా వెళ్లిపోతున్నాను. సెలవు."

ఫాదరీ తలుపు తెరిచి బైటికి వెళ్లాడు. గుర్రమెక్కి వచ్చిన దారినే ఎడమదిక్కుగా వెళ్లిపోయాడు. కొడరూస్ తిరిగి ఇంట్లోకి వెళ్లగానే అక్కడ రాడెల్ ఉంది. ఆమెముఖం బొత్తిగా పాలిపోయి ఉంది. ఆమె శరీరం కంపించిపోతోంది.

"నే నిప్పుడు విన్నదంతా నిజమేనా? నిజంగానే అతను వజ్రాన్ని పూర్తిగా మనకే ఇచ్చేశాడా?" అని ప్రశ్నించింది.

"ఇదిగో, ఇంతకంటె నిజమైన దేముంటుంది?" అంటూ వజ్రాన్ని చూపించాడు.

"ఏమో ఇది విలువలేని తళుకురాయి కాకూడదా?"

కొడరూస్ తెల్లబోయాడు: "ఇతను నాకు తళుకురాయి నెందు కివ్వాలి?"

"వెర్రిమొహమా! నీ రహస్యాల్ని లాగడానికి"

ఈమాటతో కొడరూస్ నిశ్చేష్టుడైనాడు.

"ఆ! ఆ!" అన్నాడు. గభాల్న తన టోపీ అందుకుని, "ఇప్పుడే కనుక్కుని వస్తాను. ఇప్పుడు బుకేర్‌లో సంత జరుగుతూ ఉంటుంది పారిస్‌నించి నగలవర్తకులు వస్తా రక్కడికి. దీన్ని వాళ్లకి చూపిస్తాను. నువ్వు ఇల్లు చూస్తూ ఉండు. నేను రెండు గంటల్లో తిరిగి వస్తాను."

కొడరూస్ పరుగుమీద మెట్లు దిగాడు. ఫాదరీ వెళ్లిన దిక్కుగా కాక, కుడివైపుకు వెళ్లిపోయాడు.

"ఏభైవేల ఫ్రాంకులు" అని గొణిగింది రాడెల్. "నిజంగా ఇది భాగ్యమే. అయినా ఇదీ అంత చెప్పుకోదగినంత భాగ్యం కాదు."

28

ఆ ది జరిగిన మరునాడు ముప్పైఏళ్ల వయస్సుకల బ్రిటిష్ దేశస్థు డొకడు మార్సెల్స్ మేయర్‌ని దర్శించాడు. అతను నీలికోటు తెల్లపంట్లాము తొడుక్కున్నాడు. వేషభూషణాలు చూస్తే భాగ్యవంతుడని తెలుస్తుంది.

మేయర్‌తో అతనిలా చెప్పాడు. "నేను రోమ్‌నగరానికి చెందిన థామ్సన్ ఎండ్ ఫ్రెంచ్ కంపెనీలో గుమాస్తాని. వ్యాపారరీత్యా పదేళ్లనించి మాకు మారెల్ ఎండ్ సన్ కంపెనీతో సంబంధముంది. మా వ్యాపార సంబంధం దాదాపు లక్ష ఫ్రాంకులు వరకూ ఉంటుంది. ఇప్పుడీ కంపెనీ దివాలా తీస్తోందని విన్నందువల్ల మాకు భయం కలిగింది. అందువల్ల పనిగట్టుకుని మీవల్ల ఈ కంపెనీ గురించిన సమాచారం తెలుసుకోవాలని వచ్చాను."

మేయర్ అతనివంక ఎగాదిగా చూసి ఇలా చెప్పాడు. "పాపం మారెల్ నాలుగైదేళ్లుగా దుస్థితిలోపడ్డారన్న సంగతి నాకు తెలుసును. నేను కూడా ఆయనకి పదివేల ఫ్రాంకులవరకూ ఋణమిచ్చినప్పటికీ, ఆయన వ్యాపారంతో నా కెలాటి సంబంధం లేదు. అందువల్ల ఆ కంపెనీ ఆర్థిక స్థితిని గురించి తెలపడం నా పనిగాదు. నేను మేయర్ని. మారెల్‌ని గురించి నన్ను అడగండి. నా హోదాలో నేను చెప్తాను. ఆయన నిజాయితీ అయిన మనిషి. ఇంతవరకూ వ్యాపారంలో ఆయన నీతి తప్పడం కాని మాట తిరగడంకాని నే నెరగను. నేను చెప్పగలిగేది అంతవరకే. పైన ఇంకా తెలుసుకోవాలనుకుంటే కారాగారాల ఇన్స్‌పెక్టర్ బోవిల్‌ని అడగండి. మారెల్ వ్యాపారంలో అతనికి

రెండులక్షల ఫ్రాంకుల పెట్టుబడి ఉంది. భయపడవలసిందేదైనా ఉంటే, నాకంటె అతనికే ఎక్కువ తెలుస్తుంది. అతను నోవాలీ వీధిలో ఉంటున్నాడు.

మేయర్ సంకోచాన్ని గ్రహించి, బ్రిటిష్ దేశస్థుడు వెంటనే నోవాలీవీధికి వెళ్లి బోవిల్‌ని కలుసుకున్నాడు. అతన్ని చూసి బ్రిటిష్ దేశస్థుడు చకితుడైనాడు. అతన్ని చూడ్డం ఇదే మొదటిసారి కాదని తోస్తుంది. కాని బోవిల్ బొత్తిగా పరధ్యానంలో ఉన్నాడు. దేన్నిగురించో పిచ్చిగా ఆలోచిస్తున్నట్లున్నాడు. ఇతర విషయాల్నిగురించి యోచించడానికిగాని, గత విషయాల్ని జ్ఞప్తికి తెచ్చుకోడానికిగాని అతనిమనస్సు స్థిమితంగా లేదు. మేయర్‌ని అడిగినట్లుగానే బ్రిటిష్ దేశస్థుడు బోవిల్‌నికూడా అడిగాడు.

బోవిల్ నిస్పృహచెంది ఇలా చెప్పాడు: "ఏం చెప్పమంటారు? మీరు భయపడుతున్నదంతా నిజం. నేను సర్వనాశనమైపోయాను. మారెల్ కంపెనీలో రెండులక్షల ఫ్రాంకులు పెట్టుబడి పెట్టాను. ఇంకొక పదిహేనురోజుల్లో పెళ్లికావలసిన నా కూతురికి అది కట్నమివ్వవలసిన సొమ్ము. ఇందులో ఒకలక్ష ఈనెల పదిహేనో తేదీన, మిగతాది వచ్చేనెల పదిహేనో తేదీనీ నాకు చెల్లించాలని ఏర్పాటయింది. సరిగ్గా వాయిదాలు దాటకుండా చెల్లించాల మారెల్‌కి తెలియపరిచాను. ఇప్పుడే ఆయన వచ్చివెళ్లాడు. ఓ నౌక ఈ పదిహేనో తేదీకి రేవు చేరకపోయినట్లయితే, ఋణం తీర్చలేనని చెప్తున్నాడు."

"ఋణం చెల్లించలేరని మీరు భయపడుతున్నారా?"

"అసలు ధనమంతా నీళ్లపాలయిందనే అనుకుంటున్నాను."

"అయితే మీ పెట్టుబడి వాటాలు నేను కొనడానికి సిద్ధంగా ఉన్నాను."

"మీరా? అంటే మినహాయింపు ఎక్కువకట్టి తీసుకుంటారా?"

"లేదు. సరిగ్గా రెండు లక్షలకే కొంటాం. మా కంపెనీ ఆలా వ్యాపారం చెయ్యదండి" అన్నాడు బ్రిటిష్ దేశస్థుడు నవ్వుతూ. జేబులోనుంచి బాంక్ నోట్లకట్టలు తీశాడు. దాదాపు నాలుగులక్షలుంటుంది కట్టల్లో.

బోవిల్ ఇలా అన్నాడు: "అయ్యా! నేను ముందుగానే మీకు చెప్తున్నాను. బహుశా ఈ పెట్టుబడి ధనంలో తిరిగి మీకు నూటికి అరవంతులైనా (అంటే దాదాపు రూపాయికి అణా కూడా) రాదు."

"అదంతా నాకు తెలియదు. మా కంపెనీయే చూసుకుంటుంది. థామ్సన్ ఎండ్ ఫ్రెంచ్ కంపెనీ తరఫున వారేది చెయ్యమంటే అది చెయ్యడమే నా పని. నేను సిద్ధంగా ఉన్నాను, డబ్బు లెక్కపెట్టి ఇచ్చెయ్యడానికి. నాకు కావలసిందల్లా కమిషన్ మాత్రమే."

"తప్పకుండా. అందులో తప్పేముంది?" అన్నాడు బోవిల్. "మేం మామూలుగా ఇచ్చేది నూటికి ఒకటిన్నర. మీకు నూటికి మూడు—అయిదు కావాలా? మీ కేం కావాలో చెప్పండి ఇచ్చేస్తాను."

"నేనూ మాకంపెనీ మాదిరిగానే వ్యవహరిస్తాను. మావ్యాపారం ఇల్లా ఉండదు. నేను కోరేది వేరు. మీరు కారాగారాల తనిఖీ ఆఫీసరను కుంటాను. మీదగ్గిర రిజస్టర్లు అన్నీ ఉంటాయి కదా? నాకు రోమ్‌లో విద్య గరపిన వారిపేరు ఫెరయా. ఆయన అకస్మాత్తుగా అంతర్ధానమైనాడు. తరవాత నాకు తెలిసింది, ఆయన ఇఫ్‌కోటలో బందీగా ఉన్నాడని. నిర్బంధంలో ఉండగా ఆయనెలా మరణించారో నేను సమాచారం తెలుకోవాలి"

"నాకతను బాగా గుర్తే." అన్నాడు బోవిల్. "పిచ్చివాడు. ఎక్కడో పెద్ద ధననిక్షేపం పాతబడి ఉన్నట్లు తనకి తెలుసనను కునేవాడు. తన్ని విడిచిపెట్టినట్లయితే ప్రభుత్వానికి లక్షలకి లక్షలు ఇస్తాననేవాడు."

"పాపం. ఆయన నిజంగానే చచ్చిపోయాడా?"

"అవును చచ్చిపోయాడండి, ఆరు నెల్లవుతుంది. కిందటి ఫిబ్రవరిలో. నాకది స్పష్టంగా ఎందుకు జ్ఞాపకం ఉందంటే, అప్పుడొక చిత్రమైన సంఘటన కూడా జరిగిందండి. అతనిగదికి ఏభైగజాల దూరంలో ఒక బోనపార్టిస్ట్ ఏజంటు గది ఉండేది. 1815 లో నెపోలియన్ తిరిగి రావడానికి బాధ్యులైన ముఖ్యులలో ఈ ఏజంటు ఒకడు. ఇతన్ని నేను 1816 లోనో 1817 లోనో చూడ్డం సంభవించింది. అప్పుడతని గదికి వెళ్ళడానికి సిపాయిల్ని కూడా వెంటబెట్టుకోవలసి వచ్చింది. అతని ముఖాన్ని నేనెన్నడూ మరిచిపోలేను."

బ్రిటిష్ దేశస్థుడు చిరునవ్వు నవ్వాడు. "ఏభైగజాల దూరం ఉందనా మీరు చెప్తున్నారు?" అన్నాడు.

"అవునండి. ఏభైగజాలుంటుంది అయితేం? ఈదుండగుడు ఎల్లాసంపాదించాడో పరికరాలు సంపాదించి, రెండుగదులికీ మధ్య సొరంగంతవ్వాడు. ఆసొరంగంద్వారా ఇద్దరూ కలుసుకునే వారు. అది తరవాత బయటపడింది."

"పారిపోవడం కోసంతవ్వింది కాబోలు సొరంగం!"

"అవునవును అందుకే కాని వాళ్లు నిర్భాగ్యులు. ఈలోగానే ఫెరయా మూర్ఛ పట్టుకుని చచ్చిపోయాడు."

"దాంతో తప్పించుకునే కుట్రభగ్నమై పోయిందన్నమాట!"

"చచ్చిపోయిన వాడికంతే, కాని ఆదుండగుడికి కాదు. అసలు అతను చచ్చిపోవడమే డాంటేకి తప్పించుకోడానికి వీలిచ్చింది. ఇఫ్‌కోటలో చచ్చిపోయిన వాళ్లని శ్మశానంలో పాతిపెడతారనుకుని ఉంటాడు. అందువల్ల శవాన్ని తన గదిలోకి తీసుకెళ్లి తన పడక మీద పడుకోబెట్టి, తను గోనెసంచిలో దూరాడు. శ్మశానానికి తీసుకు వెడతారు కదా అని కనిపెట్టుకున్నాడు."

"చాలాసాహసం అనాలి, ఎంతధైర్యం ఉండాలి దీనికి!"

"అబ్బో, ధైర్యానికేంలోటు? చెప్పానుకదా చాలాదుండగుడని! అయితే ప్రభుత్వానికి తనంతటతనే తన పీడవదిలించేశాడు. చచ్చిపోయిన వాళ్లని గోనెల్లోచుట్టి ఇనపగుళ్లు తగిలించి సముద్రంలో పారేస్తారు."

"అలాగా?"

"అవును. డాంటేకికూడా కాళ్లకి ఇనపగుండు కట్టి సముద్రంలో పడేశారు."

"నిజంగా? అంతపని జరిగిందా?"

"జరక్క ఏమౌతుంది? గుట్టలమీదనించి గిరవాటు వేసినప్పుడు వాడు ఆశ్చర్యపడిఉంటాడు. అప్పుడువాడి ముఖంచూస్తే ఎలాగుండేదో!" అని బోవిల్ నవ్వుకున్నాడు.

బ్రిటిష్ దేశస్థుడు కూడా నవ్వాడు "అవును ఊహించవచ్చును. అంటే అతను సముద్రంలో మునిగి చచ్చిపోయాడన్నమాట? ఇఫ్‌కోట గవర్నర్‌కి పిచ్చివాడిబాధ, దుండగుడి బాధ ఒకేసారి వొదిలిపోయాయన్న మాట."

"అవును, వొదిలిపోయాయి."

"అయితే దీన్నిగురించి సంజాయిషీ ఏమీ తయారు కాలేదా?"

"కాకేం! డాంటేకి బంధువు లెవరైనా ఉంటే అతను బతి

కున్నాడో చచ్చిపోయాడో చెప్పమని వారు అడగవచ్చు. అందు వల్ల అతను చచ్చిపోయినట్టు సర్టిఫికెట్ తయారుచేశారు."

"అతని కేమైనా ఆస్తీ అదీ ఉంటే వారసత్వం కూడా నిర్ణయమైపోడానికి కావాలి. అయితే అతను చచ్చిపోయాడని రూఢేనా?"

"అ రూఢే! సర్టిఫికెట్ సిద్ధంగా ఉంది. ఎవరడిగితే వాళ్లకివ్వడానికి."

"సరే. మన రిజిస్టర్లమాట చెప్పండి"

"అవునవును. ఈ కథలో రిజిస్టర్లమాట మరిచిపోయాను. ఫెరయాని గురించిన సమాచారం కావాలికదూ? నాతో లోపలికి రండి. అక్కడ రిజిస్టర్ చూపిస్తాను."

బోవిల్ లేచి పక్కగదిలోకి వెళ్లాడు. బ్రిటిష్ దేశస్థుడు అతన్ని అనుసరించాడు. అతన్ని ఒక కుర్చీలో కూర్చోబెట్టి, ఒక రిజిస్టర్ అతనిముందు పడేసి సావధానంగా చూడమని చెప్పి బోవిల్ ఇంటిలోకి వెళ్లిపోయాడు.

రిజిస్టర్ లో ఫెరయా చచ్చిపోయినాడన్న సర్టిఫికెట్ సులువుగానే కనపడింది. బోవిల్ చెప్పినకథ అతనికి వచ్చినట్లుంది. గబగబా పేజీలు తిప్పి డాంటేకి సంబంధించిన కాగితాలు చూశాడు.

ఆ కాగితాల్లో అంతా వ్రాసిఉంది. నేరారోపణ, పరీక్ష, మారెల్ అర్జీ, దానిపైన విల్ ఫర్ట్ సంతకం, అన్నీ కనపడ్డాయి. నేరారోపణ చేసిన కాగితాన్ని తీసి మడిచి జేబులో పెట్టుకున్నాడు. పరీక్ష వివరాలు చదివాడు. అందులో నయర్ టైర్ పేరుమాత్రం ఎక్కడా కనపడలేదు. విల్ ఫర్ట్ సలహా ప్రకారం 1815 ఏప్రిల్ లో మారెల్ పెట్టుకున్న అర్జీ చదివాడు. సదుద్దేశంతోనే మారెల్ డాంటీ నెపోలియన్ కి చేసిన సేవను గురించి ఉత్ప్రేక్షించి వ్రాశాడు అర్జీలో. ఇదంతా నిజమేనని తన అభిప్రాయం తెలుపుతూ విల్ ఫర్ట్ పక్కనే సంతకం పెట్టాడు.

ఇప్పుడీ వ్యవహారమంతా స్పష్టంగా తెలిసిపోయింది. ఈ అర్జీని విల్ ఫర్ట్ దాచేసి, నెపోలియన్ మళ్ళీ పదవిభ్రష్టుడైన తరవాత విల్ ఫర్ట్ ఉపయోగించాడన్నమాట.

మెల్లిగా పేజీలుతిప్పుతుంటే ఒకచోట తనపేరుప్రక్కనే ఈవాక్యాలు కనపడ్డాయి. "ఎడ్మండ్ డాంటీ-బోనపార్టిస్ట్, దొడ్డ స్వపరుడు. నెపోలియన్ ఎల్బానించి తిరిగి రావడానికి చాలా తోడ్పడ్డాడు. ఇతన్ని రహస్యనిర్బంధంలో ఉంచాలి. గట్టి పహరా పెట్టాలి."

ఈవాక్యాలకింద మరొకదస్తూరీలో "ఇంక ఇతనివిషయంలో చెయ్యదగిందేదీ లేదు" అని వ్రాసిఉంది.

దస్తూరీలు పోల్చిచూడగా ఈ వాక్యాలు విల్ ఫర్ట్ వ్రాసినవేనని స్పష్టపడింది. కిందిమాటలు ఎవరో తనిఖీ ఫీసగు ఉపకారం చెయ్యడానికి ప్రయత్నించి, పైవాక్యాలుచదివి, భయపడి ఇలా వ్రాసి ఉంటాడు.

గదిలోకివచ్చి కూర్చున్న బోవిల్ పత్రిక చదవడంలో, బ్రిటిష్ దేశస్థుడు డాంగ్లర్ వ్రాసినది నేరారోపణ పత్రాన్ని తీసి దాచుకోడం గమనించలేదు. ఆ పత్రంమీద ఫిబ్రవరి 27, మార్సేల్స్ తపాలాముద్ర ఉంది. బోవిల్ ఇది చూసినప్పటికీ, ఈపత్రం ఏమంత అవసరమయింది కాదనుకుని, చూసినట్టు ఊరుకునేవా . దీనికంటె అతని రెండులక్షలఫ్రాంకులు ముఖ్యం.

రిజిస్టర్ మూసేసి బ్రిటిష్ దేశస్థుడు లేచినిలబడ్డాడు. "మీకు కృతజ్ఞుణ్ని. నా పనైపోయింది. ఇంక నేను నావాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి. మీకు మారెల్ ఎంత ఋణంఉన్నారో వ్రాసిఇచ్చి, ధనం ముట్టినట్లు నాకు రసీదివ్వండి. మీకు ధనం ఇచ్చేస్తాను." అన్నాడు.

బోవిల్ గబగబా రసీదు వ్రాసి, అదీ, ఋణపత్రం ఇచ్చేశాడు. బ్రిటిష్ దేశస్థుడు నోట్లు లెక్కపెట్టి ఇచ్చేశాడు. ★

కొరియా చీనాలపట్ల అమెరికా వ్యవహార విధానం

ఈ వ్యూహాన్ని నిర్ణయించడానికిగాను మెకార్థర్ బర్తరఫ్ కాకముందే అమెరికన్ సేనానుల మధ్య సమాలోచనలు జరిగాయి. ఈ సమాలోచనల ఫలితంగా రెండు రకాల వ్యూహాలు తేలాయి. అమెరికన్ ప్రభుత్వం ఈ రెండింటికీ మధ్యస్థంగా ఒక విధానాన్ని నిర్ణయించుకుంది. ప్రభుత్వం నిర్ణయించిన విధానంలోని వివరాలు తెలియవు. కాని ఏ పరిస్థితులలోనైనా సరే యుద్ధం ఎటు తిరిగి ఎటువచ్చినా సరే, అమెరికన్లకు చీనాతో రాజీ అసాధ్యమని తేలిపోయింది. ఐక్యరాజ్యసమితి సమిష్టిచర్యల నిర్ణయసంఘం చీనాపైన చర్యలు తీసుకోవాలని అమెరికా ఒత్తిడి చేస్తోంది. చీనాతీరం పొడుగునా నాకాబలాన్ని పెట్టి దిగ్బంధం చెయ్యాలనీ, ఆర్థికంగా ఆంక్షలు విధించాలనీ కోరుతోంది. కొరియాలో మళ్ళీ సమితి సేనలు వెనుకంజ వెయ్యవలసిన గతి పట్టినట్లయితే, అమెరికన్ విమానాలు మంచూరియాపై దాడిచేసినా, ఇంక బ్రిటన్ మొదలైన దేశాలు నివారించలేవు. కొరియా యుద్ధానికి సంబంధించనట్లుగా, చియాంగ్ సేనలచేత చీనాకు దక్షిణాన కల హైనాన్ ద్వీపంపైన దండయాత్ర చేయించడానికి ప్రయత్నం జరుగుతోంది. దండయాత్ర సన్నాహానికిగాను చియాంగ్ సేనల్ని తయారు చెయ్యడానికి అమెరికన్ ప్రభుత్వం మిలిటరీమిషన్ పంపింది. చీనా కమ్యూనిస్టు ప్రభుత్వం ఆర్థికంగా ఒలపడకముందే వారి కార్యక్రమాల్ని భగ్నం చెయ్యడానికి యత్నాలు జరుగుతున్నాయి. ఈ యత్నాలతోపాటు చీనా తీరప్రాంతంలోనూ, మంచూరియాలోనూ రైలు మార్గాల్ని ధ్వంసంచేసే కార్యక్రమాన్ని కలిపినట్లయితే, అప్పుడది చీనాతో పరిమిత యుద్ధం అవుతుంది.

కొరియాలో దక్షిణ కొరియన్ల సైన్యాల్ని దండయాత్రకి సిద్ధపరిచి, భయం రెచ్చగొట్టి ఉత్తరకొరియన్లను యుద్ధానికి పురిగొల్పవచ్చు. ఇండోచీనా, జర్మనీ, జపాన్ లలో సన్నాహాలు జరుగుతున్నాయి. చీనా కమ్యూనిస్టుల్ని యుద్ధానికి పురిగొల్పడానికి కారకులెవరైనప్పటికీ, దురాక్రమణ చేసిన నేరాన్ని వారిపైన మోపినట్లయితే, ఇటువంటి పరిమిత యుద్ధానికి గాని, మరొక వ్యూహానికి గాని బ్రిటన్ మొదలైన దేశాలు ఇదివరలో వలెనే అంగీకరించక తప్పనిసరి ఏర్పడవచ్చును. ★

Regd. No. M. 4479

శ్రీమద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు



ఆరవ ముద్రణము

సంస్కృతమూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ
వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన
పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.



★

ఖద్దరు బైండు

వెల రు 4-0-0 లు.

తపాలాఖర్చు రు. 0-9-0.

★

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212, మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, ThambuChettySt Madras.